www.manatelangana.news

Mana Telangana


# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 251 | శుక్రవారం | 2 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00






## యూరప్ అంతటా విమాన సర్వీసులు రద్దు



**లండన్ :** ఉధృత స్థాయి మంచు, భీకర మంచుతుపాన్ల ప్రభావంతో యూరప్‌లో జనజీవితం స్తంభించిపోయింది. గురువారం యూరప్ అంతటా పలు విమాన ప్రయాణాలను రద్దు చేశారు. కొన్నింటిని ఆలస్యంగా నిర్వహించారు. దీనితో అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. ఉత్తరాది నుంచి దక్షణ ప్రాంతపు మధ్యధరా తీర ప్రాంతాల వరకూ హిమపాతం , భారీ మంచుతుఫాన్ల ప్రభావం పడింది. ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో ఈ ఏడాది మంచుతుపాన్లు యూరప్‌ను దెబ్బ తీస్తున్నాయి. ఓ వైపు విమాన ప్రయాణాలు ఆగిపోగా, మరోవైపు పలు చోట్ల రహదారులు అడుగుల ఎత్తున మంచుతో దిగ్బంధం అయ్యాయి. వాహనదార్లు మార్గమధ్యంలో చిక్కుపడ్డారు. స్కూళ్లు మూతపడ్డాయి. గురువారం అంతా ఎముకలు కొరికే చలి గాలుల ప్రభావం ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. హిమపాతం, మంచుతుపాన్లు తాకిడితో యూరప్‌లో ఇప్పటికి మృతుల సంఖ్య 50 దాటింది. పోలండ్‌లో గురువారం మరో ముగ్గురు ఈ విపరీత వాతావరణంతో ప్రాణాలు వదిలారు. దీనితో ఈ దేశంలో ఈ విధంగా మృతి చెందిన వారి సంఖ్య ఇప్పటికీ 21కి చేరింది. సరైన నివాసాలు లేకుండా రహదారుల వెంబడి ఉండేవారు, నిరుపేదలు ఎక్కువగా బాధితులు అవుతున్నారు.

## కంపోస్ట్.. బయో ఎరువుల వినియోగాన్ని పెంచాలి

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : కంపోస్ట్, బయో ఎరువుల వినియోగాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. వీటి వాడకంపై రైతుల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది. ఎన్‌పికె (నైట్రొజన్, ఫాస్పరస్, పొటాష్) మిశ్రమ ఎరువుల వాడకం కూడా పెరిగేలా చూడాలని కోరింది. ఇటీవల జరిగిన ఢిల్లీలో జరిగిన వానాకాలం –2018 సన్నద్ధత సదస్సులో ఎరువుల వినియోగంపై ప్రధాన చర్చ జరిగింది. ప్రస్తుతం రాష్ట్రాలు ఎరువుల వినియోగంపై లెక్క తేల్చాలని, ఏ విధానాన్ని అనుసరించి కేటాయింపులు అడుగుతున్నారో తెలియజేయాలని, అవసరాలను అంచనా వేయడానికి అనుసరిస్తున్న పద్ధతులేంటి అని రాష్ట్ర అధికారులను కేంద్రం ప్రశ్నించింది. చాలా రాష్ట్రాలు భూసార ఫలితాల కార్డుల ఆధారంగా ఎరువుల కేటాయింపులు కోరుతున్నట్లు చెప్పగా, కొన్ని రాష్ట్రాలు మాత్రం వాటి పరిధిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చేసిన 'సాధారణ సిఫారసుల' ప్రకారం కోరుతున్నట్లు తెలిపాయి. 'ఐకార్' (భారత వ్యవసాయ పరిశోధనా మండలి) మాత్రం ఏ రాష్ట్రానికి ఎంత మొత్తంలో ఏయే ఎరువులు కేటాయించలనేది భూసార పరీక్షలు, పంటల ఫలితాల అధ్యయనాల ప్రకారం చేయాలని పేర్కొంది. కంపోస్ట్, సేంద్రియ ఎరువు దుర్వాసన వస్తుండటంతో విక్రయాలకు డీలర్లలో ఆసక్తి కొరవడిందని, నిల్వ చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్ల అభిప్రాయపడ్డాయని అధికారులు పేర్కొన్నారు. వీటిని రైతులకే బల్క్‌గా అమ్మాలని ఆదేశించింది.

**నాణ్యత పరీక్షకు ల్యాబ్‌లు :** సేంద్రియ, కంపోస్ట్ ఎరువుల నాణ్యత పరీక్షించేందుకు ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతిపాదనలు పంపిస్తే ఆర్‌కెవివై–రఫ్తార్ , ఎన్‌ఎమ్‌ఎస్‌ఎ పథకాల కింద కేటాయిస్తామని కేంద్రం రాష్ట్రానికి తెలిపింది. ఒకవేళ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఆలస్యమైతే, కేంద్రం ప్రభుత్వ ఆధ్వర్యంలోని ల్యాబ్‌లకు నిర్ధేశించుకున్న లక్ష్యాల ప్రకారం నమూనాలను సేకరించి పంపాలని సూచించిం ది. నివేదికల విషయంలో ఆలస్యమౌతోందని రాష్ట్రాలు చెప్పగా, ఇకమీదట అలా ఉండదని చెప్పినట్లు తెలిసింది.





## 'ట్రావెల్' మాఫియా దందా

- **చేతివాటం ప్రదర్శిస్తున్న ఏజెన్సీలు**
- **లైసెన్స్ ఉన్నవి 30, నడుస్తున్నవి 5 వేలకుపైగానే**
- **ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు**



ఏజెన్సీ నిర్వాహకులు

మోసపోయిన బాధితులు



**మన తెలంగాణ**/హైదరాబాద్ : విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించిన బషీర్‌బాగ్‌లోని ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుల మోసాలు ఇటీవలే వెలుగు చూశాయి. అమీర్‌పేట్‌లో మరో ఓ కన్సల్టెన్సీ సంస్థ మోసాలు గురువారం తాజాగా వెలుగులోకి వచ్చాయి. ప్రతి రోజూ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ట్రావెల్ ఏజెన్సీల మోసాలు బయటపడుతూనే ఉన్నాయి. ఉద్యోగాల పేరుతో విదేశాలకు అక్రమంగా మనుషులను రవాణా చేస్తున్న ట్రావెల్ ఏజెన్సీల మాఫియా దందా రాష్ట్రంలో జోరుగా సాగుతోంది. ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాల పేరుతో బాధితుల నుంచి లక్షలాది రూపాయలు దండుకున్న అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ చేతులెత్తేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణలో కేవలం 30 ట్రావెల్ ఏజెన్సీలకు మాత్రమే లైసెన్స్‌లను మంజూరు చేయగా అక్రమంగా 5 వేలకుపైగా నడుస్తున్నాయి. పోలీసుల అండదండలతోనే అవి కార్యక్రమాలను సాఫీగా నడిపిస్తున్నాయనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అమాయక, పేద, మధ్య తరగతి యువతనే ఏజెన్సీలు టార్గెట్ చేసుకుని కోట్లాది రూపాయలు దండుకుంటున్నాయి. ఏటా వేలాది మంది నిరుద్యోగులు ఇలాంటి ఏజెన్సీల చేతిలో మోసపోతున్నారు. బాధితులెవరైనా ఏజెన్సీ కార్యాలయానికి వచ్చి నిలదీస్తే వారిపైనే తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారు. పోలీసులు ట్రావెల్ ఏజెన్సీలతో మిలాఖతై రాజీ ప్రయత్నాలూ చేస్తున్నారు. ఒక వేళ అంగీకరించకపోతే బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్న ఉదంతాలు సైతం వెలుగు చూశాయి. ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు రాజకీయ, డబ్బు పలుకుబడితో బాధితులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. వేధింపులు భరించలేని పరిస్థితుల్లో బాధితులు రాజీకి మొగ్గుచూపుతున్నారు. విదేశాలలో ఉద్యోగాల పేరుతో నిలువునా దోచుకున్న బషీర్‌బాగ్‌లోని 'ట్రావెల్ పాయింట్ హెచ్ సోల్యూషన్స్ ఇండియా' నిర్వాహకులు షాకేరా బేగం, నజీముద్దీన్‌లపై పాతబస్తీకి చెందిన అస్లంఖాన్, నసీర్‌లతో పాటు జగిత్యాలకు చెందిన షేక్ చాంద్‌పాషా అనే ముగ్గురు బాధితులు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. సదరు ట్రావెల్ ఏజెన్సీపై చర్య లు తీసుకోవాలని పది రోజుల క్రితం నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాస్‌రావును కేంద్ర అధికారులు ఆదేశించినా ఇంత వరకు ఎలాంటి చర్యలూ లేవు. కొంత మంది ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు ఐపిఎస్‌లకు, వారి పిల్లలకు విమాన టికెట్లు సమకూరుస్తుండడంతో చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పేద వర్గాలే టార్గెట్ :** ట్రావెల్ ఏజెన్సీలు పేద వర్గాల యువతనే టార్గెట్ చేస్తున్నాయి. విదేశాలలో ఉద్యోగాల పేరుతో వారి నుంచి రూ.లక్ష మొదలు రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. విదేశాలకు వెళ్లిన తర్వాత ఆ యువకులకు ట్రావెల్ ఏజెన్సీల అసలు మోసాలు అర్థమవుతున్నాయి. ట్రావెల్ ఏజెన్సీలు తొలుత చెప్పిన ఉద్యోగం, జీతం, నిబంధనలు కాకుండా ఆ దేశాల్లో వేరే ఉద్యోగాలు ఇవ్వడం, జీతం తక్కువ చేయడం, 18 గంటలు పనిచేయించుకోవడం జరుగుతుంది. దీంతో వారు తిరిగి ఎలాగో అలా అష్టకష్టాలు పడి స్వదేశానికి వచ్చేస్తున్నారు. తమను అన్యాయం చేశారని నిలదీసే శక్తి పేదవర్గాల యువతకు లేకపోవడం ఒక అంశమైతే, ఎవరైనా ముందుకొస్తే వారిని పోలీసులతో సముదాయిస్తారు. లేదంటే కార్యాలయంపై దాడి చేశారంటూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారు.

## మాదిగజాతిని మోసం చేసిన ప్రభుత్వాలు



**మన తెలంగాణ** /హైదరాబాద్ : గత 20 ఏళ్లుగా ఎస్‌సి వర్గీకరణ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మాదిగ జాతిని మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల మాజీ ప్రిన్సిపల్ గాలి వినోద్‌కుమార్, ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి విమర్శించారు. మాదిగ అమరవీరుల దినం సందర్భంగా గురువారం ఆర్ట్స్ కాలేజ్ వద్ద జరిగిన కార్యక్రమంలో వారు ప్రసంగించారు. కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎస్‌సి వర్గీకరణకు మద్దతు ఇస్తున్నప్పటికీ రాజకీయ చిత్తశుద్ధి లోపించిదని గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఎస్‌సి వర్గీకరణ చేయనట్లయితే మరోసారి మాదిగ విద్యార్థుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని లింగస్వామి హెచ్చరించారు. ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.సంగమేశ్వర్, ఓయు శాఖ అధ్యక్షులు కొమ్ముశేఖర్ పాల్గొన్నారు.

## మహాకూటమితో ఎన్నికలకు వెళ్దాం?

**చంద్రబాబును కోరిన టిటిడిపి నేతలు**

**పొత్తులపై ఇప్పుడేమి మాట్లాడొద్దు : బాబు**

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రంలో మహాకూటమితో కలిసి ఎన్నికలకు వెళ్లాలని టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి సిఎం చంద్రబాబును పలువురు తెలంగాణ టిడిపి నేతలు కోరారు. పొత్తు లేదని బిజెపినే ప్రకటించిందని, ఇక మిగిలింది టిఆర్‌ఎస్, కాంగ్రెస్ అని అధినేతనే ప్రకటించిన నేపథ్యంలో మెజారిటీ నేతలు మహాకూటమి వైపు మొగ్గు చూపారు. జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసంలో గురువారం జరిగిన టిడిపి ముఖ్య నేతలు సమావేశంలో ఎక్కువ మంది ఈ మేరకు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ భేటీలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్. రమణ, పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌ఏ సండ్రవెంకటవీరయ్య, నాయకులు నామా నాగేశ్వర్‌రావు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, ఇ.పెద్దిరెడ్డి, బుచ్చిలింగం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పొత్తుల అంశాన్ని నాయకులే ప్రస్తావించినట్లు తెలిసింది. మెజారిటీ నేతలు మహాకూటమితో పోవాలని, ఒకరిద్దరు టిఆర్‌ఎస్‌తో వెళ్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ పొత్తులపై ఇప్పుడేమి నిర్ణయం ఉండదని, రాష్ట్రంలో పార్టీకి ఉన్న ఓటింగ్ శాతాన్ని పరిశీలించుకొని, సమయం, సందర్భం చూసి ఎన్నికల ముందు పొత్తుల గురించి ఆలోచిద్దామని చెప్పినట్లు తెలిసింది. అయితే టిఆర్ఎస్‌తో పొత్తుకే అధినేత మొగ్గుచూపుతున్నట్లుగా కనిపిస్తోందని సమావేశం అనంతరం ఒక నాయకుడు "మన తెలంగాణ"తో అన్నారు. సమావేశంలో చంద్రబాబు నాయుడు రాష్ట్ర నాయకత్వ పనితీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది. కార్యకర్తలు బాహాటంగానే ప్రస్తుతమున్న నాయకులపై నమ్మకం లేదని అంటున్నారంటే ఏ స్థాయిలో పనిచేస్తున్నారో అర్థమౌతుందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.

**త్వరలో మూడు బహిరంగ సభలు :**
రాష్ట్రంలో త్వరలో మూడు బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు టిడిపి నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ త్వరలో ఖమ్మంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని, దానికి చంద్రబాబును ఆహ్వానిస్తామన్నారు. ఖాళీగా ఉన్న కమిటీలు, నియోజవర్గ బాధ్యుల ప్రక్రియను మేనెల నాటికి పూర్తి చేసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. మార్చి 29 తరువాత మే 28 వరకు ఏయే కార్యక్రమాలు రూపకల్పన చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలో చర్చించి కార్యక్రమాలను రూపొందించుకుని ప్రజలను సమీకరించి సమస్యలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని మార్చి 29వ తేదీ వరకు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు ఆదేశించినట్లు చెప్పారు. పార్టీ పదవులలో ఉన్న నాయకులు జిల్లాలో విస్తృతంగా పర్యటించాలని చంద్రబాబు సూచించారన్నారు.

## పురుషోత్తమరెడ్డి కేసులో శ్రీనివాస్‌రెడ్డికి ఐదు రోజుల పోలీసు కస్టడీ

- **తీర్పునిచ్చిన ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం**

**మన తెలంగాణ**/హైదరాబాద్:హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి ఆదాయానికి మించిన కేసులో అతని బావమరిది శ్రీనివాస్‌రెడ్డికి ఐదు రోజుల పోలీసు కస్టడీ మం జూరు చేస్తూ గురువారం ఏసిబి ప్రత్యేక న్యా యస్థానం తీర్పు చెప్పింది. ఈ కేసులో ఇప్పటికే పురుషోత్తమరెడ్డిని ఆరు రోజుల పాటు విచారించిన ఎసిబి అధికారులు శ్రీనివాస్‌రెడ్డిని కూడా విచారించాలంటూ పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు ఈ మేరకు అనుమతిచ్చింది. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో శ్రీనివాస్‌రెడ్డిని ఎసిబి అధికారులు శుక్రవారం తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. శ్రీనివాస్‌రెడ్డి పేరుపై ఉన్న ఆస్తులు ఎలా వచ్చాయి, పురుషోత్తంరెడ్డి బినామీ పేరుతో పెట్టుబడులు పెట్టిన అంశంపై వివరాలు సేకరించనున్నారు.

## ప్రధానిపై సిఎం పద్ధతిలేని పదజాలం

- **ముఖ్యమంత్రి వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది**
- **కెటిఆర్‌తో మాట్లాడా.. 'స్లిప్ ఆఫ్ ది టంగ్ అయింది' అన్నారు**
- **కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్**



**మన తెలంగాణ**/హైదరాబాద్: 'ప్రధానమంత్రి గురించి ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత నేను ఇక్కడ కార్యక్రమంలో పాల్గొనడం బాగుండదు. దీంతో నేను హాజరుకావాలా వద్దా అని మంత్రి కెటిఆర్‌తో ఫోన్‌లో మాట్లాడాను. స్లిప్ ఆఫ్ ది టంగ్ అయింది. నాన్నగారు (సిఎం కెసిఆర్) అలా మాట్లాడు తారని అనుకోను అని కెటిఆర్ నాతో చెప్పారు. అందుకే వచ్చాను' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దేశ ప్రధానిని ఏక వచనంతో, పరుష పదాలతో ఒక ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలు తామందరికీ బాధ కలిగించాయని, దీనిపై వివరణ ఇచ్చి ఉంటే బాగుండేదని ఆమె వ్యాఖ్యానించారు. ఏ ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేసినా అది పద్ధతి కాదని ఆమె అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన బిజెపి మాజీ జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మ ణ్ నాల్గవ వర్ధంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఇద్దరూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పదవులలో ఉన్నారని, అలాంటిది ప్రధానిపై ముఖ్యమంత్రి ఉపయోగించిన పదజాలం తనకు నచ్చలేదని, సిద్ధాంతపరంగా వైరుధ్యాలుంటే దానిపై విమర్శలు చేస్తే వినేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని, కానీ చెప్పాల్సిన పద్ధతిలో చెబితే అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు ఇలా మాట్లాడడం సరి కాదన్నారు. హైదరాబాద్‌లోని ఆదిభట్లలో జరిగిన బోయింగ్– టాటా హెలికాప్టర్ ఉత్పత్తి కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావ డానికి ముందే ప్రధానిపై సిఎం చేసిన వ్యాఖ్యల గురించి మంత్రి కెటిఆర్‌తో మాట్లాడానని వివరించారు. ప్రారంభోత్సవ వేదికపైన తన పక్కనే కూర్చున్న మంత్రి కెటిఆర్‌ను మరోసారి సిఎం వ్యాఖ్యలను లేవనెత్తానని, ఒక వేళ అది 'స్లిప్ ఆఫ్ ది టంగ్' అయినప్పటికీ ఆ తర్వాతనైనా సిఎం వివరణ ఇచ్చి ఉంటే బాగుండేదని అన్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగానే రక్షణ రంగంలో తెలంగాణ ప్రాంతంలో హెలికాప్టర్ తయారీ కంపెనీ నిర్మాణమవుతోందని, అయితే ఈ రాష్ట్రంపై ప్రభావం పడరాదన్న ఉద్దేశంతోనే తాను ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆమె వివరించారు.

**బంగారు లక్ష్మ ణ్‌కు నివాళ్ళు :**
అంతకుముందు బిజెపి కార్యాలయంలో బిజెపి మాజీ జాతీయ అధ్యక్షులు బంగారు లక్ష్మ ణ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్ నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మ ణ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ కృష్ణదాస్, బిజెపి నాయకులు ఇంద్రసేనారెడ్డి, జి. కిషన్‌రెడ్డి, పాల్గొన్నారు.



## హెచ్ బ్లాక్‌ను అప్పగించండి



- **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ విజ్ఞప్తి**

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : సచివాలయంలోని హెచ్ బ్లాక్ లేదా మరో భవనాన్ని ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం అవసరాల నిమిత్తం అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ విజ్ఞప్తి చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల మధ్య గత నెల 27వ తేదీన జరగాల్సిన సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని ఎజెండాలో పెట్టుకున్నప్పటికీ అనివార్య కారణాలతో ఆ సమావేశం వాయిదా పడడంతో పరిష్కారం లభించలేదు. మళ్ళీ తదుపరి సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఇంకా స్పష్టత రాలేదు. ఇంతకాలం రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం సచివాలయ ప్రాంగణంలోని 'హెచ్ బ్లాక్'లో ఉండగా ఇప్పుడు రెండు రాష్ట్రాలకు వేర్వేరు సిఇఓలను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడంతో తెలంగాణ సిఇఓకు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అనివార్యమైంది. తగిన స్థలం, భవనం దొరకక ఇబ్బంది ఏర్పడింది. రెండు రాష్ట్రాల మధ్య జరిగిన విభజనలో భాగంగా హెచ్ బ్లాక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించబడింది. తెలంగాణకు కేటాయించబడిన ఏ, బి, సి, డి బ్లాకుల్లో సిఇఓకు కార్యాలయం ఏర్పాటుచేయడానికి గదులుగానీ, ఛాంబర్లుగానే లేవు. హెచ్ బ్లాక్‌లో ఖాళీ ఉన్నప్పటికీ అది ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఉన్నందువల్ల తెలంగాణ ఏకపక్షంగా వినియోగించుకోడానికి వీల్లేకపోయింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిఇఓ కార్యాలయాన్ని, పబ్లిసిటీ కేంద్రాన్ని మాత్రమే నిర్వహిస్తోంది. మిగిలిన భవనమంతా ఖాళీగానే ఉంది. రెండు రోజుల క్రితమే పబ్లిసిటీ సెల్‌ను కూడా ఖాళీ చేసి వెళ్ళిపోవడంతో తగినన్ని ఛాంబర్లు, గదులు ఖాళీగానే ఉన్నాయి. అందువల్ల తెలంగాణ సిఇఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోడానికి తగిన అనుమతిని ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తెలంగాణ సిఇఓను ప్రకటిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుని పది రోజులవుతున్నా ఇప్పటికీ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడానికి తగిన స్థలం లేకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే వారం రోజులైనా సమాధానం రాలేదు. రెండు రాష్ట్రాలూ బడ్జెట్ సమావేశాల్లో తలమునకలైనందువల్ల ఇప్పట్లో ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగే సూచనలు కనిపించడంలేదు. సమావేశంతో సంబంధం లేకుండా ఇద్దరు కార్యదర్శులే పరస్పరం మాట్లాడుకుని ఒక నిర్ణయం తీసుకోవడం కష్టమేమీ కాదని రెండు రాష్ట్రాల అధికారులూ అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ తగిన భవనాలు లేకపోవడంతో కార్యాలయం మాత్రం నెలకొనలేదు. ఈ భవనాన్ని అప్పగించినట్లయితే ఆ కార్యాలయాన్ని కూడా ఏర్పాటుచేయవచ్చని తెలంగాణ ప్రభు త్వం భావిస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య పరసర్ప సహకారం గతంకంటే మెరుగుపడినందువల్ల ఈ వారంలోనే తెలంగాణ విజ్ఞప్తికి ఏపీ నుంచి సానుకూల స్పందన రావచ్చని తెలంగాణ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## 13న తెలంగాణ బంద్?

**మన తెలంగాణ**/హైదరాబాద్: పార్లమెంట్‌లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టడంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా ఈ నెల 13న చేపడుతున్న తెలంగాణ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, విరసం నాయ కులు వరవరరావును గురువారం ఆయన వేర్వేరుగా కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో నే ఎస్‌సి వర్గీకరణ బిల్లును పెట్టాలనే డిమాండ్‌తో చేపడుతున్న తమ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని, బంద్‌ను జయప్రదం చేయాలని మందకృష్ణమాదిగ విజ్ఞప్తి చేశారు.

# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 251 | శుక్రవారం | 2 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00




# తెర మరుగు

## ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో నేటి నుంచి థియేటర్ల బంద్



**చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం**

**డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు విపిఎఫ్ ధరలు తగ్గించే వరకు కొనసాగనున్న మూసివేత**

**ఆట మధ్యలో సుదీర్ఘ సమయం ప్రకటనలు, ప్రేక్షకులకు ఇష్టమైన సినిమా ట్రైలర్లకు అధిక వసూళ్లు, తదితర సమస్యలపై జెఎసి అసంతృప్తి**

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వర్చువల్ ప్రింట్ ఫీజు (విపిఎఫ్)ను తగ్గించేవరకు దక్షిణాదిన ఐదు రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమా థియేటర్ల బంద్ పాటించాలని దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక, కేరళలో థియేటర్లను బంద్ చేస్తున్నట్టు జెఎసి చైర్మన్ డి.సురేష్‌బాబు తెలిపారు. ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలులు సంయుక్తంగా ఈ జెఎసిని ఏర్పాటు చేశారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రాంతీయ భాష చిత్రాలకు విపిఎఫ్ ధరలను తగ్గించే వరకు థియేటర్ల బంద్ కొనసాగుతుందని జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఈ బంద్‌కు ఐదు రాష్ట్రాల్లోని నిర్మాతలు, పంపిణీదారులు కూడా మద్దతిచ్చారు. హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో సురేష్‌బాబు మాట్లాడుతూ "కేవలం విపిఎఫ్ ధరలు ఎక్కువగా ఉండటమే కాదు... మాకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. కొన్నిసార్లు సినిమా థియేటర్లలో 20 నిమిషాల

తరువాయి 6లో





# హైదరాబాద్‌లో అపాచీ విడి భాగాలు

- ఆదిభట్లలో టాటా బోయింగ్ ఏరోస్పేస్ హెలికాప్టర్ విడి భాగాల యూనిట్ ప్రారంభం
- స్ఫూర్తి మేకిన్ ఇండియా : నిర్మలా సీతారామన్
- రక్షణ పరికర తయారీ కేంద్రం కేటాయించాలి : కెటిఆర్

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : బోయింగ్, టాటా సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఆదిభట్లలో ఏర్పాటైన 'టాటా బోయింగ్ ఏరో స్పేస్' హెలికాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్‌ను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్రమంత్రి కెటిఆర్‌లు

తరువాయి 6లో

# పరారైన నిందితుల ఆస్తులన్నింటి జప్తు

**బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం**

**న్యూఢిల్లీ:** బ్యాంకులకు టోపీ పెట్టడం వంటి ఆర్థిక నేరాల్లో నిందితులై దేశాన్ని విడిచి పెట్టి పరారైన వారి ఆస్తులన్నింటినీ జప్తు చేసుకునేందుకు వీలు కల్పించే బిల్లును కేంద్ర మంత్రిమండలి ఆమోదించింది. గురువారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ బిల్లును ఆమోదించినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులకు తెలిపారు. భారీ స్థాయిలో బ్యాంకు రుణాలు పొంది విదేశాలకు పరారై, ఆర్థిక నేరస్థులుగా ప్రకటితులైన వారి ఆటకట్టించేందుకు ఈ బిల్లు ద్వారా రూపొందే చట్టం సహకరిస్తుంది. వేల కోట్ల రుపాయల రుణాలు పొంది, బ్యాంకులను మోసగించిన వైనం వెల్లడయిన తరువాత విదేశాలకు పరారయిన నీరవ్ మోడీ, అంతకు ముందు విజయ్ మాల్యా, లలిత్ మోడీ వంటి వారి ఆస్తులన్నింటిని స్తంభింపచేసి వారికి ఉచ్చు బిగించేందుకు ఈ బిల్లు ఉపయోగపడుతుంది. ఆర్థిక

తరువాయి 6లో



## రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల నిరసనలు

- హైదరాబాద్‌లో హైకోర్టు నుంచి చార్మినార్ వరకు ఊరేగింపు

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : హైకోర్టుకు పూర్తికాలం ప్రధాన న్యాయమూర్తితో పాటు న్యాయమూర్తుల ఖాళీ పోస్టులను వెంటనే నియమించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి హైకోర్టు

తరువాయి 6లో

# డిజిటల్‌లో టాప్

**డిజిటల్ లావాదేవీల్లో నాలుగేళ్లుగా ప్రథమ స్థానంలో కొనసాగుతున్న రాష్ట్రం**

**ప్రతి వెయ్యి మంది లెక్కన రాష్ట్రంలోనే అత్యధిక లావాదేవీలు**



**మన తెలంగాణ** / హైదరాబాద్ : దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో ఒక విభాగంలో తెలంగాణ రెండవ స్థానంలో నిలిచినా ప్రతి వెయ్యి మంది సగటున వినియోగిస్తున్న లావాదేవీల విభాగంలో మాత్రం వరుసగా నాలుగేళ్ళుగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది రెండు నెలల లావాదేవీల్లో సైతం ఇదే తరహా ఫలితాలు నమోదయ్యాయి. మొత్తం డిజిటల్ లావాదేవీలను సంఖ్యాపరంగా చూస్తే దేశంలో తెలంగాణ 2వ స్థానంలో ఉన్నప్పటికీ ప్రతి వెయ్యి మంది జరుపుతున్న లావాదేవీల్లో మాత్రం తొలి స్థానం ఆక్రమించింది. తెలంగాణ ఆవిర్భవించింది మొదలు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతి వెయ్యి మంది నిర్వహిస్తున్న డిజిటల్ లావాదేవీల సంఖ్య 64,213గా నమోదైంది. తర్వాతి స్థానంలో 55, 866 లావాదేవీలతో

తరువాయి 6లో

"జీవితంలో భయపడాల్సిందేమీ లేదు. అన్నీ అర్థం చేసుకోవాల్సినవే.
– మేరీ క్యూరీ"



# సిలబస్‌కు కత్తెర!

సంపాదకీయం

ఆలోచనలు ఎంత మంచివైనా ఆచరణ సవ్యంగా లేకపోతే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. పాఠశాల విద్య సిలబస్ వాపును తొలగించే విషయమై కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఇటీవల చేసిన ప్రకటన సరైన పద్ధతిలో అమలుకు నోచుకుంటే మంచి జరగవచ్చు. బడి పిల్లల పుస్తకాల మోతబరువు గురించి చాలా కాలంగా చర్చ జరుగుతున్నది. బడి పిల్లలు ప్రతిరోజూ స్కూలుకు తీసుకువెళ్లే పుస్తకాల సంచి బరువును తగ్గించాలని పాఠశాల విద్య కమిషనర్ చేసిన సిఫార్సు మేరకు ఒక ఉత్తర్వును తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు కూడా తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. పిల్లలు ఎక్సర్‌సైజ్ పుస్తకాలతో సహా పలు రకాల అపరిమితమైన బరువును మోయడాన్ని నిరోధించాలని ఆ ఉత్తర్వులో సంకల్పించింది. మంచినీటి సీసాలను కూడా వీపునకు కట్టుకుని వెళుతున్న స్థితిని తొలగించడానికి పాఠశాలలోనే అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పిల్లల స్కూలు బ్యాగుల మోతబరువు మితిమించడం వారి ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించింది. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఇంటి చదువు (హోంవర్క్)ను కేటాయించరాదనే నిబంధననూ విధించింది.

స్కూలుకు మోసుకువెళ్లే పుస్తకాల సంచి బరువు ఒక సమస్య అయితే ఆయా తరగతుల్లో విద్యార్థులు చదివి తీరవలసిన పాఠ్యప్రణాళిక(సిలబస్) భారం మరొకటి. కేంద్ర మంత్రి జవదేకర్ దీనినే తీసుకున్నారు. బడిపిల్లల సిలబస్‌ను సగం తగ్గించాలని ఆయన జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సిఇఆర్‌టి)ని ఆదేశించారు. 2019 విద్యాసంవత్సరం నుంచే అమలులోకి వచ్చేలా ఈ పని జరగాలని కూడా స్పష్టం చేశారు. ప్రస్తుతం బడి విద్యార్థుల సిలబస్ బిఎ, బికాం కోర్సులకున్న దానికంటె అధికంగా ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల దృష్టిని ఇతర విషయాల మీదికి మరలింపచేయడానికి వీలులేనంత ఎక్కువగా ఉన్నదని అన్నారు. బడిపిల్లలు చదువులో భాగంగా లోకజ్ఞానం పెంచుకుని వివిధ అంశాలపై సదవగాహనను సంపాదించుకోవడానికి వీలుగా ఈ సిలబస్ భారాన్ని తగ్గించి తీరవలసిందే అని అన్నారు. ఇందుకు ప్రస్తుత పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలోనే ఒక బిల్లును తీసుకు రాదల్చుకున్నట్లు ప్రకటించారు. అంతేకాదు ఇక నుంచి ఏడాదికి రెండు పరీక్షలు పెట్టి విద్యార్థుల వడపోత చేపడతామని అన్నారు. మొదటి పరీక్షలో నెగ్గని వారికి చివరిలో మరో పరీక్ష కూడా పెట్టి డిటెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడతామని చెప్పారు.

ఒకప్పుడు పాఠశాల విద్యలో భాగంగా డ్రాయింగ్(చిత్రలేఖనం), క్రాఫ్ట్(చేతి వృత్తుల నైపుణ్యం)తరగతులుండేవి. చివరిగంటలో ఆటలుండేవి. ఇందుకు ప్రత్యేకం గా అధ్యాపకులుండేవారు. ఇప్పుడదంతా పోయి 24గంటలూ విద్యార్థుల చేత రుబ్బుడు చదువులు చదివిస్తున్నారు. ర్యాంకులు, మార్కుల ఆధారంగా వృత్తి విద్యా కళాశాలల్లో సీట్లు కేటాయించే విధానానికి అనుగుణంగా ప్రాథమిక స్థాయినుంచే బట్టీపట్టించే పఠన కారాగారాలను ప్రైవేటురంగంలో నడుపుతున్నారు. ఇలా తయారైన విద్యార్థులు ఎంబిబిఎస్, ఐఐటి, ఐఐఎం వంటి చదువుల్లో ఆశించిన ఫలితాలు సాధించలేక ఎదురుచూసిన స్థాయి ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. చివరికి జీవితనావను నడిపించే తెలివితేటలూ వారిలో కొరవడి ఎందుకూ కొరగాకుండా పోతున్నారు.


పాఠ్య ప్రణాళికలు, గ్రంథాల రూపకల్పనలో ఎన్‌సిఇఆర్‌టి ది అందెవేసిన చేయి. దాని పాఠ్యపుస్తకాలను 14 రాష్ట్రాలలోని 19 పాఠశాల బోర్డుల పరిధిలోని పాఠశాలల్లో బోధిస్తున్నారు. జవదేకర్ ప్రకటించిన మేరకు ఈ సిలబస్‌ను సూక్ష్మీకరించి దాని భారం తగ్గించడంలో ఎన్‌సిఇఆర్‌టి కి పూర్తి స్వాతంత్ర్యాన్ని కల్పిస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయి. ఒక స్థాయి వరకు కిందిచదువుల్లో లెక్కలు వంటి సబ్జెక్టుల భారాన్ని తగ్గించవచ్చు. ఇతర పాఠ్యాంశలనూ సూక్ష్మతరం చేయవచ్చు. మొత్తంమీద హేతుబద్దీకరణ జరిగితే సిలబస్ సుళువుగానూ, సుబోధకంగానూ మారి విద్యార్థులకు హాయిని గొలుపుతుంది. అయితే సిలబస్‌ను కుదించే పేరుతో అశాస్త్రీయమైన, మూఢత్వాన్ని పెంచే పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇస్తే ఆశించిన మంచి జరగకపోగా జాతికి అపారమైన హాని కలుగుతుంది.

# ఆదిత్యనాథ్‌పై ఆశలు వమ్ము!

చూపు

ఉత్తరప్రదేశ్(యుపి)లో ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఇచ్చిన అనేక వాగ్దానాలను దాని తొలి ఏడాది పూర్తి అయినా నిలుపుకోలేకపోయింది. రైతు సమస్యల పరిష్కారం, ఆరోగ్య రక్షణ, శాంతి భద్రతల అదుపు విషయంలో ఆ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కేవలం హిందుత్వకు నిబద్ధమై పనిచేసిందే తప్ప పాలన సవ్యంగా లేకుండా పోయింది. రైతులు ఇటీవల ముఖ్యమంత్రి, గవర్నర్‌ల ఇళ్ల ముందు తమ బంగాళదుంప పంటను రోడ్లపై పారబోసి నిరసన తెలపడం వారిలో రాజుకున్న అసంతృప్తికి పరాకాష్ఠ అని చెప్పవచ్చు. రైతుల ఈ చర్యతో ప్రభుత్వంలో రావలసిన కదలిక రాలేదు. ముఖ్యమంత్రి ఇంటిముందు పంట పారబోసిన ఘటనకు గాను కొంతమంది పోలీసులపై చర్య తీసుకున్నారు తప్ప రైతు ఆక్రోశానికి జవాబు వెతకలేదు. క్వింటాల్ బంగాళదుంపలకు రూ.487లు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించడం రైతులకు కోపం తెప్పించినట్లు కనబడుతోంది. వారు క్వింటాల్‌కు రూ.1000 కనీస మద్దతు ధర కోరుతున్నారు. తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి అతి ముఖ్యుల నివాసాలముందు నడి వీధులలో తమ పంటను పారబోసారు. ఈ ఘటన తరువాత కొందరు అధికారులను పదవినుంచి తప్పించడం మినహా అసలు సమస్య అలాగే మిగిలింది.

నష్ట నివారణకు యుపి వ్యవసాయ మంత్రి సూర్య ప్రతాప్ సాహి రంగంలోకి దిగారు. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్ర ఈ ఘటన వెనుక ఉందని ప్రకటించారు. ఇది ప్రత్యర్థి సమాజ్‌వాది పార్టీ వారి పని అని నిందకు పూనుకున్నారు. ఈ ఉదంతంలో ఒక వాస్తవం ప్రజలకు స్పష్టమైంది. అదేమిటంటే – ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికలలో అత్యంత ప్రాచుర్యంగల వ్యక్తిగా నిలిచిన ఆదిత్యనాథ్ పాలనపై ప్రజల ఆగ్రహ జ్వాలలు రైతుల నిరసనలో వ్యక్తమయ్యాయి. ఆయన పాలనపై రైతులోకం మండిపడు తోంది. కేవలం బంగాళదుంప రైతుల ఆగ్రహమే పై నిరసన ఉదంతం లో స్పష్టమైందనకుంటే తప్పు. ఇతర పంటల రైతులలో కూడా అదేస్థాయిలో అసంతృప్తి పేరుకొని ఉంది. 2017 అక్టోబర్‌లో చెరకు రైతులు భారతీయ కిసాన్ యూనియన్ పతాకం కింద తమ పంటను తగులబెట్టారు. బిజెపి ప్రభుత్వం క్వింటాల్ రూ.315ఎంఎస్‌పి ప్రకటించడంతో వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తరువాత ఎంఎస్‌పి కేవలం రూ.10 పెంచడం కూడా వారికి పుండుమీద కారం చల్లినట్లు అయింది. రూ.400ఎంఎస్‌పి ప్రకటిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని బిజెపి మరిచిపోయింది. అలాగే రైతు రుణాల మాఫీ వాగ్దానం కూడా ఆచరణలో ప్రహసనంగా మిగిలింది. ప్రభుత్వం రూ.7వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు పరిచినా చివరకు రైతులకు కలిగిన ప్రయోజనం మాత్రం రూ.1 నుండి రూ.500 రుణ మాఫీ మాత్రమే. దీనికి తోడు ఇటీవల బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రైతులకిచ్చిన మరో హామీని తప్పింది. ఖర్చులపై 50శాతం ఆదాయం తిరిగి వచ్చేలా చేస్తామన్న హామీ మేరకు కేటాయింపులు జరుగలేదు. అయినప్పటికీ వ్యవసాయరంగంలో వరుస వైఫల్యాల వల్ల ఈ హామీని రైతులంతగా పట్టించుకోలేదు.




పంట ఉత్పత్తిలో మౌలిక సౌకర్యాలకు అయిన ఖర్చు కింద 50 శాతాన్ని మద్దతు ధరకు కలిపి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఈ విషయంలో ప్రభుత్వం తప్పుడు సమాచారం ఆధారంగా లెక్కగట్టి మొండిచెయ్యి చూపిందని భారతీయ కిసాన్ యూనియన్ ప్రతినిధి ధర్మేంద్ర మాలిక్ విమర్శించారు.వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సరైన పద్ధతిలో అంచనా వేయకపోవడంవల్ల రైతుల సొంతభూమి కౌలు ఖర్చులు, ఇతర వాస్తవాలను లెక్కలోకి తీసుకోలేదు. పంట ఉత్పత్తి ఖర్చుకి ఒకటిన్నర రెట్లు ఉండేలా ఎంఎస్‌పి నిర్ణయిస్తామన్న ప్రభుత్వం చాలా వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోలేదు. వ్యయం అంచనాకు ప్రభుత్వం అనుసరించిన 'ఎ2+ఎఫ్ఎల్' పద్ధతి సవ్యం కాదని మాలిక్ తప్పుపట్టారు. దేశంలో రాజకీయంగా తమకు పరిస్థితి అంత బాగా లేదని సీనియర్ బిజెపి నాయకుడొకరు వ్యాఖ్యానించారు. రైతురుణాల మాఫీ అమలులో, మద్దతు ధర నిర్ణయించడంలో ఎదురైన సమస్యలు బిజెపికి తలనొప్పిగా పరిణమించినట్లు మరో పార్టీ నాయకుడు ఒప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో నిరుద్యోగ సమస్య కూడా భగ్గుమంటోంది. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు పూరించడానికి గతంలో జరిగిన పరీక్షలను ఇప్పుడు రద్దు చేస్తున్నారు. జనవరి 29న ఉత్తరప్రదేశ్ పోలీసు రిక్రూట్‌మెంట్, ప్రమోషన్ బోర్డు ఇంతకుముందు కొన్నేళ్లలో నిర్వహించిన మూడు పరీక్షలను రద్దు చేసింది. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత పొందిన బిఇడి అభ్యర్థులు(శిక్షామిత్రులు) కూడా అదే తరహాలో నిరాశలో గడుపుతున్నారు. వారికి ఇంతవరకు టీచర్ పోస్టులు కల్పించలేదు. ఇలా ఉత్తీర్ణులైన వారి సంఖ్య వేలల్లో ఉంది. రాష్ట్రంలో మొత్తం 2,75,000 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆరోగ్య రక్షణ, శాంతి భద్రతల రంగాలలో పరిస్థితులు ఎంత మాత్రం సజావుగా లేవు. గత ఏడాది ఆగస్టులో ఆక్సిజన్ సరఫరా లేక 61మంది శిశువులు బాబా రాఘవదాస్ వైద్య కళాశాల ఆసుపత్రిలో మరణించినప్పుడు ఆరోగ్య రక్షణలో యుపి ఎంత వెనుకబడి ఉందో లోకానికి తెలిసింది. ఆ ఆసుపత్రి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ లోనిది. ఆ నెలలో ఇదే ఆసుపత్రిలో మొత్తం 290 మరణాలు వివిధ కారణాలపై సంభవించాయి. పరిస్థితిని నిరోధించే కృషి చేయకుండా ప్రభుత్వం ఈ వాస్తవాలను కప్పిపుచ్చడానికి ప్రయత్నించింది. ఇందుకు కారణం కేవలం ఒక డాక్టర్ అని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.రాష్ట్రానికి కొత్తగా 5లక్షలమంది డాక్టర్ల అవసరముందని గత ఏడాది ఒక ఉత్సవంలో మాట్లాడుతూ ఆదిత్యనాథ్ స్వయంగా ఒప్పుకున్నారు. చికిత్స పేరుతో రోగులను ప్రభుత్వాసుపత్రిలో మోసం చేస్తున్నారని కూడా చెప్పారు. అనేకమంది రోగులకు ఒకే డాక్టర్ చికిత్స చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా లోపాలను ఎత్తిచూపి 11 నెలలు అవుతున్నా వాటిని సరిదిద్దే చర్యలు అధికారులు చేపట్టలేదు. ఆదిత్యనాథ్ ప్రభుత్వం విఫలమైన మరో అంశం నేరాల సంఖ్య విపరీతంగా పెరగడం. భయవాతావరణం లేని రాష్ట్రాన్ని ఎన్నికలలో బిజెపి వాగ్దానం చేసింది. అయితే నేరాలు పెరిగిపోతున్నా చేష్టలుడిగి స్తబ్దుగా మిగిలింది. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి మతకలహాలు పెచ్చుమీరాయి. ఇతర చిన్నచిన్న నేరాల సంఖ్య కూడా పెరిగిపోయింది. కిడ్నాపింగులు 44శాతం, లూటీలు 20శాతం, రేప్‌లు 40శాతం పెరిగాయి. యాంటీరోమియో స్క్వాడ్‌ల ద్వారా మహిళలపై నేరాలను అరికట్టడానికి ఆదిలో ప్రభుత్వం కృషి చేసింది. అయితే అవి అంతగా ఫలితాలు చూపలేదు. ఆ స్క్వాడ్‌లు బాధితులనుంచి డబ్బు గుంజుతున్నట్లు వచ్చిన ఆరోపణల విషయంలో ప్రభుత్వం నుంచి కదలిక లేదు. 2017లో బిజెపిని అధికారంలోకి తెచ్చిన వర్గాలవారు ఈ పరిణామాలతో ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై విరక్తి పెంచుకున్నారు.అందువల్ల 2019 ఎన్నికలలో బిజెపికి ఈ రాష్ట్రంలో ఎదురుగాలి తప్పక పోవచ్చునని విశ్లేషకులు అంటున్నారు.

* రాజన్ పాన్‌డే

# దుబాయిలో చట్టపాలన తీరు

ఎవరైనా 'విజిటర్' (సందర్శకులు) మరణిస్తే వ్యవహరించడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ–దుబాయి) ప్రత్యేక పద్ధతులను రూపొందించుకొంది. ఇప్పుడు ప్రముఖ నటి శ్రీదేవివలె ఎవరైనా విదేశీ వ్యక్తి అక్కడ మరణిస్తే ఆ పద్ధతులు వాటికవే అమలైపోతాయి. ఎవరి ఒత్తిడులు, ప్రలోభాలు, భావోద్వేగాలు పనిచేయవు. అటువంటి అపమార్గాలు భారతదేశంలో వలె అక్కడ ఉండనే ఉండవు. హోటల్, పార్కు, బీచ్ వగైరా ప్రదేశాలలో సంభవించిన మరణాలను యుఎఇలో చట్ట ప్రకారం తుచ తప్పక దర్యాప్తు చేస్తారు. అందుమూలంగానే శ్రీదేవి మృతదేహాన్ని ముంబయి చేర్చడం లో రోజుల తరబడి ఆలస్యం జరిగింది. దుబాయ్ పోలీసులు, ప్రాసిక్యూషన్ సంబంధిత నియమాలు, నిబంధనలకు తప్పనిసరిగా కట్టుబడి పని చేస్తారు. స్వయంగా ఆ దేశపు రాజు చెప్పినా దర్యాప్తు సంస్థల అధికారులు వినరు.




యుఎఇలో అనుసరించే పద్ధతి ప్రకారం హోటల్, పార్క్ వంటి ప్రదేశాల్లో మరణం సంభవిస్తే పోస్టు మార్టం జరిగి, శవ పరీక్ష నివేదిక వెలువడి, పోలీసుల దర్యాప్తు నివేదిక కూడా వచ్చాకగాని మృత దేహాన్ని అప్పగించడం జరగదు. శ్రీదేవి మృత దేహం విషయంలో ఇవే పద్ధతులను తూచ తప్పక పాటించారు. అయితే ఈ ప్రక్రియలో అనుమానాలు తలెత్తడంవల్ల అప్పగింత ఆలస్యం అయింది.

భారత మీడియా దుబాయి పోలీసులను పద్ధతులు అనుసరించవద్దని అడగడం లేదు కానీ తాను మాత్రం పద్ధతులను తప్పుతోంది. దుబాయి పోలీసులు ఏదైనా కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశోధించాక, అనుమానాలన్నీ నివృత్తి అయ్యాక మాత్రమే బయట లోకానికి వివరాలు వెల్లడిస్తారు.

శ్రీదేవి మృతిపై భారతీయ మీడియా ఏమి చెప్పినా అక్కడి వైద్యులు గాని, పోలీసులు గాని ప్రభావితం కారు. మన మీడియా 'శ్రీదేవి గుండె ఆగిపోవడంతో మరణించింది' అని నిజానిజాలను విచారించకుండా ప్రక టించేసింది. మరణానికి ముందు స్పృహ తప్పి పడిపోయి ఉందని కూడా తెలిపింది. ఆమె హోదా ఏమిటి, ఆమె పేరు ప్రఖ్యాతులు ఏమిటి అన్న దానిని బట్టి అక్కడ అనుసరించే పద్ధతులు మారిపోవు.

యుఎఇ అధికార్లు ఈ విషయంలో చట్టం చెప్పిన ప్రకారం ఖచ్చితంగా వ్యవహరిస్తారు. భారత సంతతికి చెందిన దుబాయి జర్నలిస్టు ఒకరు అక్కడి పద్ధతుల ఖచ్చితత్వాన్ని వివరించారు. ఒక డిజిటల్ వేదికపై ఆయన ఈ వివరాలు రాశారు.

## సందేహాలు తీరాకే వివరాలు వెల్లడి

'యుఎఇ చాలా ఆధునికత, అభివృద్ధి సాధించిన దేశం. అది నిర్దిష్ట సూత్రాల ప్రకారం పని చేస్తుంది. వైద్య పరీక్షల నియమాలు వ్యక్తి ప్రాముఖ్యాన్ని బట్టి, నువ్వు ఎవరు, ఏమిటి అన్న దానిని బట్టి ఎంత మాత్రం మారవు' అని ఆ జర్నలిస్టు రాశారు. యుఇఎలోని భారత రాయబార కార్యాలయం కూడా అక్కడి పద్ధతులపై ఇదే మాట చెప్పింది. మరో ప్రక్క భారతదేశంలో మీడియా అలవికాని అసహనాన్ని శ్రీదేవి మరణం, అనంతర పరిణామాల వార్తలు చాటడంలో ప్రదర్శించింది. సాధారణంగా శ్రీదేవి మరణం వంటి ఉదంతాల్లో సంచలన వార్తలు రాసే ధోరణి మన మీడియా ప్రదర్శిస్తుంది. తొలి వార్తలు ఒక్కొక్కటిగా వెలువడుతుంటే వాటి నిజానిజాలు నిర్ధారించుకోకుండా గోరంతలు కొండంతలుగా ప్రచారం చేసింది.


ప్రజలను వార్తలతో ఆశ్చర్యపెట్టాలనే సంచలాత్మక ధోరణి మన మీడియా శ్రీదేవి మరణ సందర్భంలో చివరికి ప్రదర్శించింది. అయితే ఆదిలో కనబర్చిన అత్యుత్సాహం తగ్గించుకొని తన మామూలు పద్ధతికి విరుద్ధంగా ఈసారి కొంతలో కొంత సంయమనాన్ని భారత మీడియా కనబర్చిందని చెప్పక తప్పదు. అసహనం మోతాదు తగ్గించుకొని, ప్రశంసించదగ్గ స్థాయిలో వ్యవహరించింది. యుఎఇలో మీడియా అక్కడి దర్యాప్తు పద్ధతులను ఎన్నడూ ప్రశ్నించదు. ఈ విషయంలో అది మనకన్నా చాలా క్రమశిక్షణతో వ్యవహరిస్తుంది. భారతదేశంలో ప్రముఖుల మరణం వంటి ఘటనలు సంభవించినప్పుడు మీడియా అతిగా జోక్యం చేసు కుంటుంది. శ్రీదేవి మరణం గుండెపోటు వల్ల కాదని వార్త రాగానే అంతకు ముందు నాటి 'బాత్ టబ్‌లో మునక' వాదనను మన మీడియా పక్కన పెట్టేసింది. అసలు 'ప్రమాదంలో మునక' అన్నది వుండదు. దానిని మునిగిపోయి మరణించినట్లే ప్రకటించాలి. మునిగి మరణించడం వాదనను శవ పరీక్ష నివేదికలో చెప్పినది చెప్పినట్లుగా రెండో ఆలోచన లేకుండా మన మీడియా ప్రచారం చేసింది. యుఎఇ లో అనుసరించే పద్ధతి ప్రకారం హోటల్, పార్క్ వంటి ప్రదేశాల్లో మరణం సంభవిస్తే పోస్టు మార్టం జరిగి, శవ పరీక్ష నివేదిక వెలువడి, పోలీసుల దర్యాప్తు నివేదిక కూడా వచ్చాకగాని మృతదేహాన్ని అప్పగించడం జరగదు. శ్రీదేవి మృత దేహం విషయంలో ఇవే పద్ధతులను తూచ తప్పక పాటించారు. అయితే ఈ ప్రక్రియలో అనుమానాలు తలెత్తడంవల్ల అప్పగింత ఆలస్యం అయింది.

## ప్రముఖుల విషయంలో అతి ఉండదు

భారత మీడియా దుబాయి పోలీసులను పద్ధతులు అనుసరించవద్దని అడగడం లేదు కానీ తాను మాత్రం పద్ధతులను తప్పుతోంది. దుబాయి పోలీసులు ఏదైనా కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశోధించాక, అనుమానాలన్నీ నివృత్తి అయ్యాక మాత్రమే బయట లోకానికి వివరాలు వెల్లడిస్తారు. శ్రీదేవి–బోనీ కపూర్ విషయంలో చాలా ప్రశ్నలు వారికి తలెత్తినందున వాటన్నిటికీ సమాధానాలు వెతికే పనిలో వారు నిండా మునిగి పోయారు. ఈ కేసులో శ్రీదేవి బస చేసిన హోటల్‌లో ఏమి జరిగింది అన్నది కూడా లోతుగా దర్యాప్తు చేయవలసిన అవసరం ఏర్పడింది. దుబాయి అంతటా సిసి టివి కెమెరాలు నిత్యం పనిచేస్తూ ఉంటాయి. విమానాశ్రయం నుంచి ఇంటికి/హోటల్ కి/బీచ్‌కి/ఎక్కడికి వెళ్లినా సిసి టివి కెమెరాలు ప్రతి క్షణాన్ని రికార్డు చేస్తాయి. ప్రతి ప్రదేశంలో, ప్రతి ఒక్కరిపై ఆ కెమెరాలు నిఘా కాస్తాయి. శ్రీదేవి హోటల్ బయట అవి ఉన్నాయా? ఉంటే అవి ఏమి చూపుతున్నాయి. ఆమె తన హోటల్ గదిలో ఉండగా ఎవరైనా వచ్చారా? వస్తే వారి కదలికలు ఏమిటి? ముఖ్యంగా బోనీ కపూర్ ఆ సమయంలో హోటల్ వద్ద వున్నారా? ఇవన్నీ కూడా సిసిటివి ఫుటేజి తేల్చాసిన ప్రశ్నలు. దుబాయి జర్నలిస్టు చెప్పినది నిజం. ఈ పరిణామంలో ప్రతి ఒక్క కోణం తనిఖీ చేసేంతవరకు ఎదురు చూపులు తప్పవు. అయితే ఎట్టకేలకు శ్రీదేవి మృత దేహం లాంఛనాలు పూర్తి అయి ముంబయికి బయలు దేరడంతో ఆమె అభిమానుల ఎదురు చూపులకు తెర పడింది. దర్యాప్తులో జాప్యానికి పద్ధతులను తుచ తప్పక అధికారులు పాటించడమే కారణం. ఇటు వంటి విషయాల్లో మన పద్ధతులు ఎంత వదులుగా ఉంటాయో శ్రీదేవి ఉదంతం నిరూపిస్తోంది.

* సుశీల్ కుట్టి

# దక్కన్ భారత్‌కు సర్దార్‌గా వినుతి కెక్కిన జమలాపురం కేశవరావు



కొలనుపాక కుమార స్వామి,
9963720669

భారతావనికి సర్దార్(ఉక్కుమనిషి) ఎవరంటే వల్లభాయి పటేల్. మరి దక్కన్ భారత్‌కు సర్దార్‌గా వినుతికెక్కిన వీరయోధుడు జమలాపురం కేశవరావు. 80 ఏళ్ల కిందటి ఆయన జీవితం లోని కొన్ని ఉద్విగ్న క్షణాలు.

''కాయకష్టం తప్పదాయే..కష్టఫలితం దక్కదాయే..
పిడికెడన్నం దొరకదాయే...
పిల్లపాపలు పస్తులాయే...''

ఇది ఆనాటి హైదరాబాద్ హైదరాబాద్ నిజాం రాజ్యంలోని రైతు కుటుంబాల దుస్థితి. అనేకుల తినే తిండి లేక పస్తులుంటున్న రోజులవి. తెలంగాణ అన్నదాతలను నిజాం అధికారులు పీల్చిపిప్పి చేస్తున్న వైనాన్ని ఆయన కళ్లారా చూసిండు.

చాకలి, మంగలి, తలారి ఇలా ఒకరని కాదు. దాదాపు అన్ని వృత్తుల వారూ వరుసపెట్టి బోరున విలపిస్తున్న దృశ్యాలవి. తెలంగాణ పల్లెల్లో దుష్ట చతుష్టయాలు – దేశ్‌ముఖ్, మాలీపటేల్, పోలీసు పటేల్, పట్వారీలు, వీరి వ్యవస్థల నుంచి ప్రజలను విముక్తులను చేయడమే తన ప్రధాన కర్తవ్యంగా కేశవరావు ఉద్యమించారు.

1908 జనవరి 3న ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం గ్రామంలో వెంకట రామారావు, వెంకట నర్సమ్మ దంపతులకు కేశవరావు జన్మించారు. ధనిక కరణీకుల కుటుంబం వారిది. చిన్నప్పటినుంచీ పచ్చని పొలాలన్నా, కాయకష్టం చేసే రైతులన్నా తనకెంతో అభిమానం. మరఠ్వాడా, కర్ణాటక, తెలంగాణ ప్రజలతో కూడిన హైదరాబాద్ రాష్ట్రంలో రైతులు కటిక దారిద్ర్యం అనుభవిస్తూ ఉండేవారు. భూస్వాముల నుంచి భూమిని కౌలుకు తీసుకొని కాయకష్టం చేసే రైతులు వాతావరణం అనుకూలించక పంటలు పండకపోయినా కొంపా, గోడు అమ్ముకొని కౌలు ద్వారా చెల్లించాల్సిన దుర్భరం అప్పుడు దాపురించింది.

సర్దార్ జమలాపురం కేశవరావు తెలంగాణ వీరుడే కాదు. యావద్దేశ స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. 200 ఏళ్ల బ్రిటిష్ ముష్కర పాలన కింద నలిగి నాశనమైన భారతజాతి సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నా తెలంగాణ పల్లెలకు మాత్రం రజాకార్ల నుంచి విముక్తి లభించలేదు. ఆనాటి నిజాం ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన తొలి వీరోచిత పోరాటంగా ''చరిత్రలోని నిలిచిపోయింది.

వరంగల్ జిల్లాలో జరిగినన్ని సామూహిక హత్యలు మరెక్కడా జరగలేదు. చేర్యాల తాలూకలోని ''బైరాన్‌పల్లి''లో జరిగిన మారణకాండ, జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని గుర్తు చేస్తుంది. ఎక్బాల్ హాషీం అనే నరరూప రాక్షసుడు రజాకారులను వెంటబెట్టుకుని బైరాన్‌పల్లిని చుట్టుముట్టి కనపడ్డ వారినల్లా తాళ్లతో కట్టిపడేశాడు. వారికింద మంటలు పెట్టి సజీవ దహనం చేసి కిరాతక ఆనందాన్ని అనుభవించాడు. ఒక గంటలోనే 120 మంది ని కాల్చిచంపాడు. తర్వాత ఊరంతా దోచుకొని ఇళ్లు తగులబెట్టి జారుకున్నాడు. మానుకోట తాలూకాలోని పెరమాళ్ల సంకీసలో రజాకార్లు 21 మంది అమాయకులను కాల్చి చంపారు. జనగామ తాలూకాలోని అక్కరాజుపల్లి, చిట్టికోదూరు, ఇప్పగూడెం, పాలగుర్తి, రంగాపురంగ్రామాల్లో అనేకమందిని పొట్టన పెట్టుకున్నారు.

రజాకారుల దాడులను తట్టుకోలేని ప్రజలు తమ ఆస్తిపాస్తులను వదులుకొని సురక్షిత ప్రాంతాలకు పారిపోయేవారు. ఈ సంఘటనలు చూసి చలించిపోయిన కేశవరావు తెలంగాణ ప్రాంతమంతా గ్రామగ్రామానా తిరిగి వారి మాన ప్రాణాలకు ముప్పు వాటిల్లినప్పుడు ఎదురు తిరగడంలో తప్పేమీ లేదని ప్రచారం చేశారు. ప్రజలను చైతన్యపరిచి గ్రామరక్షక దళాలను ఏర్పరిచారు. సుశిక్షితులైన ప్రజలను తనే స్వయంగా ముందుండి నడిపించాడు. రజాకారులను ధైర్యంగా ఎదిరించాడు. కళ్లకు చెప్పులైనా లేకుండా తెలంగాణ జిల్లాలోని ప్రతి పల్లెను చుట్టి వచ్చిన ప్రజానాయకుడుగా మన సర్దార్ జమలాపురం కేశవరావు చిరస్థాయిగా నిలిచిపోయారు.

సర్దార్ గర్జిస్తే నిజాం వణికాడు సర్దార్ జమలాపురం జనంమధ్యలో తప్ప విడిగా ఉండలేరు. ఆయనది ఒక మహత్తరమైన ఉద్యమం ఎంత గుండె లేని వాడైనా ఆయన సమక్షంలో ఉత్తేజితుడయ్యేవాడు. తెలంగాణలో జన సమరాన ప్రథమయోధుడు. సంస్థాన విమోచనోద్యమంలో ఆయన లేని ఘట్టంలేదు. స్థానిక నాయకత్వం అనేది తెలంగాణలో జమలాపురంతోనే ప్రారంభమైంది. ఆయన ఏ గ్రామానికి వెళ్లినా ఒక వ్యక్తిని ఆ గ్రామానికి నాయకుడుగా చేసి ఆ గ్రామంలో జరిగే సభకు అతణ్ణి అధ్యక్షుడుగా చేసి తానొక సామాన్య వక్తలా ప్రసంగించేవారు. ఆ విధంగా ప్రజల్ని స్వాతంత్ర్య సమర రంగంలోకి దించేవారు . అందుకనే సర్దార్ అక్షరాలా ప్రజానాయకుడు. కేశవరావు తండ్రి ఏడు గ్రామాలకు కరణం.

వంద ఎకరాల ఆసామీ కొడుకును ఏ కలెక్టర్‌రో చేయాలనే ఉద్దేశం. ఆ తండ్రిది కానీ తండ్రి ప్రవృత్తికి వ్యతిరేకంగా ప్రవర్తించేవారు కేశవరావు. మూఢాచారాలను దౌర్జన్యాలను చిన్నతనం నుండే ఎదిరించారు. అధికారం నెరపడం ఇష్టంలేని గ్రామాధికారి పుత్రుడు. ఆయన ఉస్మానియాలో బిఎ చదువుతున్న రోజులలో వందేమాతరం ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమంలో పాల్గొన్న ఆయన బిఎ పూర్తిచేయకముందే ప్రజారంగంలోకి దిగారు.

స్వల్ప అస్వస్థత కారణంగా 1953వ సంవత్సరం మార్చి 29న తన 46వ ఏట ఈ అమూల్య రత్నం రాలిపోయింది.

# చిన్నారుల ప్రాణాలు వీధి కుక్కల పాలు

ఎడిటర్‌కు లేఖ

వీధికుక్కల దాడిలో తరచూ చిన్నారులు బలి అవుతున్నా అధికారులలో చలనం లేకపోవడం శోచనీయం. పట్టణాలు, గ్రామాలు ఎక్కడ చూసినా వీధివీధినా గుంపులు గుంపులుగా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మానవ జనాభాతో పోటీ పడుతున్న వీటి జనాభాను అరికట్టలేకపోవడం వలన చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

తరచూ గుంపులు గుంపులుగా దాడిచేస్తూ మానవులను తీవ్ర గాయాలుపాలు చేస్తున్నాయి. చిన్నారుల ప్రాణాలను తీస్తున్నాయి. వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనాలు ముందుకు అకస్మాత్తుగా పరుగెత్తుకు రాగా, వాటిని ఢీకొని, కిందపడి వాహనదారులు ప్రాణాలుకోల్పోతున్నారు.

ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వీధికుక్కలను తక్షణం పల్లె, పట్టణాల అంతటా తొలగించాలి. వాటి జనాభా విస్తరించకుండా చర్యలు తీసుకోవాలి.

—సరికొండ శ్రీనివాసరాజు




## ప్రవేశాలు...

టీఎస్ఆర్‌జేసీ సెట్ 2018
తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు.
గ్రూపులు: ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ
బోధనా మాధ్యమం: ఇంగ్లీష్
అర్హత: ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు.
ప్రవేశపరీక్ష తేది: 06.05.2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ.150
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 06.03.2018 నుంచి 09.04.2018 వరకు
వెబ్‌సైట్: http://tsrjdc.cgg.gov.in/

## నిమ్‌సెట్...

ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సుల ఉమ్మడి ప్రవేశపరీక్ష.
సెట్ నిర్వహిస్తున్న ఎన్ఐటీ: ఎన్ఐటీ సూరత్కల్ (కర్ణాటక).
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత
నిమ్‌సెట్ తేది: 27.05.2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ.2200
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 01.03.2018 నుంచి 31.03.2018 వరకు.

వెబ్‌సైట్:https://www.nimcet.in/

## సీఎస్ఐఆర్‌నీరి, నాగ్‌పూర్...

సంస్థ: నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి), నాగ్‌పూర్
పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్ 10, టెక్నికల్ ఆఫీసర్ 05. అర్హత: బీఎస్సీ, ఇంజినీరింగ్ డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంబీబీఎస్.
ఎంపిక: రాతపరీక్ష/ స్క్రీనింగ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ,దరఖాస్తు ఫీజు: రూ.100
చివరితేది: 02.04.2018 వెబ్‌సైట్: http://neeri.res.in/

## తెలంగాణ సెర్ప్...

సంస్థ: తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్).
పోస్టు: ప్రాజెక్ట్ మేనేజర్ తదితరాలు
ఖాళీలు: 03
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ లేదా పీజీతోపాటు అనుభవం.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
చివరితేది: 08.03.2018

వెబ్‌సైట్:www.serp.telangana.gov.in?

## ఏటీఐ, హైదరాబాద్...

సంస్థ: భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ).
పోస్టు: జూనియర్ కన్సల్టెంట్
ఖాళీలు: 07
జాబ్ లొకేషన్: విద్యానగర్, హైదరాబాద్.
అర్హత: బీటెక్/ బీఈ లేదా డిప్లొమాతోపాటు సంబంధిత రంగంలో అనుభవం.
ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరితేది: 15.03.2018
వెబ్‌సైట్: http://atihyderabad.ap.nic.in/

# అతిగా ఆందోళన వద్దు..!

**పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుంటే వారిలో భయం, ఆందోళనవంటివి దూరం చేయొచ్చు. అతిగా ఆందోళనతో చదవడం వల్ల మానసికంగా వారిలో భయం పెరుగుతుంది. దీంతో ఎక్కువ చదవలేరు. ఒకవేళ చదివినా మర్చిపోయే ప్రమాదం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన కలగకుండా బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలంటే కొన్ని సూచనలు తప్పకుండా పాటించాల్సిందే. అవేంటో చూద్దాం....**

**వ్యాయామం:** అప్పుడప్పుడూ వ్యాయామం చేయటంవల్ల మనసుకు సంతోషంగా అనిపించి రిలాక్స్ పొందే పరిస్థితి ఉంటుంది. ఎటువంటి భయాలను పెట్టుకోకుండా హాయిగా, ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటే తేలికగా పరీక్షలను ప్రశాంతంగా, వారు చదువుకున్న విషయాన్ని రాయగలుగుతారు.

**ఆహారం:** పిల్లల ఆహారం విషయంలో తప్పనిసరిగా శ్రద్ధచూపించాల్సి వుంటుంది. నిర్ణీత సమయానికి వారికి సరైన పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని తినిపించాలి. తగినంత మంచినీరు తాగేటట్లు చూడాలి. పౌష్టికాహార లోపం వల్ల ఆరోగ్యం పాడవుతుంది. ఆ కారణంగా పరీక్షలు సరిగా రాయలేకపోయే అవకాశాలు వుంటాయి. సరైన సమయానికి ఆహారం తీసుకోవాలి. టీ, కాఫీలు వంటివి సాధ్యమైనంత వరకు మానేస్తే మంచిది.

**నిద్ర:** వేళకు తిండి తినకపోయినా, రాత్రుళ్ళు నిద్ర పోకపోయినా శారీరకంగానూ, మానసికంగానూ అలసిపోయి చదువుపై ఆసక్తి తగ్గిపోతుంది. శ్రద్ధ తగ్గాక చదివేది అర్థం కాదు. దానితో జవాబులను బట్టీ వేయాలని చూస్తారు. అలా చేయడం వల్ల సమస్యలు ప్రారంభమవుతాయి. ఇది గమనించి వారికి తిండి, నిద్ర సక్రమంగా లభించేట్లు చూసుకోవాలి. చదవాలి కదా అని తెల్లవార్లూ కూర్చోబెట్టకుండా తగినంత నిద్ర అవసరం అని గుర్తించాలి.

**అనుకూలమైన చోటు:** పిల్లలు చదువుకోవటానికి నిర్దిష్టమైన స్థలాన్ని లేదా చోటును చూసుకోవాలి. నలుగురు కూర్చున్నచోట కూర్చుని చదవటంవల్ల వాళ్ళేం చదువుతున్నారో వారికి అర్థం కాదు. అందుకని సాధ్యమైనంత వరకూ ఏ విధమైన అడ్డంకులు లేకుండా చూసుకోవాలి. టీవీనో, డివిడిలో సినిమాలు చూస్తూ చదువద్దు. మంచంపైన ఫ్లాట్‌గా, బోర్లా పడుకుని చదవకూడదు. ఎలాంటి సందడి లేకుండా ప్రశాంతంగా ఉండాలి. మరో ముఖ్యమైన విషయం, రాత్రి పూట మేలుకుని ఉండి, పక్క మీద పడుకుని చదవడం కూడదు. చదువుకు బల్ల, కుర్చీ మేలైనవి. వీటి వల్ల ఏకాగ్రతకు భంగం కలగదు. చదువుకునేందుకు చక్కని భంగిమ కూడా అమరుతుంది.

**సమయ పరిధి:** చదువుకునేటపుడు అదేపనిగా గంటలకు గంటలు చదవకుండా 40, 45 నిముషాలకోసారి చదివేలా నిర్దిష్ట సమయాన్ని పిల్లలే నిర్ణయించుకోవాలి. మధ్యమధ్యలో టీవీ చూడకుండా కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవాలి.

**ప్లానింగ్ :** ఒకచార్టు తయారుచేసుకుని, దానిలో రోజూ మీరేం చదువుతు



న్నారో, ఎంత చదువుతున్నారో రాసుకోవాలి. ఆ విధంగా టైంటేబుల్ తయారు చేసుకుని ఒక క్రమపద్ధతి ప్రకారం చదివితే పరీక్షలు సమీపించే సమయానికి సిలబస్ పూర్తిచేయగలుగుతారు.

**నిపుణుల సలహా:** విద్యార్థినీ విద్యార్థులు మానసిక వత్తిడికి లోనైతే కనుక ఒకసారి మానసిక వైద్య నిపుణులను సంప్రదించటం మంచిది. నిపుణుల కౌన్సెలింగ్ వల్ల పిల్లల్లో నూతనోత్సాహం వస్తుంది. ఇక పిల్లల చదువుకు సంబంధించి తల్లిదండ్రుల పాత్ర ఎలా వుంటుందో పరిశీలిస్తే పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లలకు అన్నివిధాలా సహకరించాలి. ఆ సమయంలో వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత. అంతేకాక పిల్లల ఆరోగ్యం విషయంలోనూ తగిన శ్రద్ధ తీసుకోవాలి. పిల్లలు ఏ విధమైన మానసిక, శారీరక వత్తిడులకు లోనుకాకుండా చూసే బాధ్యత కూడా తల్లిదండ్రులదే.

**ఒత్తిడి కూడదు:** ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ అంటే పన్నెండు గంటల పాటు పిల్లలకు స్కూలు, ట్యూషన్‌తోనే సరిపోతుంది. ఇక పరీక్షలు వచ్చిన సమయంలో నిరంతరం చదుతూనే వుంటారు. ఇలా ఎప్పుడూ చదువులో మునిగితేలుతూంటే వారిలో మానసిక ఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నారు. పిల్లలపై ప్రతినిత్యం తల్లిదండ్రులు ఈ విధంగా ఒత్తిడి చేయడం, చదువు విషయంలో కఠినంగా ప్రవర్తించటం మంచిది కాదు.

**టెస్ట్ :** స్కూల్లో ఎలాగో టెస్ట్‌లు పెడతారు కదా అని బద్ధకించకూడదు. వాళ్ళకి వాళ్ళే స్వయంగా ఇంట్లో టెస్ట్ పెట్టుకుంటే పరీక్షలంటే భయంపోయి వారిపై వారికి ధైర్యం, నమ్మకం ఏర్పడతాయి.

**నెగెటివ్ థింకింగ్:** చదువుకు సంబంధించి మనసులో ఏ విధమైన నెగెటివ్ థింకింగ్ (ప్రతికూల ఆలోచనలు)ను పెంపొందించుకోకూడదు. ప్రతి విషయాన్ని సానుకూల దృక్పథంతో ఆలోచించుకోవాలి.

# జీకే – కరెంట్ అఫైర్స్

Q ప్రపంచంలో మొదటి భూగర్భ రైల్వే వ్యవస్థ ?
A లండన్ (1863).

Q ప్రపంచంలో తొలి గ్రంథం ?
A రుగ్వేదం.

Q తొలి సారిగా మన దేశంలో బంగారు నాణేలు ప్రవేశపెట్టిన వారు?
A ఇండోగ్రీకులు.

Q దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం?
A ఆంధ్రప్రదేశ్ (1956).

Q భారత్‌లో మొదటి మహిళా కళాశాల?
A బెతూన్ కళాశాల, కలకత్తా (1879).

Q ఒలింపిక్స్ నిర్వహించిన తొలి ఆసియా దేశం?
A జపాన్ (టోక్యో 1964).

Q మానవుడు తొలిసారిగా ఉపయోగించిన లోహం ?
A రాగి.

Q భారత్‌లో తొలి నాగరికత ?
A సింధు.

Q తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ?
A జనతా ప్రభుత్వం (1977–79).

Q ప్రపంచంలో మొదటి భూగర్భ ఎలక్ట్రిక్ రైల్వే వ్యవస్థ ?
A లండన్ (1890).

Q భారత్‌లో మన మొదటి న్యూక్లియర్ రియాక్టర్
A అప్సర (1956).

Q భారత్‌లో తొలి పత్రిక ?
A బెంగాల్ గెజిట్ (1780).

Q ఆసియాలో మొదటి ఏరోస్పేస్ మ్యూజియం ?
A ముంబయి.

Q దేశంలో తొలి చమురు బావి ?
A దిగ్బోయ్ (అస్సాం 1890).

Q మానవుడు మొదటిసారిగా మచ్చిక చేసుకున్న జంతువు ?
A కుక్క.

Q దేశంలో 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన తొలి గ్రామం ?
A చామ్రవట్టం (కేరళ).

Q భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం జరిగిన స్థలం ?
A ముంబయి (1885).

Q మహిళలకు ఓటు హక్కు కల్పించిన తొలి దేశం
A న్యూజిలాండ్ (1893).

Q భారత్‌లో తొలి పూర్తి బ్యాంకింగ్ జిల్లా ?
A పాలక్కడ్ (కేరళ).

Q భారతదేశంలో సౌరశక్తితో విద్యుదీకరించిన తొలి గ్రామం ?
A చోగ్లామ్‌సార్ (జమ్ము కాశ్మీర్).

Q తొలి ఇనెట్‌వర్క్ జిల్లా ?
A మలప్పురం (కేరళ).

Q భారత్‌పై దండెత్తిన తొలి యూరోపియన్ ?
A అలెగ్జాండర్ (క్రీ.పూ. 326).

Q భారత్‌లో పూర్తిగా విద్యుదీకరించిన తొలి నగరం ?
A బెంగళూరు (1906).

Q భారత్‌లో వైర్‌లెస్ కనెక్టివిటీ ఉన్న మొదటి నగరం ?
A మైసూర్ (కర్ణాటక) .

Q మొదటి యాంటీ బయోటిక్ డ్రగ్ ?
A పెన్సిలిన్.

Q భారత్‌లో మొదటి అణు పరీక్ష?
A పోఖ్రాన్ (రాజస్థాన్ 1974).

Q భారత్ ప్రయోగించిన మొదటి ఉపగ్రహం ?
A ఆర్యభట్ట (1975).

Q భారత్‌లో తొలి సైన్స్ నగరం?
A కలకత్తా .

Q కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తొలి కృత్రిమ ఉపగ్రహం ?
A స్పుత్నిక్ (రష్యా 1957).

Q ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన తొలి మహిళ?
A రజియా సుల్తానా.

Q ఇండియాలోమొదటి రైల్వే లైను ఎక్కడి నుంచి ఎక్కడికి నడిపారు ?
A ముంబయి నుంచి థానే (1853)

Q ఇండియాలో మొదటి టెలిగ్రాఫ్ లైను ?
A కలకత్తా డైమండ్ హార్బర్‌ల మధ్య (1851).

Q భారత్ మొదటి కమ్యూనికేషన్ ఉపగ్రహం ?
A ఆపిల్ (1981).

Q భారత్ ప్రయోగించిన తొలి మల్టిపుల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ ?
A. PSLVC 2.

Q భారత్‌లో తొలి తపాలా కార్యాలయం ఉన్న నగరం ?
A కలకత్తా (1727) .

Q మనదేశంలో రేడియో ప్రసారాలు తొలిసారిగా ప్రసారమైన ప్రాంతం ?
A ముంబయి కలకత్తాల మధ్య (1927).

Q ఇండియాలో తొలి మూగ (మూకి) సినిమా ?
A రాజా హరిశ్చంద్ర (1913).

Q ప్రపంచంలో మొదటి టాకీ సినిమా?
A ది జాజ్ సింగర్ (1927).

Q భారత్‌లో మొదటి టాకీ సినిమా?
A ఆలం ఆరా (1931).

Q పూర్తినిడివి ఉన్న మొదటి కార్టూన్ చిత్రం?
A స్నోవైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్.

Q భారతదేశంలో మొదటి ఉక్కు కర్మాగారం ?
A టాటా ఐరన్ స్టీల్ కంపెనీ (1907).

Q విదేశీ చిత్రాల విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయిన తొలి భారతీయ చిత్రం ?
A మదర్ ఇండియా.

Q భారతదేశ మొదటి యోగా శాస్త్రవేత్త ?
A పతంజలి.

Q ప్రపంచంలో మొదటి సారిగా నిర్వహించిన అందాల పోటీలు?
A కార్నిత్ (గ్రీకు క్రీ.పూ. 700).

Q భారత్ తొలి క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ?
A ఇంగ్లండ్‌తో (1932).

Q భారత్ తొలి ఎలక్ట్రిక్ రైలు?
A ముంబయి నుంచి వి.టి.కుర్లా వరకు (1925)

Q మొదటి ఆటంబాంబు ?
A లిటిల్ బాయ్ (1945).

Q ప్రపంచంలో మొదటిసారిగా కుటుంబ నియంత్రణ అమలు చేసిన దేశం?
A భారతదేశం




Q భారత దేశాన్ని సందర్శించిన తొలి చైనీస్ యాత్రికుడు ?
A పాహియాన్.

Q భారత దేశంలో శాసనాలు వేయించిన తొలి చక్రవర్తి ?
A అశోకుడు.

Q దేశంలో మొదటిసారిగా రాష్ట్రపతి పాలన విధించిన రాష్ట్రం
A పంజాబ్

Q భార్త్ దేశ మొదటి రాష్ట్రపతి ?
A డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ (1950 1962).

Q భారతదేశ తొలి అణు పరిశోధనా కేంద్రం ?
A బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బీఏఆర్‌సీ).

Q భారతదేశతొలి ప్రయోగాత్మక భూపరిశీలన ఉపగ్రహం ?
A భాస్కర 1.

Q భారతదేశ తొలి ఖండాంతర క్షిపణి ?
A సూర్య.

Q గ్లోబల్ పొజిషనింగ్ వ్యవస్థ ఉన్న తొలి క్షిపణి?
A అగ్ని2.

Q స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి క్షిపణి ?
A పృథ్వీ .

Q చంద్రుడిపై పరిశోధనల కోసం భారత్ ప్రయోగించిన తొలి ఉపగ్రహం ?
A చంద్రయాన్ 1.

Q మనదేశ తొలి ప్రయోగాత్మక రిమోట్‌సెన్సింగ్ ఉపగ్రహం ?
A భాస్కర 1 .

Q స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి అణు జలాంతర్గామి ?
A అరిహంత్ (2009).

Q భారత దేశ తొలి అణు సబ్‌మెరైన్
A ఐఎన్ఎస్ చక్ర .

Q దేశీయపరిజ్ఞానంతో తయారైన తొలి సబ్‌మెరైన్ ?
A ఐఎన్ఎస్ షల్కి .

Q స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన దేశ తొలి క్షిపణి నౌక ?
A ఐఎన్ఎస్ విభూతి.

Q మన దేశ తొలి గూఢచార నౌక ?
A ఐఎన్ఎస్ శివాలిక్.

Q భారత నావికాదళంలో తొలి యుద్ధ నౌక ?
A ఐఎన్ఎస్ సావిత్రి.

Q భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి పైలట్ రహిత యుద్ధ విమానం ?
A నిశాంత్.

Q తొలి టెస్ట్‌ట్యూబ్ బేబి ?
A లూయిస్ బ్రౌన్ (1978–ఇంగ్లండ్).

Q ఓడపై ప్రపంచాన్ని చుట్టివచ్చిన తొలి ?
A ఫెర్డినాండ్ మాజిలాన్ (స్పెయిన్).

Q ఐక్యరాజ్యసమితి తొలి సెక్రెటరీ జనరల్ ?
A ట్రిగ్వేలీ (నార్వే 1946 53).

Q ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి వ్యక్తులు ?
A టెన్సింగ్ నార్కే (భారత్) ఎడ్మండ్ హిల్లరీ (న్యూజిలాండ్) 1955.

Q ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళ
A జుంకోతాబి (జపాన్ 1975)

Q తొలి కేంద్ర ఆర్థికమంత్రి ?
A ఆర్.కె. షణ్ముగం చెట్టి .

Q తొలి కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి ?
A బాబూ రాజేంద్రప్రసాద్.

Q తొలి కేంద్ర హోంశాఖా మంత్రి ?
A సర్దార్ వల్లభాయ్ పటేల్.

Q తొలి కేంద్ర కార్మిక శాఖా మంత్రి ?
A బాబూ జగ్జీవన్ రామ్.

Q ఎర్రకోటపై ఎక్కువ సార్లు జాతీయ జెండాను ఎగరవేసిన తొలి ప్రధాని ?
A జవహర్‌లాల్ నెహ్రూ (17 సార్లు) .

Q మొదటి అటార్నీ జనరల్ ?
A ఎం.సి. సెతల్ వాడ్.

Q పదవిలో ఉండగా మరణించిన ఏకైక స్పీకర్?
A జి.ఎం.సి. బాలయోగి .

Q భారత్‌లో హత్యకు గురైన ఏకైక వైశ్రాయి ?
A లార్డ్ మేయో (1872) .

Q ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయుడు ?
A అభినవ్ బింద్రా (2008 బీజింగ్ షూటింగ్).

Q అంతరిక్షంలోకి వెళ్లిన భారత సంతతికి చెందిన తొలి మహిళ ?
A కల్పనా చావ్లా.

Q అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడు ?
A రాకేష్ శర్మ (1984).

Q భారత్‌ను పాలించిన తొలి మహిళ ?
A రజియా సుల్తానా (1236 1240).

Q తొలి మహిళా రాయబారి ?
A విజయలక్ష్మి పండిట్ (మాజీ సోవియట్‌కు 1947–49) .


Q ఐక్యరాజ్యసమితి సివిల్ పోలీస్‌కు సలహాదారుడిగా నియమితులైన తొలి భారతీయ మహిళ ?
A కిరణ్‌బేడీ.

## ఓపెన్ కాస్ట్ మైనింగ్‌పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్

**మనతెలంగాణ/న్యూఢిల్లీ:** తెలంగాణ లోని భూపాలపల్లిలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేపట్టడం వల్ల విపరీతమైన గాలి కాలుష్యంతో పాటు, ప్రజలు విపరీతమైన శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నందువల్ల దాన్ని ఆపేలా ఆదేశాలివ్వాలంటూ గురువారం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలయ్యింది. భూపాలపల్లికి చెందిన రాజలింగంమూర్తి తరపున సుప్రీంకోర్టు న్యాయవాది శ్రావణ్ కుమార్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ధర్మాసనం సింగరేణి కాలరీస్ సంస్థకు, కేంద్ర అటవీ,పర్యావరణ మంత్రిత్వ శాఖకు , సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, తెలంగాణ చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈలోపు ఈ నోటీసులకు సమాధానం ఇవ్వాల్సిందిగా ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. ఓపెన్ కాస్ట్ మైనింగ్ లో భాగంగా జరిపే పేలళ్ల వల్ల పిల్లలు, పెద్దవాళ్లు భయభ్రాంతులకు లోనవుతున్నారని, తమ ఇళ్లు దెబ్బతింటున్నాయని గురువారం సమర్పించిన పిటిషన్ లో పిటీషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నదని, కేంద్ర అటవీ,పర్యావరణ మంత్రిత్వ శాఖ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు ఎటువంటి పర్యవేక్షణ చేయడం లేదని పిటిషన్ లో పేర్కొన్నారు.



## సిఎం క్షమాపణ చెప్పాలి : దత్తాత్రేయ



**మన తెలంగాణ**/హైదరాబాద్: తన రాజకీయ జీవితంలో ప్రధాని మోడీ లాంటి నీతి నిజాయితీ, సమర్ధత కలిగిన ప్రధానిని చూడలేదన్న ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో మాట్లాడిన మాటలు ఏమయ్యాయని బిజెపి ఎంపి బండారు దత్తాత్రేయ ప్రశ్నించారు. ప్రధాని మోడీని విమర్శించినంత మాత్రన ఆయన ఇమేజ్‌ను తగ్గించలేరని, ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేసి, దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బండారు దత్తాత్రేయ గురువారం సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. సిఎం మోసపూరిత మాటలను, రెచ్చగొట్టే అవకాశ వాద ప్రసంగాలను ప్రజలు సంపూర్ణంగా అర్థం చేసుకుంటారన్నారు. వచ్చే ఎన్నికలపై భయం పట్టుకున్నదనేందుకు సిఎం ఉపయోగించిన పదజాలమే స్పష్టం చేస్తున్నదన్నారు. రైతు సహకార సంఘాలను రాజకీయం చేసి సర్వనాశనం చేశారని ఆరోపించారు.

## జైత్రయాత్రలా సాగిపోతోంది : మల్లు

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ప్రజా చైతన్య యాత్ర, జైత్ర యాత్ర లాగా సాగిపోతుందనిటిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ప్రధాన కార్యదర్శులు లక్ష్మన్ కుమార్ గౌడ్, ఉజ్మా షాకీర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాత్ర పెద్ద ఎత్తున విజయవంతం కావడంతో బెంబెలెత్తిన టిఆర్ ఎస్ నాయకులు పిచ్చి పట్టి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులను బాబా దొంగలు అంటు చేస్తున్న విమర్శలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కాగా ప్రధాన కార్యదర్శి ఉజ్మా షాకీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు పాత బస్తీ యువకులకు మల్లు రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## కోదండరామ్‌కు ఘనస్వాగతం



**మన తెలంగాణ**/హైదరాబాద్: అమెరికా పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌కు గురువారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జెఎసి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో కోదండరామ్ అమెరికా పర్యటనలో ఎన్‌ఆర్‌ఐలతో కూడా సమావేశాలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, రాజకీయ పరిణామాలు, రాజకీయ పార్టీకి దారి తీసని కారణాలను వారికి వివరించారు . కాగా పార్టీ ఆవిర్భావ సభ సన్నాహాక కమిటీ ఏర్పాటుపై జెఎసి త్వరలోనే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నది.

## గిరిజనుల మధ్య ప్రభుత్వం చిచ్చు

**మన తెలంగాణ**/ హైదరాబాద్: గిరిజనుల మధ్య ప్రభుత్వం చిచ్చు పెట్టడంతో అల్లర్లతో ఆదిలాబాద్ జిల్లా ఇప్పటికే కశ్మీర్‌లా మారిపోయిందని మాజీ ఎంపి, టిపిసిసి అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ అన్నారు. ఆదిలాబాద్‌ను కశ్మీర్‌లా చేస్తామన్న సిఎం కెసిఆర్ వ్యాఖ్యలపై ఆయన ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో నాయకులు సూర్యా నాయక్‌తో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్‌లపై సిఎం కెసిఆర్ నాన్చివేత ధోరణి అవలంభిస్తూ, గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు.

## అపాచీ విడి భాగాలు

(మూడవ పేజీ తరువాయి)

గురువారం ప్రారంభించారు. హైదరాబాద్ శివారులోని ఆదిభట్లలో 13 ఎకరాల (14 ఒవవ చ.మీ.) విస్తీర్ణంలో రూ. 200 కోట్ల పెట్టుబడితో టాటా బోయింగ్ ఏరోస్పేస్ కేంద్రం ఏర్పాటైంది. ఈ కేంద్రం ద్వారా తయారయ్యే బోయింగ్ విడిభాగాలు అపాచీ హెలీకాప్టర్లకు వినియోగించే విధానాన్ని టాటా సన్స్ ఛైర్మన రతన్ టాటా, కెటిఆర్ తదితరుల సమక్షంలో నిర్మలా సీతారామన్ పరిశీలించారు.

### హెలికాప్టర్ల ఫెసిలిటీ కేంద్రం : నిర్మలా సీతరామన్

'మేకిన్ ఇండియా'లో భాగంగా టాటా బోయింగ్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో హెలికాప్టర్ల విడి భాగాల తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయించామని, 'అపాచీ' అనే యుద్ధ హెలికాప్టర్‌లకు వినియోగించే ప్రధాన భాగాలు ఇప్పుడు తెలంగాణలో తయారు కానుండడం అభినందనీయమని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. కాలుష్యరహిత (జీరో డిఫెక్ట్) పద్ధతిలో హెలికాప్టర్లు ఇక్కడ తయారవుతాయని, 'అపాచీ' రకం హెలీకాప్టర్లను అమెరికా సైన్యం యుద్ధాల్లో ఎక్కువగా వాడుతోందన్నారు. ఈ యూనిట్ నిర్ణీత సమయం కంటే ముందుగానే పూర్తయిందని, సొంత సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న ఈ ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతికి ధీటుగా ఉంటాయన్నారు. అత్యాధునిక రక్షణ సంస్థలకు దేశాన్ని వేదిక చేయటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో వాటి ఉత్పత్తుల సరఫరా చేయటం దేశానికే గర్వకారణమన్నారు.

### తెలంగాణకు డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రం కేటాయించండి : మంత్రి కెటిఆర్

రక్షణ రంగ ఉత్పత్తులకు తెలంగాణ కేంద్ర బిందువుగా మారుతోందని, టాటా బోయింగ్‌తో పాటు ఎయిర్‌బస్, యూటిసి, సిఎఫ్‌ఎం వంటి ప్రతిష్టాత్మక ఏరోస్పేస్ సంస్థలు వస్తున్నాయని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే మూడు ఏరోస్పేస్ విడి భాగాల తయారీ కంపెనీలు వచ్చాయని, ఇప్పుడు బోయింగ్ ఏరోస్పేస్ సంస్థ ఫెసిలిటీ కేంద్రాన్ని ప్రారంభిస్తోందన్నారు. ఇప్పటికే అనేక రక్షణ రంగ సంస్థలకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణకు డిఫెన్స్ మ్యానిఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కేటాయించాలని నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. బోయింగ్ ఇండియా అధ్యక్షులు ప్రత్యూష్ కుమార్ మాట్లాడుతూ భారతీయ పరిశ్రమతో తమ భాగస్వామ్యం మేకిన్ ఇండియా కార్యక్రమ లక్ష్యాన్ని చేరువ చేస్తోందన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఎండి సుకరన్ సింగ్ మాట్లాడుతూ బోయింగ్‌తో కలిసి తమ ప్రయాణం అతి ముఖ్యమైన మైలురాయిని చేరుకుందన్నారు. రక్షణ మార్కెట్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన ఉత్పత్తులపై భారత్ దృష్టి కేంద్రీకరించిన వేళ ఈ భాగస్వామ్యం ఇటు మేకిన్ తెలంగాణ, అటు అంతర్జాతీయ రక్షణ తయారీ రంగంలోనూ కీలకమైన ముందడుగా తాము భావిస్తున్నామన్నారు. అంతర్జాతీయ ఏరోస్పేస్, డిఫెన్స్ మార్కెట్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్ అతి ముఖ్యమైన సంస్థగా మరోసారి నిరూపించుకునే అవకాశం లభించిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎండి, సిఈవో సుకరన్ సింగ్, బోయింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ లన్నే కారట్, అమెరికా అంబాసిడర్ కెన్ జెస్టర్, టిఆర్‌ఎస్ ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, ఎంఎల్‌ఏలు తీగల కృష్ణారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికార గర్వం.. కుసంస్కారం

- స్థాయికి మించి మంత్రి కెటిఆర్ వ్యాఖ్యలు
- టిఆర్ఎస్ పుట్టకముందే ఫ్లోరైడ్‌పై పోరాడాం : జానారెడ్డి



**మన తెలంగాణ**/ హైదరాబాద్: సిఎం కెసిఆర్ తనయుడు, మంత్రి కెటిఆర్ అధికార గర్వం, కుసంస్కారంతో మాట్లాడుతున్నారని ప్రతిపక్ష నాయకులు కుందూరు జానారెడ్డి విమర్శించారు. జానాబాబా అంటూ తనపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. స్థాయికి మించి మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్దతి కాదని హెచ్చరించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో గురువారం సిఎల్‌పి విప్ ఎస్.ఎ.సంపత్ కుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థాయిని మించిన వాళ్ళ పై మాట్లాడితే స్థాయి పెరుగుతుందనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఒక ముఠా ను తయారుచేసుకుని ఊతపదాలతో ప్రజలను భ్రమింపజేస్తున్నారని కెటిఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రి కెటిఆర్ లాంటి నాయకులకు వివరణ ఇవ్వడం తన స్థాయి కాదని భావించినా మాట్లాడాల్సి వస్తోందని, ఇదే తన చివరి కౌంటర్ ప్రెస్ మీట్ అని స్పష్టం చేశారు. తమ నాయకుల పైన కేసులున్నాయని పదే పదే కెటిఆర్ మాట్లడుతున్నారని, ఎవరి మీద ఏవైనా కేసులుంటే, దానికి వారే బాధ్యులవుతారని అన్నారు. రుజువు చేసి దోషులుగా తేలితే వారికి శిక్షలు వేయాలని, కానీ ఇలా రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు. టిఆర్ ఎస్ నాయకులపైనా కేసులున్నాయని, తెలంగాణ ద్రోహులను టిఆర్ ఎస్‌లో కలుపుకున్నారని ప్రజలు అంటున్నారని ఆయన అన్నారు. రాజకీయ ఫిరాయింపులను తాను గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించానని, తాను పార్టీ మారినప్పుడు పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. తాను ఒక పార్టీ పెట్టి, ఏమి ఆశించకుండానే దానిని కాంగ్రెస్ లో విలీనం చేశానని, అప్పుడు కాంగ్రెస్ అధికారంలో కూడా లేదన్నారు. తెలంగాణలో టిడిపి మనుగడ లేనందునే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లోకి వచ్చారని ఆయన వివరించారు. ఒకసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే టిఆర్ఎస్ ఉండదని, ఆ పార్టీ భవిష్యత్తులో కనుమరుగు అవుతుందని, రాజకీయాలు చేయాలనకునే టిఆర్ ఎస్ వాళ్ళు కాంగ్రెస్ లోకే వస్తారని ఆయన అన్నారు. మా పనులనే ప్రారంభిస్తున్నారుః టిఆర్ఎస్ పార్టీ పుట్టకముందే నల్లగొండలో ఫ్లోరైడ్ పైన పరిశోధనలు చేయించామని జానారెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2004–05 లో వివిధ రకాల పథకాలు తీసుకొచ్చామని, రూ. 200 కోట్లు నిధులతో అన్ని గ్రామాలకు మంచినీరు అందేలా మంజూరు చేశామన్నారు. అందులో భాగంగానే 66 గ్రామాలకు మంచినీటి సరఫరా పథకానికి తాను శంకుస్థాపన చేసానని, దానినే మంత్రి కెటిఆర్ ప్రారంభించారన్నారు. సిరిసిల్ల, సిద్ధిపేట, ఎల్లారెడ్డి, ముధోల్ లలో కూడా నిధులను నేను మంజూరుచేశామన్నారు. తామంతా చేసింది చెప్పామని, టిఆర్ ఎస్ ఏం చెప్పి అధికారంలోకి వచ్చింది, అధికారంలోకి వచ్చాక ఏం చేసిందో చెప్పుకోవాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్లల్లో అవకతవకలు జరిగాయంటున్నారని, అలాంటి వారిని గుర్తించి శిక్షించండని ఆయన సూచించారు. టిఆర్ ఎస్ రాష్ట్రంలో ఇచ్చిన గొర్రెల్లో సగం గొర్రెలైనా ఉన్నాయా? గొర్రెల అవకతవకలకు టిఆర్ఎస్ వాళ్ళు ఏమైనా చేశారా? అని అడగాల్సి ఉంటుందని అన్నారు. కులం పేరు చెప్పి ఓట్లు దండుకునే అవకాశముందని, తెలంగాణ ఆత్మాభిమానం పై దెబ్బ కొట్టే టిఆర్ ఎస్ ను ప్రజలు గమనిస్తున్నారని, వీటన్నిటిపై వచ్చే ఎన్నికలలో ప్రజలు సరైన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## క్యాన్సర్ నియంత్రణకు టాటాతో ఒప్పందం

మన తెలంగాణ / హైదరాబాద్ : 'సమగ్ర క్యాన్సర్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్' పేరుతో టాటా ట్రస్ట్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్య గురువారం అవగాహనా ఒప్పందం కుదిరింది. టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ రతన్ టాటా, రాష్ట్ర మంత్రులు కెటిఆర్, లక్ష్మారెడ్డి సమక్షంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి, టాటా ట్రస్ట్ ప్రతినిధి వెంకట్‌లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వైద్య రంగంలో ఇప్పటికే టాటా ట్రస్టు విశేషమైన కృషి చేస్తోందని, క్యాన్సర్ మేనేజ్‌మెంట్‌లో తెలంగాణ ప్రభుత్వానికి సాధ్యమైనంత సాయం చేస్తుందని టాటా ట్రస్ట్ సభ్యులు తెలిపారు. రాష్ట్ర మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ టాటాగ్రూప్‌తో తెలంగాణ ప్రభుత్వానికి విడదీయరాని బంధం ఉందని, పలు రంగాల్లో ఈ గ్రూప్ రాష్ట్రంలో సేవలందిస్తోందని, ఈ సహకారాన్ని మరువలేమన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా ల్లో బ్రెస్ట్ క్యాన్స ర్ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రస్తుతం క్యాన్సర్ నివారణ కోసం ఎంఎన్‌జె ఆసుపత్రి పనిచేస్తోందన్నారు. రతన్ టాటా మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ సృజనాత్మక ధోరణితో పాటు ఆరోగ్య రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లనే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు.

# టిఎస్‌ఆర్‌టిసికి 'ఎలక్ట్రిక్' షాక్!

- ఎలక్ట్రిక్ బస్సుల టెండర్లకు కరువైన ఆదరణ
- ముగిసిన ప్రక్రియ, వచ్చినవి 5 టెండర్లే
- కఠిన నిబంధనలే కారణమా?



**మన తెలంగాణ** / హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వం, ఆర్‌టిసి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎలక్ట్రిక్ బస్సుల టెండర్లకు ఆదరణ కరువైంది. ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు టిఎస్‌ఆర్‌టిసి టెండర్లను పిలవగా కేవలం 5 దరఖాస్తులు మాత్ర మే వచ్చాయి. టెండర్లు వేసే గడువు ఫిబ్రవరి 19వ తేదీతో, టెండర్ల ఖరారు ప్రక్రియ 28వ తేదీతో ము గిసింది. ఇందులో టాటా మోటార్స్, అశోక్ లీ లాండ్, హ్యుందాయ్, గోల్డ్ స్టోన్ తదితర బ స్సు ల తయారీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ఐదుగురు ఆపరేటర్లు మాత్రమే ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.

పర్యావరణ పరిరక్షణకు దోహదపడే కాలుష్యరహితఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇటీవల 100 బస్సులను తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసికి కేటాయించింది. ఆ బస్సులపై కేంద్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇవ్వనుంది. తొలుత ఆర్‌టిసి సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి నడపాలని భావించింది. అయితే సాధారణ బస్సు ఖరీదు సుమారు కోటి రూపాయలు ఉండగా, ఎలక్ట్రిక్ బస్సు ఖరీదు దాదాపు రూ.2.5 కోట్ల వరకు ఉంటోంది. పైగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై తగిన అనుభవం లేకపోవడంతో స్వంతంగా కొనుగోలు చేయాలనే ఆలోచనను ఆర్‌టిసి విరమించుకుంది. దానికి బదులుగా ప్రైవేటు కంపెనీలు, ఆపరేటర్ల నుంచి అద్దె ప్రాతిపాదికన బస్సులను తీసుకుని నడపాలని నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదటి దశలో 40 బస్సులను, రెండవ దశలో 60 బస్సులు నడిపేందుకు వీలుగా టెండర్లను పిలిచింది.

### ఎక్కువ ఖరీదు, నిబంధనలే అడ్డంకులా?

టెండర్‌లలో పాల్గొనేందుకు విధించిన నిబంధనల కారణంగా ఎక్కువ మంది ఆపరేటర్లు ముందుకు రాలేదని తెలిసింది. నిబంధనల ప్రకారం టెండర్లు దక్కించుకునే ఒక్కో ఆపరేటర్ ప్రతి బస్సుకు రూ.50 లక్షల బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలి. బస్సులను 60 రోజుల్లో అందుబాటులోకి తీసుకురాకపోతే ప్రతి రోజూ రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తారు. దీనికి తోడు ఎలక్ట్రిక్ బస్సు ఖరీదు కూడా ఎక్కువగా ఉండడంతో టెండర్ల పట్ల ఆసక్తి చూపలేదని సమాచారం. ఆపరేటరే బస్సును, డ్రైవర్‌ను సమకూర్చడంతో పాటు బీమా, నిర్వహణ ఖర్చులను భరించాల్సి ఉంటుంది. బస్సును ఆర్‌టిసికి అప్పగిస్తే ఒప్పందం ప్రకారం ఆపరేటర్లకు ప్రతి కిలో మీటర్‌కు అద్దెను చెల్లిస్తుంది. ఈ బస్సు లు నడపడానికి దాదాపు రూ.10 కోట్ల ఆస్థి కలిగిన వారు లేదా అంత మొత్తంలో టర్నోవర్ కలిగిన ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న ఆపరేటర్లకు అవకాశం ఇవ్వాలని ఆర్‌టిసి నిర్ణయించింది. కేంద్ర ప్రభు త్వం ప్రకటించిన 'ఫాస్టర్ అడాప్షన్, మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రీడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్ స్కీమ్' (ఎఫ్‌ఎఎంఇ) నిబంధనల ప్రకారం బస్సులను కొనుగోలు చేసి నడపాల్సిన బాధ్యత పూర్తిగా బిడ్డర్లదే. కేంద్రం ప్రకటించిన సబ్సిడీ ప్రోత్సహాకాన్ని పొందే వి ధంగా సహకారాన్ని మాత్రమే ఆర్‌టిసి అందిస్తుం ది. మరోవైపు కేంద్రప్రభుత్వం ప్రకటించిన 60 శాతం సబ్సిడీ రావడంలో ఆలస్యం జరిగితే పరిస్థితి ఏమిటనే ఆలోచనలో ఆపరేటర్లు ఉన్నారు. ఇందులో ఏ ఒక్కటీ నిర్ణీత గడువులోగా జరగకపోయినా తాము తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పలువురు ఆపరేటర్లు చెబుతున్నారు. ఈ కారణంగానే ఎలక్ట్రిక్ బస్సులను నడిపే విషయంలో ఆపరేటర్లు వెనుకా ముందాడుతున్నారు. అలా కాకుండా నిబంధనలను సడలిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

## న్యాయవాదుల నిరసనలు




(మూడవ పేజీ తరువాయి)

బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు విధులను బహిష్కరించి, నిరసనకార్యక్రమాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని హైకోర్టు నుంచి పెద్ద సంఖ్యలో న్యాయవాదులు చార్మినార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. ముందు జాగ్రత్త చర్యగా భారీగా పోలీసులను మోహరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు జెల్లి కనకయ్య, జనార్ధన్‌గౌడ్, శ్రీగోవర్ధన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, అనంతచారిలు మాట్లాడుతూ..ప్రస్తుతం ఉమ్మడి హైకోర్టుకు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ ఉన్నారని అతని స్థానంలో పూర్తి కాలం ప్రధాన న్యాయమూర్తిని నియమించాలన్నారు. అలాగే వివిధ కోర్టులలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇక హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాడం ద్వారా న్యాయవాదులకు వెసులుబాటు కలుగుతుందన్నారు. నేర విచారణ చట్టం 41 సిఆర్‌సిపి చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారన్నారు. 41 సిఆర్‌పిసి చట్టాన్ని పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల బహిష్కరణ కొనసాగనున్నట్లు తెలిపారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు, రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతో పాటు ఆయా జిల్లాల పరిధిలోని న్యాయస్థానాల వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## డిజిటల్‌లో టాప్

(మూడవ పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఇప్పటివరకు (44 నెలల్లో) 225.99 కోట్ల డిజిటల్ లావాదేవీలను నిర్వహించగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇది 276.38 కోట్లుగా ఉంది. ఈ 44 నెలల కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 1545.38 కోట్ల డిజిటల్ లావాదేవీలు నమోదయ్యాయి. కేంద్రపాలిత ప్రాంతాల విభాగంలో ఇక అతి తక్కువ జనాభా (64,429 మంది) ఉన్న లక్షద్వీప్‌లో ప్రతి వెయ్యి మంది నాలుగేళ్ళుగా జరిపిన డిజిటల్ లావాదేవీల సంఖ్య 97,963గా ఉంది. తెలంగాణ ప్రభుత్వం మొత్తం 192 సేవలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. సగటున ఒక్కో సేవకు జరుపుతున్న లావాదేవీలను చూసినా 1.86%తో తెలంగాణ రెండవ స్థానంలో ఉంది. 'ఇ గవర్నెన్స్' సందర్భంగా డిజిటల్ లావాదేవీల గురించి మంత్రి కెటిఆర్ ప్రస్తావిస్తూ డిజిటల్ లావాదేవీల్లో ప్రతి వెయ్యి మంది సగటున తెలంగాణలోనే ఎక్కువగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. పన్నుల చెల్లింపులు, సర్టిఫికెట్ల జారీ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, నగదు రహిత చెల్లింపులు, పాస్‌పోర్టు దరఖాస్తులు, ఫీజు రీఇంబర్స్‌మెంట్ చెల్లింపులు, పింఛన్ల చెల్లింపలు, లైసెన్సుల జారీ, ఆరోగ్య సేవలు, రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలు, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు.. ఇలా మొత్తం 192 రకాల లావాదేవీలను డిజిటల్ రూపంలోనే నిర్వహిస్తోంది. గడచిన నాలుగున్నరేళ్ళుగా ప్రతీ ఏటా తెలంగాణ నిర్వహించిన లావాదేవీలను పరిశీలిస్తే...

| సంవత్సరం | మొత్తం లావాదేవీ | ప్రతి వెయ్యి మంది |
|---|---|---|
| 2014 | 2,49,86,176 | 710 |
| 2015 | 88,86,213,303 | 25,249 |
| 2016 | 80,93,86,346 | 22,997 |
| 2017 | 45,98,52,722 | 13,066 |
| 2018 | 7,68,34,554 | 2,183 |

# నిందితుల ఆస్తులన్నింటి జప్తు

(మూడవ పేజీ తరువాయి)

నేరాలు, రుణాల ఎగవేతదార్లు విదేశాలకు పారిపోయిన దశలో ఆస్తుల స్వాధీనానికి సంబంధించి ఈ ఫ్యూజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ బిల్లును మంత్రి మండలి ఆమోదించిందని జైట్లీ తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో ఈ బిల్లును ప్రవేశపెడతారు. రూ వంద కోట్లు అంతకు మించి రుణాలు పొంది లేదా ఈ మేరకు ఆర్థిక అక్రమాలకు పాల్పడి పరారయిన వారిపై ఆస్తుల జప్తు చర్యలకు వీలేర్పడుతుందని మంత్రి వివరించారు. నిర్దిష్ట నేరాలకు పాల్పడి, విచారణ ప్రక్రియను తప్పించుకోవడానికి దేశం వదిలిపెట్టి వెళ్లిన వారిపై న్యాయస్థానాల నుంచి అరెస్టు వారంట్లు జారీ అయి ఉంటే వారిని ఫరారీ దోషులుగా గుర్తిస్తారు, వారి ఆస్తులన్నింటినీ స్వాధీనపర్చుకుంటారు. పిఎన్‌బిలో భారీ స్థాయిలో అక్రమాలకు కేంద్ర బిందువుగా మారిన నీరవ్ మోడీ ఆస్తుల స్వాధీనం నేపథ్యంలో ఈ కీలక బిల్లును కేంద్రం ఆమోదించింది. ఆర్థిక నేరస్తుల ఆస్తులను స్వాధీనపర్చుకోవడానికి ఇప్పటివరకూ డబ్బుల అక్రమలావాదేవీల నిరోధక చట్టం (పిఎంఎల్‌వి) అమలులో ఉందని అయితే ఇప్పుడు తలపెట్టిన చట్టం దీనికి భిన్నమైనదని మంత్రి వివరించారు. పిఎంఎల్‌వి పరిధిలో కేవలం నేర లబ్ధిని, అది కూడా దోషిగా నిరూపితం అయిన తరువాత జప్తు చేయడం జరుగుతోంది. విదేశాలకు ఫరారయిన వారి విషయంలో మరింత కఠినంగా వ్యవహరించేందుకు పాల్పడిన నేరాలతో వచ్చే లబ్ధి ఒక్కటే కాకుండా, ఆ నేరాలతో సంబంధం లేని ఇతర ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకోవడానికి దీని వల్ల వీలేర్పడుతుందని మంత్రి చెప్పారు. చట్టానికి అనుగుణంగా వ్యవహరించని వారిని గుర్తించి కోర్టులు అరెస్టు వారంట్లు జారీ చేస్తాయని, ఈ విధంగా వారంట్లు జారీ అయి ఉన్న వారు విదేశాలకు తరలిపోయినప్పుడు ఆస్తులన్నింటి జప్తుతోనే విచారణ సమగ్రం అవుతుందని తెలిపారు. వారంట్లు జారీ అయిన నాటి నుంచి వారి పట్ల ఈ చట్టం నిబంధనలు వర్తిస్తాయని కూడా వివరించారు. 2017–18 బడ్జెట్‌లోనే ఈ చట్టం తీసుకువస్తున్నట్లు కేంద్రం తెలిపింది. అయితే నీరవ్ ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీతో పాటు ఫరారు అయిన నేపథ్యంలో బిల్లు తీసుకువచ్చే ప్రక్రియను వేగవంతం చేసినట్లు వెల్లడైంది. ఆర్థిక నేరస్తుల నుంచి రుణాలను త్వరిగతిన రాబట్టుకునేందుకు ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా చర్యలు తీసుకునేందుకు ఈ బిల్లు ద్వారా మార్గం సుగమం అవుతుంది.

తప్పించుకుతిరుగుతున్న ఆర్థిక నేరస్తుల ఆస్తుల స్వాధీనపై బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనకు ఇప్పుడు కేబినెట్ ఆమోదం దక్కిందని, బిల్లు తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు. ప్రాసిక్యూషన్ నుంచి తప్పించుకోవడానికి వెళ్లిన వారందరికీ ఈ చట్టం వర్తిస్తుందని, ఇందులో పాత కొత్త కేసుల ప్రస్తావన ఉండదని చెప్పారు. ఆస్తుల జప్తు వాటిని వేలం వేయడంతో పాటు సంబంధిత ఆర్థిక నేరస్తులు దేశంలో వీటిని కోర్టులలో సవాలు చేయడానికి వీల్లేకుండా సరైన నిర్ధేశనం చేసేందుకు న్యాయమంత్రిత్వశాఖ నిబంధనలను రూపొందించింది.


ఇక అక్రమాలకు పాల్పడే ఆడిటర్ల నియంత్రణకు వీలు కల్పించే నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథార్టీ (నాఫ్రా) ఏర్పాటుకు కూడా మంత్రి మండలి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా తొలుత అన్ని లిస్టెడ్ కంపెనీల ఆడిటర్లు, నమోదు కానీ భారీ స్థాయి కంపెనీల ఆడిటర్లు దీని పరిధిలోకి వస్తారు.

# తెర మరుగు



(మూడవ పేజీ తరువాయి)

పాటు ప్రకటనలు వేస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇక ప్రేక్షకులకు ఇష్టమైన సినిమా ట్రైలర్‌లను వేయడానికి ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఇలా పలు అంశాలపై డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల యాజమాన్యాలతో చర్చలు జరిపాం. ట్రైలర్లకు తక్కువ తీసుకునేందుకు వాళ్లు ఒప్పుకున్నారు. విపిఎఫ్ రేట్లు తగ్గించే విషయంతో పాటు పలు అంశాలపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి సినిమా థియేటర్లు బంద్ చేస్తాం. తదుపరి జరిగే చర్చలను బట్టి ముందు కెళ్తాం. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో విపిఎఫ్ రేటు అంతా ఒక్కటే ఉంది. ఉత్తరాదిలో కొన్ని చోట్ల ఎక్కువగా... మరి కొన్ని చోట్ల తక్కువగా ఉంది. గతంలో థియేటర్లలో మామూలు సౌండ్ టెక్నాలజీ ఉండేది. ఆతర్వాత డిటిఎస్ వచ్చింది. దాన్ని ఎగ్జిబిటరే పెట్టుకున్నాడు. ఇప్పుడు 'అట్మాస్' అని వస్తోంది. అది కూడా ఎగ్జిబిటరే పెట్టుకుంటున్నాడు. దానికి ప్రత్యేక ఛార్జీ వసూలు చేయలేదు. ప్రొజెక్షన్ సిస్టమ్‌ను మాత్రం వేరెవరో కొత్తవాళ్లు వచ్చి పెట్టేసి డబ్బులు వసూలు చేయడం మొదలుపెట్టారు. ఒక థియేటర్‌లో సౌండ్, సినిమా ప్రొజెక్షన్, సీట్లు అన్ని థియేటర్ యాజమాన్యం ఇవ్వాలి. అయితే ఇక్కడ ప్రొజెక్షన్‌ను విభజించి దానికి ప్రత్యేక ఛార్జీ వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లలో యుఎఫ్‌ఒ, క్యూబ్ వాళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎ.రమేష్ ప్రసాద్‌కు చెందినది విఎక్స్‌డి. ఇండస్ట్రీ ఏమంటే తాను దానికి కట్టుబడి ఉంటానని ఆయన మాకు మాట ఇచ్చాడు. ఇవికాకుండా రాక్స్, అల్ట్రా, ప్రొవిజ్ అని చిన్నచిన్న డిజిటల్ ప్రొవైడర్ల వాళ్లు కూడా ఉన్నారు. అయితే యుఎఫ్ఒ, క్యూబ్‌లకు 90 శాతం వాటా ఉండటంతో వీళ్లతోనే ప్రధానంగా చర్చించాల్సి వస్తోంది. ప్రస్తుతానికి మేము ఎవరినీ ప్రోత్సహించడం లేదు. కొత్తగా పోటీకి ఎవరైనా వస్తామంటే మాత్రం తప్పకుండా ప్రోత్సహిస్తాం''అని అన్నారు. ''సినిమాలను ఆపాలని మాకు ఎలాంటి దురుద్దేశం లేదు. సినిమా అనేది ఆగకూడదనేదే మా తపన. రేపు ఎవరైనా మాకు వెయ్యి ప్రొజెక్టర్లు, వెయ్యి సర్వర్లు ఇస్తే వెంటనే పెట్టేస్తాం. ఇక ప్రస్తుతం థియేటర్ల బంద్ వల్ల కోల్పోయే నష్టం కన్నా భవిష్యత్తులో వచ్చే లాభమే ఎక్కువ''అని డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెఎసి కన్వీనర్ పి.కిరణ్, తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ముత్యాల రామదాసు, డిజిటల్ కమిటీ ఛైర్మన్ దామోదర్ ప్రసాద్, సి.కళ్యాణ్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరపున కె.మురళీ మోహన్, ఏషియన్ ఫిల్మ్స్ సునీల్ నారంగ్, ప్రతాని రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# హజ్ యాత్రికులపై తగ్గనున్న చార్జీల భారం

**మన తెలంగాణ** / హైదరాబాద్ : హజ్ యాత్ర కోసం భారత దేశం నుంచి సౌదీ అరేబియా వెళ్లే యాత్రికులపై చార్జీల భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విమానయాన సంస్థలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న విమాన ఛార్జీలను నియంత్రించాలని కేంద్ర హజ్ కమిటి, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణలోని హజ్ యాత్రికులకు దీని వల్ల ఏ మేరకు లబ్ధి కలుగుతుందనేదానిపై చర్చలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్ళేవారు సుమారు రూ.62 వేలను విమాన చార్జీలకే ఖర్చు చేస్తున్నారు. గుజరాత్, ముంబాయిల నుంచి వెళ్ళేవారు దాదాపు లక్ష రూపాయలు విమాన టిక్కెట్లకే ఖర్చు చేయాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుండి ఈ ఛార్జీలు రూ.25 వేలు దాటటంలేదు. గతంలో కేంద్రం ఇచ్చిన హజ్ సబ్సిడీ కూడా చార్జీలు 65 వేల పైబడి ఉన్న వారికి మాత్రమే వర్తించేది. తెలంగాణ యాత్రికులకు గత రెండేళ్లుగా హజ్ సబ్సిడీ వర్తించడమే లేదని తెలంగాణ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎ షుకూర్ తెలిపారు. 'విమాన టిక్కెట్ ధర రూ. 65 వేలు పైబడితేనే సబ్సిడీ వర్తిస్తుంది' అనే నిబంధనను ఎత్తివేసి టెండర్లు పిలిచి తక్కువ చార్జీలు కోడ్ చేసిన విమానయాన సంస్థలకు అప్పజెప్పాలని మైనారిటీ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. దీని వల్ల ఛార్జీల భారం మరింత తగ్గుతుందని పేర్కొంటున్నారు.

### ఇద్దరు పిల్లలకు విషం తాగించి

## రైతు దంపతుల ఆత్మహత్య

### ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు

**మన తెలంగాణ**/కాసిపేట : ఐదేళ్లుగా చేస్తున్న వ్యవసాయంతో ఆర్థిక నష్టాలు, చేసిన అప్పులు తీర్చలేక మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లిలో గురువారం రైతు దంపతులు కొండగొర్ల తిరుపతి (30), కొండగొర్ల భూదేవి(30) తమ ఇంటిలోనే ఆత్యహత్యకు పాల్పడ్డారు. పిల్లలు కీర్తన (10), శ్రీశాంత్(8)లకు కూడా విషం తాగించగా వారు వాంతులు చేసుకోవడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. తిరుపతి తన రెండెకరాల భూమితో పాటు, మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అన్ని పంటలతోపాటు, కూరగాయలను సాగు చేశాడు. ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్న తిరుపతి, మానసిక వేదనకు గురై కుటుంబంతో సహా ఆత్యహత్యకు పాల్పడ్డాడు. హోళీ పండగ రోజే గ్రామంలో యువ దంపతులు ఆత్మహత్యకు పాల్పడడంతో కోపోద్రుకులైన గ్రామస్తులు చొప్పరిపల్లె రహదారిపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యంతో తిరుపతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్న హామీ మేరకు గ్రామస్తులు శాంతించారు. సంఘటన స్థలానికి బెల్లంపల్లి ఎసిపి బాలుజాదవ్, మందమర్రి సిఐ రాంచందర్‌రావ్, కాసేపేట ఎస్ఐ భాస్కర్‌రావ్‌లు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన కారు

### భార్య, భర్త మృతి : మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

మనతెలంగాణ / అశ్వాపురం : మండలంలోని మిట్టగూడెం గ్రామపంచాయతీలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. మిట్టగూడెం ప్రధానరహదారిపై ఓ లారీ రెండు రోజులుగా ప్రధాన రహదారి పక్కనే నిలిపి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం నుండి మణుగూరుకు వెళ్తున్న కారు (టిఎస్ 04ఈఎన్ 1816నెంబర్) అతివేగంగా ఆగి ఉన్న లారీని ఢికొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కుడిపుడి నాగేశ్వరరావు, భార్య లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని సోదరుడు వెంకటేశ్వరరావు ఇతని భార్య లక్ష్మి కి, డ్రైవర్‌కు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందింఇచ క్షతగాత్రులను భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అశ్వాపురం సిఐ ఆలం నరేందర్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరగడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ ఎక్కడిక్కడే నిలిచిపోయింది. దీంతో వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## వృద్ధుల పెన్షన్లకు వెంటనే బడ్జెట్ విడుదల చేయాలి

### సిఎం కెసిఆర్‌కు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**మన తెలంగాణ** / హైదరాబాద్ / ముషీరాబాద్ : ప్రతి నెల వచ్చే పింఛన్లు గత మూడు మాసాలుగా రాకపోవడంతో ఆసరా ఇతర పింఛన్ల కింద బతుకుతున్న వృద్ధులు, ఇతర వర్గాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వీటికి బడ్జెట్ కేటాయించి వృద్ధుల బాధలు తీర్చాలని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం కృష్ణయ్య మాట్లాడుతూ పింఛన్లపై ఆధారపడి రాష్ట్రంలో 35 లక్షల మంది జీవిస్తున్నారన్నారు. 35లక్షల మంది వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీ కార్మికులు పింఛన్లు రాకపోవడంతో వారి బతుకు దుర్భరంగా మారిందన్నారు.

**పింఛన్లను వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచాలి**

పెరిగిన ధరలకనుగుణంగా ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచాలని కృష్ణయ్య సిఎంకు కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో పింఛన్ పెంచడానికి బడ్జెట్‌ను పెంచాలన్నారు.

## రాష్ట్రపతిని కలిసిన మత్స్యకారుల సంఘం

### ఎస్‌టి జాబితాలో చేర్చాలని వినతి



**మన తెలంగాణ** / హైదరాబాద్/ ముషీరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో బిసిలుగా కొనసాగుతున్న మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఢిల్లీలో జాతీయ మత్స్యకారుల హక్కుల రక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు ఎ.ఎల్.మల్లయ్య అధ్యక్షతన కలిసి వినతి పత్రాన్ని అందచేసారు. ఈ సందర్భంగా ఎ.ఎల్. మల్లయ్య మాట్లాడుతూ దేశంలోని మహారాష్ట్రతో పాటు 11 రాష్ట్రాల్లో మత్స్యకారులు ఎస్‌టి జాబితాలో ఉన్నారని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు అన్ని రాష్ట్రాలకు వర్తించే విధంగా కృషి చేయాలన్నారు. తెలంగాణ, ఎపిలో అగ్నికుల క్షత్రియా, పల్లి, జాలరి, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చే బిల్లు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. 1970లోనే రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను ఎస్టీలుగా రికమండ్ చేసిందని గుర్తు చేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును అమలు చేయాలని కోరామన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఎస్‌టిలో చేర్చడానికి రాష్ట్రపతి సిఫార్సు చేస్తామని హామి ఇచ్చినట్లు మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి రాష్ట్ర మంత్రి మల్లాది కృష్ణారావు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలుగు రాష్ట్రాల ప్రతినిధులతో పాటు జాతీయ మత్స్యకారుల హక్కుల రక్షణ కమిటీ కార్యదర్శి వీరన్న, బాలయ్య, ఎంబి. నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

**మన తెలంగాణ**/బూర్గంపాడు: ప్రియుడి, ప్రియుడి స్నేహితునితో కలిసి భర్య భర్తను కడతేర్చిన సంఘటన బూర్గంపాడు, భద్రాచలంలో సంచలంగా మారింది. భద్రాచలం సిఐ సత్యనారాయణ రెడ్డి,పాల్వంచ సిఐ రాఘవేంద్రరావు,బూర్గంపాడు ఎస్ఐ సంతోస్ కథనం మేరకు.... భద్రాచలంలోని లంబాడీ తండాకి చెందిన ఐతంరాజు కొండల్‌రావు(33) అనే వ్యక్తి భద్రాచలంలోని సిపియం కార్యాలయంలో కార్యాలయం సెక్రటరీగా పని చేస్తున్నాడు.ఈ క్రమంలో రెండవ వివాహం ఐతంరాజు ముత్తేశ్వరిని చేసుకున్నాడు. ముత్యేశ్వరికి పాల్వంచకి చెందిన నానితో వివాహేతర బంధం ఉంది. దీంతో కొండల్‌రావును చంపాలన్న వ్యూహరచనతో బుధవారం రాత్రి ఐతంరాజు ముత్తేశ్వరి, ప్రియుడు నాని, అతని స్నేహితుడు శివతో కలని అర్ధరాత్రి సమయంలో గొంతునులిమి చంపారు. మృతదేహాన్ని గోదావరి ఇసుకలో పూడ్చిపెట్టారు. ఇదంతా చూసిన గోపి అనే చిన్నారి గురువారం కొండల్‌రావు బంధువులకు తెలుపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని భద్రాచలం ఎమెల్యే సున్నం రాజయ్య డిమాండ్ చేశారు.

# 'పెట్టుబడి'తో సాగు భళా



- ఈసారి వానాకాలంలో కోటి 15 లక్షల ఎకరాల సాగు !
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక

**మన తెలంగాణ**/హైదరాబాద్ : రానున్న వానాకాలంలో రాష్ట్రంలో 1.15 కోట్ల ఎకరాల భూమి సాగవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు ఇటీవల ఢిల్లీలో జరిగిన 2018 వానాకాలం సన్నద్ధతకు సంబంధించిన జోనల్ సదస్సులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. గతేడాది వానాకాలంలో 1.06 కోట్ల ఎకరాలు సాధారణ సాగు అంచనా ఉండగా, 96.61 లక్షల ఎకరాలలో సాగు నమోదైందని, దీనితో పోలిస్తే 2018 వానాకాలంలో 19 శాతం సాగు విస్తీర్ణం పెరగనుందని స్పష్టం చేసింది. ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి పథకం కింద ఎకరాకు రూ.4 వేలు ఇవ్వనున్నందున సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుందని భావిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఉన్న అంచనాల మేరకు 1.15 కోట్ల ఎకరాలు సాగు అవుతుందని అనుకుంటున్నామని, ఇంకాస్త పెరిగే సూచనలు కూడా ఉన్నాయని ఆ నివేదికలో పేర్కొన్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'మన తెలంగాణ'కు చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎరువుల కేటాయింపులు ముందస్తుగా తగిన స్థాయిలో చేయాలని కోరినట్లు తెలిసింది. చిన్న, సన్నకారు రైతులు కూడా ప్రభుత్వమే పెట్టుబడి సొమ్ము ఇస్తే పడావులో ఉన్న భూమిలో కొంతైనా సాగు చేస్తామని పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో వానాకాలంలో నికరంగా 1.65 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తామని సిఎం ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు సీజన్‌లకు కలిపి రూ. 12 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని కూడా చెప్పారు. వీటన్నింటికి కాలం తోడైతే సాగుకు ఎటువంటి ఢోకా ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాస్తవానికి గత మూడేళ్లుగా 2015 నుంచి 2017 వరకు వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగడం విశేషం.

వానాకాలం సాగు విస్తీర్ణం (ఎకరాలలో)

| సంవత్సరం | సాగు విస్తీర్ణం |
|---|---|
| 2018 | 1.15 కోట్లు ( ప్రాథమిక అంచనా) |
| 2017 | 96.37 లక్షలు |
| 2016 | 92.12 లక్షలు |
| 2015 | 87.03 లక్షలు |



## బాబ్లీ నుంచి నీటి విడుదల

**మన తెలంగాణ**/ బాల్కొండ (నిజామాబాద్ జిల్లా): సుప్రీంకోర్టు తీర్పు మేరకు బాబ్లీ ప్రాజెక్టు నుంచి 0.6 టిఎంసి నీటిని గురువారం విడుదల చేశారు. త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో నీటి విడుదల జరిగింది. ప్రాజెక్టులో 0.048 టిఎంసిల నీరు నిల్వ ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి సంవత్సరం జూలై 1న బాబ్లీ గేట్లు ఎత్తి ఎస్‌ఆర్‌ఎస్‌పికి నీటిని విడుదల చేయాలి. అక్టోబర్ 28న బాబ్లీగేటు మూసివేయాలి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ, బాబీ ప్రాజెక్టు దిగువ పరివాహక ప్రాంతాల్లో అవసరాలకు మార్చి 1న నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాజెక్టు ఇఇ రామారావు, సిడబ్ల్యుసి నుంచి ఇఇ శ్రీనివాస్, మహరాష్ట్ర నుంచి నాందేడ్ ఈఈ సెటే తదితరులు పాల్గొన్నారు.



## ఆయుష్షు పెంచే కళ

- ప్రజల ఆనందమే మా అనందం
- సిద్దిపేట కళాక్షేత్రం ఏర్పాటు చేసుకోవడం ఆనందం
- ప్రతి కళాకారుడికీ మంచి తరుణం : మంత్రి హరీశ్‌రావు

**మన తెలంగాణ**/సిద్దిపేట అర్బన్ : ఆయుష్షును పెంచే ఆయుధం కళ అని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో నూతనంగా 1కోటి 35 లక్షలతో ఏర్పాటు చేసిన సిద్దిపేట కళాక్షేత్రం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అన్ని కళలకు పెట్టిన కోట అన్నారు. ఇక్కడి కళాకారులకు ఈ కళాక్షేత్రం ఎంతగానో ఉపయెగపడుతుందని తెలిపారు. ఈకళాక్షేత్రం ఏర్పాటులో అధికారులందరిదీ ప్రముఖ పాత్ర అని కొనియాడారు. ఇంతకుముందే కోమటి చెరువు సుందరీకరణలో టూరిజం శాఖ కమిషనర్ బుర్రవెంకటేశం సహకారం మరువలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని పెంచేవిధంగా కళాకారులు కలలు ప్రదర్శించాలని కోరారు. ఇంతే కాకుండా సిద్దిపేట కోమటి చెరువు వద్ద భవిష్యత్తులో శిల్పారామం, బొటానికల్ గార్డెన్, ఎయిర్ కండీషనర్ ఆడిటోరియం, షాపింగ్ కాంప్లెక్స్ లాంటి తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.సాంస్కృతిక శాఖ చైర్మన్ రమణాచారి కూడా ప్రసంగించారు. కాగా, కళాక్షేత్రంలో పలువురు కళాకారులు తమ కళలను ప్రదర్శించారు. భారత దేశంలో ఉన్న 5 నృత్యాలను ప్రదర్శించారు. అంతర్జాతీయ స్థాయి కళాకారులలో వైష్ణవి సాయినాథ్ చేసిన కళా ప్రదర్శన కార్యక్రమానికే హైలెట్‌గా నిలిచింది.ఎంపి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ ఫారుఖ్ హుసేన్, పాతురి సుధాకర్ రెడ్డి, సాంస్కృతిక శాఖ కమిషనర్ బుర్ర వెంకటేశం, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, పురపాలక చైర్మన్ రాజనర్సు తదితరలు పాల్గొన్నారు.

# హోలీ వేడుకల్లో విషాదం

### సంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో నీట మునిగి నలుగురు విద్యార్థుల దుర్మరణం







మృతుడు సాయికృష్ణ

**మన తెలంగాణ**/పుల్‌కల్ :హోలీ రోజు విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని కోర్పోల్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సాయికుమార్(15), సాయికిరణ్‌లు(15)లు తోటి స్నేహితులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకున్నారు. వేడుకలు ముగించుకొని అందరితో కలిసి గ్రామ శివారులోని మంజీర నదిలో స్నానానికి వెళ్లారు. కేరింతలు కొడుతూ అందరూ స్నానాలు చేస్తున్నారు. వీరిరువురు సైతం వారితో కలిసి నీటిలో స్నానం చేస్తున్నారు. నీటిలో కొంతదూరం వెళ్లారు. ప్రమాద ముందన్న విషయం కనిపెట్టలేకపోయారు. నదిలో ఇసుక తోడిన గుంతలు ఉండటంలో ఒకే సారి ఇద్దరూ మునిగిపోయారు. ఇద్దరికీ ఈత రాక పోవడంతో మృత్యువాత పడ్డారు. తోటి స్నేహితులు తేరుకొని కేకలు వేయడంతో చుట్టు గల వారు వచ్చి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సాయంత్రం ఇద్దరి శవాలను బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు కుటుంబాల్లో ఒక్కరే సంతానం కావడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ఖమ్మంలో...**

మన తెలంగాణ/ ఖమ్మం క్రైం : చంద్రుగొండ మండలం కరిసెలబోడు పంచాయతీ మేకలబోడు తండాకు చెందిన గుగులోత్ విజయ్‌కుమార్ (22) ఈతకు వెళ్లి బావిలో పడి మరణించాడు. కన్న కొడుకులు పెరిగిపెద్దై తల్లిదండ్రులకు సహాయ పడతారనుకుంటే మధ్యలోనే తనువులు చలించడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల రోదనలు చూపరులను కంటతడిపెట్టించాయి. అదేవిధంగా ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో సైతం హోలీ వేడుకల అనంతరం వ్యవసాయ బావికి ఈతకు వెళ్లి సాయికృష్ణ అనే విద్యార్థి మృతిచెందాడు. ఎస్ఐ భానుప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.... ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన ఏనుగుల లక్ష్మి నర్సింహాకు ఒక్కడే కుమారుడు. ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నాడు. గురువారం హోలీ వేడుకల్లో భాగంగా మిత్రులతో కలిసి హోలీ ఆడిన అనంతరం రంగులను పొగొట్టుకునేందుకు దగ్గరలో గల వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఉదయం 11 గంటల వరకు మిత్రులతో హోలీ ఆడిన సాయికృష్ణ(19) 11.30లకు శవమై తేలాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణలో మాదిగలను మోసం చేశాయి


### కాంగ్రెస్, బిజెపిలపై పిడమర్తి రవి ధ్వజం




**మన తెలంగాణ** / హైదరాబాద్/ ముషీరాబాద్ : వర్గీకరణకు మద్దతు ఇచ్చి మాదిగలను మోసం చేసిన బిజెపి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, మంద కృష్ణలు మాదిగల ద్రోహులని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై మాదిగ యూత్ జెఏసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో తెలంగాణ మాదిగ యువజన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి పార్టీ మాదిగలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు వెంకయ్యానాయుడు మాదిగల వివాహాలకు వచ్చి వర్గీకరణ చేస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీలను ఎ, బి, సి, డిలుగా వర్గీకరించాలని, లేని పక్షంలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి మాదిగలందరూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు చేస్తామన్నారు. ప్రతి ఊరు, వాడల్లో తిరుగుతూ బిజెపి, కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్య వైఖరిని ప్రచారం చేస్తామన్నారు. అప్పటికి వర్గీకరణ కాకపోతే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపికి మాదిగలెవరూ ఓట్లు వేయకుండా చేస్తామన్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్ ఎల్లన్న మాదిగ, ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి కృష్ణ మాదిగ, అధ్యక్షులు పెరిక కరణ్ జయరాజు, వినాయకరావు, శ్రీనివాస్, రాజు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

### 28 మంది అరెస్టు, 30 సెల్‌ఫోన్లు స్వాధీనం
### రూ. 6, 91,640 లక్షల నగదు, ఐదు వాహనాలు స్వాధీనం






**మనతెలంగాణ**/శామీర్‌పేట : పేకాట స్థావరంపై ఎస్‌ఓటి, శామీర్‌పేట పోలీసులు దాడి చేసి 28 మందిని పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్స్‌ఫెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం అలియాబాద్ పరిధిలోని గ్లోబుల్‌వాల్యూ వెంచర్‌లో నగరానికి చెందిన 28 మంది హోళి సందర్భంగా విచ్చేసి పేకాట ఆడుతున్నారు. పక్కా సమాచారంతో బాలానగర్ ఎస్‌ఓటి పోలీసులు శామీర్‌పేట పోలీసులతో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నగరంలోని సీతాపల్‌మండి, చిలుకలగూడ, నామాలగుండు, వారాసిగూడ, తార్నాక, నాగోల్, హబ్సిగూడ, శివాజీనగర్ ప్రాంతాల నుంచి 28 మంది పేకాటరాయుళ్లు పేకాట ఆడుతున్నారు. వారివద్ద నుంచి రూ. 6,91,640 లక్షల నగదు, 30 సెల్‌ఫోన్లు, 3 ఇన్నోవా, 1 స్కార్‌పియో, 1 రేంజ్‌రోవర్ కార్లు స్వాదీనం చేసుకున్నట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పేకాట నిర్వాహకుడు ఎవరనేది తేలాల్సి ఉందని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భార్యను హతమార్చిన భర్త

**మన తెలంగాణ**/వనస్థలిపురం: తాగుడు బానిసైన భార్యను హతమార్చిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం హాట్య తండాకు చెందిన సందీప్ రాణి దంపతులు గత కొంతకాలంగా వనస్థలిపురం సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. సంధీప్ తాగుడు భానిసై తరుచూ భార్య రాణి (26)తో గొడవపడుతుండేవాడు. కాగా బుధవారం రాత్రి పూటుగా మద్యం సేవించి వచ్చిన సందీప్ భార్య రాణినితో గొడవపడి దిండుతో నులిమి హతమార్చాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తండ్రీ కొడుకులే దోపిడీ దొంగలు

- సిఎల్‌పి ఉప నేత కోమటిరెడ్డి



**మనతెలంగాణ**/మిర్యాలగూడ : అధికారం అడ్డు పెట్టుకొని లక్షల కోట్ల రూపాయలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కెసిఆర్, కెటిఆర్‌లు దోపిడీ దొంగలని సిఎల్పీ ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రా కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తూ లక్షన్నర కోట్ల కమీషన్లు దండుకుంటున్న కెసిఆర్, కెటిఆర్‌లకు జైలు జీవితం తప్పదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే వారి అవినీతి కుంభకోణాలపై విచారణ జరిపిస్తామన్నారు. సిఎల్‌పి నేత జానారెడ్డిని అలీబాబా 40 దొంగలని మంత్రి కెటిఆర్ పోల్చడం అధికార అహంకారానికి నిదర్శనమన్నారు. పదవులు శాశ్వతం కాదని, స్థాయిని మించి విమర్శించడమే పనిగా పెట్టుకోవడంసరికాదన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని నలుగురు ఆంధ్రా కాంట్రాక్టర్లకు కట్టబెట్టి వేల కోట్ల రూపాయలు కమీషన్ పేరిట దోచుకుంటున్నారన్నారు. సెంటిమెంట్, తండ్రి పేరు మీద గెలిచిన కెటిఆర్ కేవలం వంద ఓట్ల తేడాతోనే గెలిచిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. కెటిఆర్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా మంత్రి నాగారంలోని మూడు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న విషయం ప్రజలకు తెలుసునని, రౌడీ చరిత్ర కల్గిన శాసనసభ్యులు, మంత్రులతో కలిసి తిరగడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నల్గొండ మున్సిపల్ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య కేసును సిబిఐకి అప్పగించనున్నామని, త్వరలోనే శాసనసభ్యులు, మంత్రులు జైలుకు పోతారన్నారు. దొంగ పాస్‌పోర్టు, నకిలీ నోట్ల కేసులో ఉన్న కెసిఆర్‌ది నీచ చరిత్ర అని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, పిసిసి కార్యదర్శి ధీరావత్ స్కైలాబ్‌నాయక్, దామరచర్ల జెడ్పిటిసి కేతావత్ శంకర్‌నాయక్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిజెపిని ఎదుర్కొనేందుకు విస్తృత రాజకీయ వేదిక అవసరం: సిపిఐ



**మలప్పురం(కేరళ):** బిజెపిని తమ 'ప్రధాన శత్రువు'గా అభివర్ణించిన సిపిఐ, కాషాయ పార్టీని ఎదుర్కోవడానికి విస్తృతమైన వేదిక అవసరమని పేర్కొంది. గురువారం కేరళలో సిపిఐ రాష్ట్రస్థాయి కార్యకర్తల ప్రారంభ సమావేశానుద్దేశించి సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రసంగించారు.'కార్పొరేట్ అనుకూల బిజెపి' ప్రమాదకరమైన ఫాసిస్ట్ విధానాలను అనుసరిస్తోందన్నారు. బిజెపి నేతృత్వంలోని కూటమిని ఎదుర్కొనేందుకు రాష్ట్రస్థాయి నిర్దిష్ట ఎన్నికల వ్యూహాలు అత్యవసరమని పేర్కొన్నారు. ఎన్నికల పొత్తు కోసం విస్తృత లౌకిక వేదికే ఉండాల్సిన అవసరం లేదన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజా బాహుళ్యం కలిగిన లౌకిక, ప్రజాసామ్య శక్తులను కూడగట్టేందుకు వామపక్షాల ఐక్యతకు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వామపక్ష ఐక్యత లేకుండా దేశంలో విస్తృత లౌకిక,ప్రజాస్వామ్య వేదికను నిర్మించలేమన్నారు. తమ రాజకీయ తీర్మానాలు కేవలం ఎన్నికలకు సంబంధించినవి కావన్నారు. ఎన్నికల ఎత్తుగడలకు, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి తేడా ఉందని రెడ్డి పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో మత సహనాన్ని భంగం కలిగించేందుకు 'సంఘ్ పరివార్' ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

## లోక్‌పాల్ భేటీకి కాంగ్రెస్ దూరం

**న్యూఢిల్లీ :** లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశాన్ని బహిష్కరించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నేత మల్లిఖార్జున ఖర్గేను ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వం పిలిచింది. అయితే ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరయ్యేందుకు ఖర్గే తిరస్కరించారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఒక లేఖ రాశారు. ఇందులో లోక్‌పాల్ ఎంపికలో ప్రతిపక్షం మాటను మన్నించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని, ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలవడం వల్ల ఉపయోగం లేదని తెలిపారు. లోక్‌పాల్ ఎంపికలో జాప్యం నేపథ్యంలో కమిటీ సమావేశం గురువారం ఏర్పాటు అయింది. దేశంలో అత్యంత కీలకమైన అవినీతి నిరోధక వ్యవస్థ ఎంపికలో ప్రతిపక్షాల సూచనలను తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని ఖర్గే విమర్శించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచి కేవలం తంతు ముగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని , దీనితో తాము సమావేశానికి రావడం లేదని ఖర్గే ఈ లేఖలో తెలిపారు. ఈ పరిణామం తరువాత కాంగ్రెస్ వర్గాలు ఒక ప్రకటన వెలువరించాయి. సమావేశాన్ని తాము బహిష్కరిస్తున్నట్లు వెల్లడించాయి.

## 9న భారత్‌కు ఫ్రెంచ్ అధ్యక్షుడు

**న్యూఢిల్లీ :** ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్ ఈనెల 9 నుంచి నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ఆయనతో పాటు సతీమణి బ్రిగిట్ మారీ కూడా రానున్నరు. ఈ సందర్భంగా ఆయన రెండు దేశాలకు సంబంధించి భారత్‌తో ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక ఒప్పందాలను ఖరారు చేసుకోనున్నట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈనెల 10న ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో చర్చలు జరుపనున్నారు. మరుసటి రోజు జరిగే ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఎ) ఫౌండింగ్ కాన్ఫరెన్స్‌లో ఇరువురు పాల్గొంటారు. ఎమ్మాన్యుయేల్ మక్రాన్ 2016 జనవరిలో చివరిసారిగా భారత్‌లో పర్యటించారు. అప్పుడు ఆయన రిపబ్లిక్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## కేరళలో చర్చి ఫాదర్ దారుణ హత్య



**తిరువనంతపురం:** కేరళలో ఓ చర్చి ఫాదర్ దారుణ హత్యకు గురయ్యారు. కొచ్చి సమీపంలోని మళయట్టూరులో గురువారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూడు నెలల క్రితం తొలగింపునకు గురైన చర్చి అధికారి జానీ ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఫాదర్ జేవియర్ తెలక్కట్ (52)పై జానీ దాడి చేసి, హత్య చేశాడు. అనంతరం నిందితుడు సమీపంలోని అడవుల్లోకి పారిపోయాడు. జానీ కోసం గాలింపు ప్రారంభమైంది. బుధవారం వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగిందని పోలీసులు తెలిపారు. గురువారం ఫాదర్‌పై జానీ కత్తితో దాడి చేశాడని, కాళ్ళు, తొడలపై పొడిచాడని చెప్పారు. తీవ్ర గాయాలతో రక్తమోడుతున్న ఫాదర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వివరించారు.

## వస్త్ర వ్యాపారి కుటుంబం ఆత్మహత్య



**గాంధీనగర్ :** అప్పుల్లో కూరుకుపోయిన ఓ వ్యాపారవేత్త తన భార్య, నాలుగేళ్ల కుమారుడితో కలిసి తాము నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుజరాత్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. సర్దానా ప్రాంతానికి చెందిన వస్త్ర వ్యాపారవేత్త విజయ్ వాఘసియా(35) భార్య రేఖ(30), కొడుకు వీర్(4)లతో యోగి చౌక్‌లోని మేజిస్టిక్ అపార్ట్‌మెంట్ లో నివాసముంటున్నారు. గత కొంత కాలంగా ఆయన వ్యాపారంలో నష్టాలను చవిచూస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన అప్పులు చేశారు. అయినప్పటికీ కోలుకోకపోవటంతో వాటిని తీర్చే దారి తెలియన దారుణానికి తెగబడ్డారు. బుధవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన విజయ్ అదే అపార్ట్‌మెంట్ లో ఉంటున్న గౌరవ్ అనే స్నేహితుడితో కాసేపు మాట్లాడారు. ఆపై మంచి నీళ్లు మరిచిపోయానంటూ మళ్లీ పైకి వెళ్లిన కాసేపటికే భార్య, పిల్లలతో దూకినట్లు తెలుస్తోంది.

## రచయిత కృష్ణమూర్తి కన్నుమూత



**బెంగళూరు:** ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నాయని స్వగ్రామమైన చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. అనేక నవలలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలను ఆయన రచించారు. 1951లో జన్మించిన నాయని హైస్కూలు చదువు స్థాయి నుంచే సాహిత్యం, రచనల పట్ల ఆసక్తి చూపారు. 23 ఏళ్ల వయసులో ఆయన 'యామినీకుంతలాలు' నవల రాశారు. దానికి 1974 ఆనంద ఉగాది నవలల పోటీలో మూడో బహుమతి లభించింది. మొదటి నవలకే బహుమతి రావడంతో ఆత్మవిశ్వాసం పెరిగిన నాయని కృష్ణమూర్తి పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. కొంత కాలం బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా పనిచేశారు. మిత్రుడుతో కలిసి స్నేహబాల అనే పిల్లల పత్రికను కొంతకాలం నిర్వహించారు. 1977లో మాబడి, 1978లో పాఠశాల పత్రికలను విద్యార్థుల కోసం విజయవాణి సంస్థ ద్వారా ప్రచురించారు. నాయని కృష్ణమూర్తి వెలువరించిన విద్యా సంబంధ మేగజైన్లు విశేషణ ఆదరణ పొందాయి. పలు తెలుగు చిత్రాలకు నేపథ్య గీతాలను రచించారు. ప్రముఖ దర్శకుడు వంశీ రూపొందించిన మహర్షి చిత్రంలో కృష్ణమూర్తి రాసిన 'సుమం ప్రతి సుమం సుమం' పాట విశేష ఆదరణ పొందింది. తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు ఆయన జీవనసాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

## హోలీ వేధింపులకు నిరసన

**న్యూఢిల్లీ:** హోలీ పేరుతో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థిని పట్ల కొందరు వికృత చేష్టలకు పాల్పడ్డ ఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటనను 40 మంది విద్యార్థినుల బృందం 'పింజ్రాతోడ్ ఖండించింది. వీర్యం నింపిన బెలూన్లతో విద్యార్థినులపై విసరడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం నగరంలోని విజయ్‌నగర్ నుంచి హడ్సన్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. వర్సిటీ విద్యార్థినులు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రతి ఏటా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని దేవాంగన అనే విద్యార్థిని తెలిపారు. అసలు హోలీ పండుగ వెనుక ఉన్న ఆంతర్యాన్ని ఆమె ప్రశ్నించారు. 'హోలిక' అనే మహిళను సజీవంగా దహనం చేయడాన్ని ఉత్సవంగా జరుపుతున్నారన్నారు. ఇలాంటి పండుగల సమయంలో తమను హాస్టళ్లకే పరిమితం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నైతిక పోలీసింగ్, తమకు భద్రత పేరుతో వీధి వ్యాపారులను ఖాళీ చేయించడాన్ని వారు వ్యతిరేకించారు.

# కష్టాల్లో కార్తీ



- ఐఎన్ఎక్స్ కేసులో ఐదురోజుల సిబిఐ కస్టడీ
- విదేశీ బ్యాంక్ అకౌంట్లు మూసేశారు
- దిగ్భ్రాంతి కలిగించే సాక్ష్యాలున్నాయి : సిబిఐ
- సమన్లు లేకుండానే అరెస్టా? : అభిషేక్ సింఘ్వీ



**న్యూఢిల్లీ :** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టు అయిన కార్తీ చిదంబరానికి ఐదు రోజుల సిబిఐ కస్టడీ విధించారు. స్థానిక ఢిల్లీ కోర్టు గురువారం కార్తీ కస్టడీకి అంగీకరించింది. కార్తీ చిదంబరం విదేశాలకు వెళ్లిన దశలో అక్కడి తన విదేశీ బ్యాంకు ఖాతాలను మూసివేశాడనే ఆధారాలు ఉన్నాయని సిబిఐ తెలిపింది. దీనితో ప్రత్యేక న్యాయమూర్తి సునీల్ రాణా కార్తీ కస్టడీని ఈ నెల 6 వరకూ పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువరించారు. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు అయిన కార్తీని లండన్ నుంచి తిరిగి రాగానే సిబిఐ చెన్నైలో అదుపులోకి తీసుకుంది. తరువాత ఢిల్లీకి తరలించింది. అక్కడ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపర్చింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి పొందిన కార్తీ తనకు అందిన ముడుపుల వ్యవహారాలు వెలుగులోకి రాకుండా చూశారని సిబిఐ ఆరోపించింది. వీటికి సంబంధించి తమ వద్ద దిగ్భ్రాంతి కల్గించే సాక్ష్యాధారాలు ఉన్నాయని తెలిపింది. న్యాయవాదులైన తల్లిదండ్రులు చిదంబరం, నళిని చిదంరం కార్తీని ఇక్కడ కలుసుకుని కొద్ది సేపు మాట్లాడిన తరువాత సిబిఐ వారు కస్టడీలోకి తీసుకున్నారు. కార్తీ అరెస్టు అంశంపై కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేసింది. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, దీనిని అడ్డుకోవాలని ముందుగానే చిదంబరం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఇది ఇంకా విచారణకు రావల్సి ఉంది. సిబిఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదన విన్పించారు. ఈ కేసులో రాజకీయ కక్ష సాధింపు ఏమీ లేదని, దర్యాప్తు అంతా కూడారాజ్యాంగంలోని నిబంధనల మేరకు, చట్ట ప్రకారం సాగుతోందని తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు తరువాత గత రాత్రి ఆయనకు హృద్రోగ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆయనను సిబిఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. కార్తీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో కూడిన బృందం వాదిస్తోంది. గత ఏడాది దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి గత ఏడాది ఆగస్టులోనే సిబిఐ కార్తీ పట్ల దురుసుగా వ్యవహరించిందని, ఏకంగా 22 గంటల పాటు అసంబద్ధ రీతిలో విచారించిందని, ఆ తరువాత ఏ విధమైన సమన్లు జారీ చేయలేదని ఇప్పుడు అరెస్టు జరిగిందని న్యాయవాదులు తెలిపారు. క్లయింట్ సహకరించడం లేదనడానికి ఆధారాలు లేవని, సమన్లు జారీ చేయకుండానే అరెస్టు చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.క్లయింట్ ఎప్పటికప్పుడు చట్టానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నట్లు ఇక సిబిఐ అరెస్టు ఏ క్రమంలో జరిగిందో తెలియడం లేదని వాదించారు.

### పిఎన్‌బి శ్కాంలో 'గీతాంజలి'
## ఆస్తులు జప్తు

**ముంబై / న్యూఢిల్లీ :** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) కుంభకోణానికి సంబంధించి కేసులో గీతాంజలి జెమ్స్, ప్రమోటర్ మెహుల్ చోక్సీలకు చెందిన రూ.1200 కోట్ల విలువైన 41 ఆస్తులను జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలియజేసింది. దీంతో పాటు ముంబైలోని పిఎన్‌బి జోనల్ కార్యాలయంలో ఆ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సిఇఓలను గురువారం విచారించినట్టు పేర్కొంది. కాగా, ఈ వారారంభంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవి బ్రహ్మాజీరావును కూడా విచారించినట్టు తెలిపింది. గురువారం జప్తు చేసినఆస్తుల్లో 15 ఫ్లాట్‌లు, ముంబైలోని 17 కార్యాలయ ప్రాంగణాలు, కోల్‌కతాలో ఒక మాల్, ఆలీబాగ్‌లో నాలుగు ఎకరాల ఫామ్‌హౌస్, తమిళనాడులోని నాసిక్, నాగ్‌పూర్, పన్వేల్, విల్లుపురంలలో 231 ఎకరాల భూములున్నాయని ఇడి తెలియజేసింది. దీంతో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలో 170 ఎకరాల పార్కును కూడా జప్తు చేసినట్టు తెలిపింది. మహారాష్ట్రలోని బొరివలి (తూర్పు)లో నాలుగు ఫ్లాట్‌లు, శాంతాక్రుజ్ (తూర్పు)లోని ఖేని టవర్‌లో ఇతరులు 9 మందికి చెందిన ఆస్తులను కూడా జప్తు చేశామన్నారు.






గురువారంనాడు దేశవ్యాప్తంగా హోలీ సంబురాలు మిన్నంటాయి. కోల్‌కతాలోని ఓ వీధిలో వేడుకల్లో మునిగిపోయిన మహిళలు

## త్రిపుర ఫలితంపై ఉత్కంఠ

- ఎవరి అంచనాలు వారివే
- రేపే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

**అగర్తల :** త్రిపుర ఎన్నికల్లో వెలువడే ఫలితాల కోసం రాజకీయ పార్టీలు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల అనంతరం పలు సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ నిర్దిష్టమైన ఫలితాలను అంచనా వేయలేకపోవడంతో పార్టీల్లో ఆందోళన ప్రారంభమైంది. గెలుపోటములు, శాసనసభ నియోజకవర్గాల వారీగా వచ్చే ఓట్లు, సీట్లపై ఎవరి అంచనాల్లో వారు మునిగిపోయారు. త్రిపురలో మొత్తం 60 స్థానాలకు గాను 59 సీట్లకు ఫిబ్రవరి 18న ఎన్నికల జరిగాయి. ఫలితాలు మార్చి 3న వెలువడనున్నాయి. సిపిఐ(ఎం) అభ్యర్థి మృతి చెందడంతో ఓ స్థానంలో పోలింగ్ మార్చి 12కు వాయిదా పడింది. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష ఫ్రంట్‌కు నూకలు చెల్లాయని, బిజెపి భాగస్వామ్య పక్షాలు విజయం సాధించబోతున్నాయని జాతీయ టివి చానెల్ 'న్యూస్ ఎక్స్' ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేసింది. మరో వైపు ఈ ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్టు పోటీ నెలకొందని, సిపిఐ(ఎం), వామపక్ష పార్టీలు 44.3 శాతం ఓట్లతో 26–34 సీట్లను గెల్చుకునే అవకాశాలున్నాయని ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ ఓటింగ్ ఒపీనియన్ అండ్ ట్రెండ్స్ ఇన్ ఎలక్షన్ రీసెర్చి (సిఓట్) ఏజెన్సీ పేర్కొంది. బిజెపి భాగస్వామ్య పక్షాలు 42.8 శాతం ఓట్లతో 24–32 స్థానాల్లో విజయం సాధిస్తుందని అం చనా వేసింది. అలాగే కాంగ్రెస్ పార్టీ కేవలం 7.2 శాతం ఓట్లతో రెండు స్థానాలను గెల్చుకుంటుందని పేర్కొంది. కాగా, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సిపిఐ(ఎం) అధికార ప్రతినిధి గౌతం దాస్ మాట్లాడుతూ అవన్నీ ఊహాగానాలే అని కొట్టిపారేశారు. మార్చి 3న ఫలితాలు వెలువడిన తర్వాతే పార్టీ ప్రతిస్పందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### ఉగ్రవాదంపై పోరు
# ఏ మతానికి వ్యతిరేకం కాదు

- ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కంప్యూటర్ కలిగివున్నప్పుడు పరిపూర్ణ అభివృద్ధి
- జోర్డాన్ రాజు అబ్దుల్లాతో కలిసి సదస్సులో మోడీ




**న్యూఢిల్లీ :** ఉగ్రవాదం, సమాజాన్ని తప్పుదోవ పట్టించేవారిపై పోరాటమంటే అది ఏ మతానికి వ్యతిరేకం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. దురదృష్టవశాత్తూ ఇది అమాయకులపై యువత దాడులకు దిగేలా దారి తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం యువత ఒక చేతిలో ఖురాన్‌ను, మరో చేతిలో కంప్యూటర్‌ను కలిగివున్నప్పుడే పరి పూర్ణమైన సంక్షేమం,అభివృద్ధి సాధ్యపడుతుందని ఆయన అన్నారు. 'ఇస్లామిక్ వారసత్వం; అవగాహన, సంయమనాల ప్రోత్సాహం' అనే అంశంపై గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 కూడా ఈ సమావేశంలో ప్రసంగించారు. మతం పేరుతో మానవాళిపై దాడి చేసేవారు, తమ దాడుల వల్ల అతి పెద్ద బాధితురాలు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న మతమేనని అర్థం చేసుకోవడం లేదన్నారు. ప్రపంచంలోని అన్ని మతాలకు భారతదేశం ఊయల వంటిదని అభివర్ణించారు. శాంతి అనేది భారతదేశ ఆత్మలోనే ఉందని తెలిపారు. యువతను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అమాయకులపై హింసకు పాల్పడుతున్నారన్నారు. మనమంతా కలిసి ఉగ్రవాదంతో పోరాడవచ్చునని పేర్కొన్నారు. రాజు అబ్దుల్లా –2 మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరాడటమంటే ముస్లింలకు వ్యతిరేకంగానో, మరో మతంపైనో పోరాటం కాదని తెలిపారు. ఇది విద్వేషంపై పోరాటమని స్పష్టం చేశారు. విద్వేష సిద్ధాంతాలు దైవమనే భావాన్నే విధ్వంసం చేస్తాయని ఆయన చెప్పారు. మతమంటే మానవాళిని కలిపి ఉంచేదని అందరూ భావిస్తారని అన్నారు. అవసరంలో ఉన్నవారికి సహాయపడవలసిన కర్తవ్యం ప్రతి ముస్లింకు ఉందన్నారు. అనంతరం 'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' ఉర్దూ అనువాద పుస్తకాన్ని జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 మోడీ అందజేశారు.

**ద్వైపాక్షిక చర్చలు –12 ఒప్పందాలు :** జోర్డాన్ రాజు అబ్దుల్లా–2తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా ఆ దేశంలో 12 ఒప్పందాలను కుదుర్చుకున్నారు. రక్షణ, సీమాంతర ఉగ్రవాద నిరోధం వంటి అంశాలపై సహకారాల కోసం ఈ ఒప్పందాలు చేసుకున్నట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. దౌత్యం కోసం వీసా మినహాయింపు తదితరాలపై కూడా సంతకాలు జరిగినట్టు వెల్లడించారు.


## అహంకారమే బిజెపిని ఓడించింది



న్యూఢిల్లీ : అహంకారం, లోపపూరితమైన పాలన కారణంగానే మధ్యప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి రెండు స్థానాలనూ కోల్పోయిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ముంగోలి, కోలరస్ స్థానాలను తిరిగి గెల్చుకుంది. వచ్చే ఏడాది ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల జరుగనున్నాయి. 'ఇది అహంకారం, లోపపూరితమైన పాలనకు జరిగిన నష్టం, విజయం ఆశలు' అని గురువారం రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. 'మొదట రాజస్థాన్ ఇప్పుడు మధ్యప్రదేశ్ మార్పు అనేది తలుపు కొడుతోంది' అని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో అజ్మీర్, అల్వార్‌లో సాధించిన విజయాలు ఈ రెండు రాష్ట్రాల్లో జరుగబోయే ఎన్నికలకు శుభసూచికమని అన్నారు. కోరలస్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్రసింగ్ బిజెపి అభ్యర్థి దేవేంద్ర జైన్‌ను 8,086 ఓట్లతో ఓడించారు. 2013లో కాంగ్రెస్‌కు 82, 523 ఓట్లు పడగా, బిజెపికి 74,437 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ ఈ స్థానా న్ని 24,953 ఓట్ల మెజార్టీతో కైవసం చేసుకోవడం గమనార్హం.

**అమ్మమ్మను ఆశ్చర్యపరుస్తా :** అమ్మమ్మకు ఆశ్చర్యానుభూతిని కల్పించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటలీకి వెళ్తున్నారు. అమ్మమ్మను కలుసుకోవడంతో పాటు, హోలీ వారాంతాన్ని ఆమెతో గడిపేందుకు తాను ఇటలీకి బయలుదేరి వెళ్తున్నట్టు గురువారం నాడు రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పౌరులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. 'మా అమ్మమ్మ వయస్సు ఇప్పుడు 93 సంవత్సరాలు. ఆమెది ఎంతో దయతో కూడిన హృదయం. ఈ హోలీ వారాంతంలో ఆమెకు ఆశ్చర్యానుభూతిని కల్పించబోతున్నాను. ఆమెను కౌలిగించుకోవాలన్న ఆతృతతో ఉన్నాను' అని రాహుల్ పేర్కొన్నారు.

### కర్నాటకలో కాంగ్రెస్
## స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు



**న్యూఢిల్లీ :** కర్నాటకలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ ముఖ్యుడుగా వ్యవహరించనున్నారు. గురువారం పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ దానికి ముఖ్యుడుగా మిస్త్రీ వ్యవహరించేందుకు ఆమోదం తెలిపారు. కమిటీలో సభ్యులుగా పార్టీ ఎంపిలు టమ్రాధ్వాజ్ సాహు, గౌరవ్ గొగోయ్‌లు ఉండగా, పార్టీ జనరల్ సెక్రెటరీ కర్నాటక ఇన్‌చార్జ్ కెసి వేణుగోపాల్, రాష్ట్ర శాఖ చీఫ్ జి. పరమేశ్వరలు ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరించనున్నారు. పెద్ద రాష్ట్రమైన కర్నాటకలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్నందున కాంగ్రెస్ పార్టీకి త్వరలో కర్నాటకలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు కీలకం కానున్నాయి. ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు ఇటీవల జెడిఎస్, బిఎస్‌పిలు పొత్తు ఒప్పందం కుదుర్చుకోగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బరిలోకి వెళ్లనుంది. ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నాటకలో రెండు సార్లు పర్యటించారు. అయితే ఏప్రిల్–మేలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది.

# జయేంద్ర సరస్వతి మహాసమాధి



**కాంచీపురం:** కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి గురువారం మహాసమాధి పొందారు. అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూసిన జయేంద్ర సరస్వతి (82 ) అంత్యక్రియలు ఇక్కడి మఠం ఆవరణలోని బృందావనంలో వేదోచ్ఛారణల నేపథ్యంలో సాగాయి. బృందావనంలో ఆయన మహాసమాధి ప్రక్రియ మఠం నిర్వాహకులు, భక్తులు సామాన్య జనం అశ్రునయనాల నడుమ ఈ మహాసమాధి అధిష్ఠానం కార్యక్రమం ముగిసింది. ఉదయం 10. 30 గంటలకు మఠం ఆచార వ్యవహారాల మేరకు ఈ క్రతువు ముగిసింది . ఎందరో వేద పండితులు, సినీ రాజకీయ ప్రముఖులు కూడా కార్యక్రమానికి తరలివచ్చారు. ఆవరణలోని 7 అడుగుల వెడల్పు 7 అడుగుల పొడవు ఉన్న సమాధిలో స్వామి పార్థివదేహం వెదురుబొంగుల బుట్టలో కూర్చున్న స్థితిలో ఉండగా ప్రవేశపెట్టారు. ఈ సమాధిలో పలు వన మూలికలను, చందనాన్ని ఉంచారు. ఇసుకతో నింపారు. ఉదయం నుంచే మఠంలో కీర్తనలు విన్పించారు. మహానుభావ మళ్లీ రావా అనే పిలుపుల నడుమ రెండు మూడు గంటల పాటు అంతిమ క్రియల తరువాత జరిగిన మహాసమాధి ప్రకటన అనంతరం మఠంలో సాంప్రదాయక రీతిలో మహా హారతి కార్యక్రమం జరిగింది. ఇందులో తమిళనాడు గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్ ఇతరులు పాల్గొన్నారు. స్వామి పార్థివదేహానికి అభిషేకం నిర్వహిచారు. తెల్లవారు జామునుంచే మఠం వేద మంత్రాల ఉచ్ఛారణతో మార్మోగింది. భక్తులు తమ ఆరాధ్య గురువుకు వీడ్కోలు పలికే సన్నివేశంతో ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. కొత్తగా పీఠాధిపతి బాధ్యతలు చేపట్టిన విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో మహాసమాధి తంతు సాగింది. జయేంద్ర సరస్వతి నిర్యాణానికి నివాళిగా ప్రధాని కార్యాలయం నుంచి పంపించిన పుష్పగుచ్ఛాలను అక్కడ ఉంచారు. జయేంద్ర పూర్వపు మఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి సమాధి పక్కనే జయేంద్ర సరస్వతి అంతిమ మజిలీ నెలకొంది. బుధవారం ఉదయం నుంచి జయేంద్ర భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనకు మఠంలో ఉంచిన అక్కడి నుంచి తరలించారు.

**జయేంద్ర బోధనలు ఆచరించండి : విజయేంద్ర**



ప్రజలు ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, శంకరాచార్య జయేంద్ర సరస్వతి బోధనలను పాటించాలని విజయేంద్ర సరస్వతి పిలుపునిచ్చా రు. నిర్యాణం చెందిన కంచి పీఠాధిపతి జయేంద్ర స్థానంలో ఇప్పుడు విజయేంద్ర బాధ్యతలు తీసుకున్నారు. జయేంద్ర ప్రవచనాలు తమ కు మార్గదర్శకాలు అని ,ఆయన భౌతికంగా వెళ్లిపోయినా ఆయన బోధనలు చిరస్మరణీయంగా ఉం టాయన్నారు. ప్రజలు వీటిని అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. సకల జనుల సంక్షేమం జయేంద్ర ఆలోచన విధానం అని, వివక్షత లేకుం డా అందరిని సమానంగా చూశారని శ్లాఘించారు.



## రెనాల్ట్ డస్టర్‌పై లక్ష రూపాయల తగ్గింపు

**న్యూఢిల్లీ:** రెనాల్ట్ కంపెనీ డస్టర్ వాహన మోడల్ ధరలను భారీగా తగ్గించింది. రూ.లక్ష వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నామని ప్రకటించింది. ఇంతకుముందు రూ.8.95 లక్షలు ఉన్న కారు ధర ఇప్పుడు ఒక లక్ష రూపాయలు తగ్గనుందన్న మాట.. ఇప్పుడు ఈ మోడల్ ప్రారంభ ధర రూ. 7.95లక్షలు రానుంది. రెనాల్ట్ అత్యధికంగా విక్రయిస్తున్న మోడల్స్‌లో డస్టర్ ఒకటి. వేరియంట్‌ను బట్టి డిస్కౌంట్ ఉంటుందని రెనాల్ట్ తెలిపింది. టాప్‌ఎండ్ అయిన ఆర్‌ఎక్స్‌జెడ్ ఎడబ్ల్యుడి డీజిల్ మోడల్‌పై రూ.లక్ష తగ్గించారు. పెట్రోల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.7.95లక్షలు, డీజిల్ వేరియంట్ ధర రూ.8.95లక్షలుగా ఉంది. డస్టర్‌లో చాలా భాగాలను స్థానికంగా తయారు చేయడంతో ధర తగ్గిందని, ఆ లాభాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నామని కంపెనీ వెల్లడించింది. ఇదే బాటలో ఇతర కార్ల కంపెనీలు కూడా తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇంత మొత్తంలో ఒకేసారి లక్ష రూపాయల తగ్గింపు ఉండకపోయినా.. అంతకు దగ్గరలో డిస్కౌంట్లను అందించవచ్చని విశ్లేషకులు అంటున్నారు. కాగా కారు విక్రయాల్లో మారుతీ సుజుకీ మంచివృద్ధిని సాధించింది.

# పిఎన్‌బి మోసం

## సిఎలకు ఐసిఎఐ సందేశం




**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి)లో వేల కోట్ల మోసం నేపథ్యంలో ఐసిఎఐ అధ్యక్షుడు నవీన్ ఎన్‌డి గుప్తా సిఎ(చార్టర్డ్ అకౌంటెంట్స్) పాత్రపై ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలలో ఐసిఎఐ( ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) బాధ్యతలు చేపట్టిన గుప్తా ఆడిటింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, సిఎలపై నమ్మకం పోకుండా చూసుకోవాలని హెచ్చరించారు. చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తి ఎంతో నైతికతతో కూడినదని, దానికి కట్టుబడి ఉండాలని సూచించారు. కాగా భారీ మొత్తంలో రుణాలను ఎగవేసిన వారి వివరాలను అందజేయాలని ఐసిఎఐ ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకులను కోరింది. పిఎస్‌యు బ్యాంకుల నుంచి రూ.2,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి జాబితా ఇవ్వాలని సూచించింది. చార్టర్డ్ అకౌంటెంట్స్ చట్టంలోని సెక్షన్ 21సి కింద తమ ముందు హాజరై పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించిన వివరాలివ్వాలని తెలిపింది. అలాగే మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ, సిబిఐ, ఇడిలు తమ దర్యాప్తు వివరాలను ఐసిఎఐతో పంచుకోవాలని ఆదేశించాలంటూ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖకు లేఖ రాసినట్టు పేర్కొంది. పిఎన్‌బి(పంజాబ్ నేషనల్ బ్యాంక్), గీతాంజలి జెమ్స్ ఆడిటర్లకు ఐసిఎఐ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పిఎన్‌బి డిప్యూటీ డైరెక్టర్‌కు సమన్లు పంపింది. అయితే రూ.2,000 కోట్లకు పైగా రుణాలు తీసుకున్న వారి జాబితాను ఐసిఎఐకి చెందిన ఫైనాన్షియల్ రిపోర్టింగ్ రివ్యూ బోర్డు పరిశీలించనుంది.

## స్టాక్ మార్కెట్

| ఈరోజు మార్కెట్ | ముగింపు | మార్పు | % |
|---|---|---|---|
| సెన్సెక్స్ | 34046.94 | −137.10 | −0.40% |
| నిఫ్టీ | 10458.35 | −34.50 | −0.33% |

**CLOSING SENSEX REPORT**




## కరెన్సీ మారక రేట్లు

| | |
|---|---|
| అమెరికన్ డాలర్ | 63.28 |
| యూరో | 76.12 |
| బ్రిటిష్ పౌండ్ | 85.87 |
| ఆస్ట్రేలియన్ డాలర్ | 49.75 |
| కెనెడియన్ డాలర్ | 50.98 |
| ఎమిరైట్ దిర్హామ్ | 17.23 |
| స్విస్ ఫ్రాంక్ | 64.89 |
| చైనీస్ యువాన్ | 9.75 |
| మలేషియన్ రింగిట్ | 15.83 |
| న్యూజిలాండ్ డాలర్ | 45.36 |
| హాంగ్‌కాంగ్ డాలర్ | 8.09 |
| జపనీస్ యెన్ | 0.56 |
| కువైట్ దినార్ | 209.96 |
| సౌతాఫ్రికన్ రాండ్ | 5.14 |

## బులియన్




### బంగారం ధర

| నగరం | ధర (రూ / 10 గ్రాములు) | | |
|---|---|---|---|
| | 22 క్యారట్ | 24 క్యారట్ | మార్పు(%) |
| చెన్నై | 28930 | 30941.18 | −0.52% |
| ముంబై | 29810 | 31882.35 | −0.7% |
| ఢిల్లీ | 29650 | 31711.23 | 0% |
| కోల్‌కతా | 29930 | 32010.70 | −0.86% |
| కేరళ | 28150 | 30106.95 | 0% |
| బెంగళూరు | 28500 | 30481.28 | 0% |
| హైదరాబాద్ | 28980 | 30994.65 | −0.1% |
| గల్ఫ్ | 1393.62 | 1490.50 | −0.63% |

### వెండి ధర (రూ./ కిలో)

| నగరం | మంగళవారం | సోమవారం | మార్పు (%) |
|---|---|---|---|
| చెన్నై | 41700.00 | 41600.00 | 0.24 |
| ముంబై | 41700.00 | 41600.00 | 0.24 |
| ఢిల్లీ | 41700.00 | 41600.00 | 0.24 |
| కోల్‌కతా | 41700.00 | 41600.00 | 0.24 |
| హైదరాబాద్ | 41700.00 | 41600.00 | 0.24 |



### కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 355 | విశాఖపట్నం | 350 |
| వరంగల్ | 357 | చిత్తూరు | 388 |
| విజయవాడ | 348 | చెన్నై | 395 |
| గోదావరి | 348 | బెంగళూరు | 385 |

# రుణాల వడ్డీరేట్లు పెంపు

## 7.95 శాతం నుంచి 8.15 శాతం కానుంది: ఎస్‌బిఐ ప్రకటన




**న్యూఢిల్లీ:** క్రితం రోజు డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచిన ప్రభుత్వరంగ అతిపెద్ద ఎస్‌బిఐ(బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) తాజాగా రుణాలపై వడ్డీరేట్లను పెంచింది. డిపాజిట్ రేట్లను పెంచడంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది. రుణాలపై వడ్డీ రేటు 0.20 శాతం పెంపుతో 8.15 శాతానికి చేరనుంది. ఈ వడ్డీ రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని ఎస్‌బిఐ ప్రకటించింది. 2016 ఏప్రిల్ తర్వాత ఎస్‌బిఐ రుణాలపై వడ్డీరేట్లను పెంచడం ఇదే తొలిసారి. ప్రస్తుతం బ్యాంకు నిధుల వ్యయం ఆధారంగా రుణ రేట్లను నిర్ణయిస్తోంది. అంటే బ్యాంకు నిధులు సమీకరించే వ్యయం(డిపాజిట్ రేట్లు) ఏ మాత్రం పెరిగినా.. ఆ ప్రభావం రుణరేట్లపై కూడా పడుతుంది. బుధవారం డిపాజిట్ రేట్లను పెంచడంతో తాజాగా రుణ రేట్లను కూడా పెంచింది. ప్రస్తుతం ఉన్న నిధుల వ్యయ ఆధారిత రుణరేటు(ఎంసిఎల్ఆర్) 7.95 శాతం ఉండగా.. 8.15 శాతానికి పెరగనుందని ఈ మేరకు బ్యాంక్ నుంచి నోటిఫికేషన్ వెలువడింది. కాగా బుధవారం డిపాజిట్లపై పెంచిన రేట్లు.. నాలుగు మెచ్యూరిటీ విధానాల్లో.. 7 రోజుల నుంచి 45 రోజుల వరకు, రెండేళ్ల నుంచి మూడేళ్ల లోపు, మూడేళ్ల నుంచి 5 ఏళ్ల లోపు, ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు వాటికి 50 బేసిస్ పాయింట్లు పెరిగింది. 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై వడ్డీరేటు 5.25 శాతం నుంచి 5.75 శాతానికి పెరిగింది. వార్షిక వడ్డీ రేటు 6.40 శాతానికి పెరగ్గా.. ఇప్పటివరకు ఇది 6.25 శాతంగానే ఉంది. అలాగే 2 నుంచి 10 సంవత్సరాల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీని అందించనుండగా.. ఇప్పటివరకూ ఇది 6 శాతంగానే ఉంది. అలాగే కోటి రూపాయలకు పైన డిపాజిట్లపై కూడా ఈ పెంపు వర్తిస్తుంది. సీనియర్ పౌరుల డిపాజిట్ల వడ్డీ రేట్లు 7 శాతం కానుండగా.. అంతకు ముందు 6.50 శాతంగానే ఉన్నాయి.

### ఎస్‌బిఐ, పిఎన్‌బి బాటలోనే ఐసిఐసిఐ బ్యాంక్




ఎస్‌బిఐతో పాటు మరో ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) కూడా రుణ రేట్లను పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న 8.15 శాతం నుంచి 8.30 శాతానికి పెంచుతున్నట్లు పిఎన్‌బి పేర్కొంది. పెంచిన రుణరేట్లు మార్చి 1వ తేదీ నుంచే అమల్లోకి రానున్నాయి. ఎస్‌బిఐ, పిఎన్‌బి బాటలోనే ప్రైవేటు బ్యాంక్ దిగ్గజం ఐసిఐసిఐ బ్యాంక్ కూడా రుణ రేట్లను పెంచింది. నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు(ఎంసిఎల్ఆర్) 15 బేసిస్ పాయింట్లు(0.15 శాతం) పెంచింది. అంటే 7.8 శాతం ఉన్న రుణరేటు ఇప్పుడు 7.95 శాతానికి పెరగనుంది.

# మారుతీ సేల్స్ 15 శాతం వృద్ధి




- ఫిబ్రవరిలో 1,49,824 యూనిట్ల విక్రయాలు
- ఎగుమతులు 25 శాతం పెరిగాయి

**న్యూఢిల్లీ:** ఫిబ్రవరిలో దేశీయ అతిపెద్ద కారు తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా అమ్మకాలు 15 శాతం వృద్ధిని సాధించాయి. గత నెలలో 1,49,824 యూనిట్ల విక్రయాలు చేపట్టగా.. గత ఏడాది ఇదే నెలలో సేల్స్ 1,30,280 యూనిట్లుగానే ఉన్నాయి. దేశీయంగా కంపెనీ అమ్మకాలు 1,37,900 యూనిట్లతో 14.2 శాతం జంప్ చేయగా.. 2017 ఫిబ్రవరిలో 1,20,735 యూనిట్లుగానే ఉన్నాయి. ఆల్టో, వాగనర్ మోడల్ కార్ల అమ్మకాలు 33,789 యూనిట్లతో 2.1 శాతం పెరిగాయి. కాంపాక్ట్ సెగ్మెంట్‌లో స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనొ వంటి కార్ల అమ్మకాలు 65,213 యూనిట్లతో 38.7 శాతం వృద్ధిని సాధించాయని కార్ల తయారీ దిగ్గజం ప్రకటించింది. గతేడాది ఇదే సెగ్మెంట్‌లో అమ్మకాలు 47,002 యూనిట్లుగా మాత్రమే ఉన్నాయి. మధ్యస్థాయి సెడాన్ సియాజ్ 4,897 యూనిట్లతో 16.8 శాతం క్షీణించాయి. ఇంకా ఫిబ్రవరి నెలలో జిప్సీ, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎస్–క్రాస్, కాంపాక్ట్ ఎస్‌యువి విటారా బ్రెజ్జా సహా యుటిలిటీ వాహనాల అమ్మకాలు 20,324 యూనిట్లతో 13.8 శాతం పెరిగాయి.

2017లో ఈ నెలలో ఈ సెగ్మెంట్‌లో అమ్మకాలు 17,863 యూనిట్లుగా మాత్రమే ఉన్నాయి. ఓమ్ని, ఈకో అమ్మకాలు 12.5 పడిపోయాయి. 14,195 యూనిట్ల నుంచి 12,425 యూనిట్లకు తగ్గాయి. ఫిబ్రవరిలో ఎగుమతులు 9,545 యూనిట్లతో పోలిస్తే 11,924 యూనిట్లు పెరిగి 24.9 శాతం వృద్ధి సాధించాయని మారుతీ సుజుకీ వెల్లడించింది.

# కేంద్ర ఉద్యోగుల కోసం ఆన్‌లైన్ జిపిఎఫ్

## ప్రారంభోత్సవం చేసిన జైట్లీ




**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం జిపిఎఫ్(జనరల్ ప్రావిడెంట్ ఫండ్) ఆన్‌లైన్ మోడ్యూల్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రారంభోత్సవం చేశారు. దీని ద్వారా ప్రావిడెంట్ ఫండ్ నుంచి ముందస్తు ఉపసంహరణల ప్రక్రియం సులభతరం కానుంది. 42వ సివిల్ అకౌంట్స్ డే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఈ జిపిఎఫ్‌ను ప్రారంభించారు. జిపిఎఫ్ మోడ్యూల్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్ నెరవేరనుంది. యూనిక్ ఎంప్లాయ్ ఐడితో జిపిఎఫ్ ఖాతాల మ్యాపింగ్ కోసం దీనిని తీసుకురాగా.. జిపిఎఫ్ అడ్వాన్స్‌ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల సౌకర్యం కల్పించనున్నారు. ఉద్యోగులకు చెందిన ప్రస్తుత జిపిఎఫ్ బ్యాలెన్స్‌ను ఆన్‌లైన్ ప్రక్రియతో ఉపసంహరించవచ్చని ప్రభుత్వ అధికారి తెలిపారు. ఇదే కార్యక్రమంలో పిఎఫ్ఎంఎస్ ఇ–పిపిఒ మోడ్యూల్‌ను కూడా జైట్లీ ప్రారంభించారు. కాగా అనేక సంస్కరణలు, సానుకూల అంతర్జాతీయ వాతావరణం నేపథ్యంలో భారత్ ఆర్థిక వృద్ధి రేటు 7 నుంచి 8 శాతం సాధించే సామర్థ్యం ఉందని ఇటీవల భారత్– కొరియా బిజినెస్ సదస్సులో అన్నారు. వచ్చే 10 నుంచి 20 సంవత్సరాల్లో భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని తెలిపారు.

# నీరవ్ కంపెనీకి అమెరికాలో డిమాండ్




**న్యూఢిల్లీ:** డైమండ్ వ్యాపారి నీరవ్ మోడీకి చెందిన జువెలరీ కంపెనీని కొనుగోలు చేసేందుకు అమెరికాలో అత్యంత ఆసక్తి చూపిస్తున్నారు. రూ.12,700 కోట్ల కుంభకోణం కేసులో నిందితుడైన నీరవ్ ఇటీవల అమెరికాలో తన కంపెనీకి దివాలా పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఆ కంపెనీని కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారని సమాచారం. అమెరికాలోని ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ ఫిబ్రవరి 26న దివాలా పిటిషన్ దాఖలు చేసింది. భారత్‌లో వేల కోట్లకు పైగా మోసం చేశారని ఆరోపణలు వచ్చిన అనంతరం నీరవ్ అమెరికాలోని తన ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీపై దివాలా పిటిషన్ వేశారు. భారత్‌లో ఫిబ్రవరి 14న ఈ మోసం వెలుగు చూడగా, అమెరికాలో ఫిబ్రవరి 26న నీరవ్ దివాలా పిటిషన్ వేశారు. అమెరికాలోని ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీని కొనేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారని కోర్టు ఫైలింగ్స్‌లో తెలిపారు. నీరవ్, ఛోక్సీల మోసం నేపథ్యంలో భారత్‌లో సిబిఐ, ఇడి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారికి సంబంధించిన ఆస్తులను జప్తు చేస్తున్నారు.

# స్వల్పంగా తగ్గిన పసిడి ధర



**న్యూఢిల్లీ:** బంగారం ధర గురువారం స్వల్పంగా తగ్గింది. అంతర్జాతీయంగా డిమాండ్ క్షీణించడం, దేశీయంగా నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు తగ్గడం వంటి కారణాలతో ధరలకు కళ్లెం పడింది. నాలుగు సెషన్లలో పెరుగుతూ వచ్చిన పసిడి ధర బుధవారం ఒక్క రోజే రూ.460 తగ్గింది. గురువారం కూడా బంగారం స్వల్పంగా దిగొచ్చింది. మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి రూ.30 తగ్గి రూ. 31,360గా ఉంది. అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండి ధర రూ.90 తగ్గి రూ.39,210కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధర 0.30 శాతం మేర పడిపోయింది. ఔన్సు బంగారం 1,313.80 డాలర్లకు చేరింది. అటు ఔన్సు వెండి కూడా 0.34శాతం తగ్గి 16.33 డాలర్లు అయింది.

# స్వల్పంగా నష్టపోయిన ఈక్విటీ మార్కెట్లు

## వరుసగా మూడు రోజుల సెలవులకు ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత



**ముంబై:** వరుసగా మూడో ఈక్విటీ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. బ్యాంకింగ్ రంగ షేర్ల అమ్మకాల ఒత్తిడి, అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూలత సంకేతాలు లేకపోవడం వంటివి పతనానికి కారణమయ్యాయి. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 137.10 పాయింట్లు కోల్పోయి 34,046.94 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 34.50 పాయింట్లు నష్టపోయి 10,458.35 వద్ద స్థిరపడింది. ఈనెల 2న శుక్రవారం హోళి.. ఆ తర్వాత శని, ఆదివారాలు కావడంతో మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్ 34,015 నుంచి 34279 పాయింట్ల మధ్య శ్రేణిలో కదలాడింది. బ్యాంక్ నిఫ్టీ 205 పాయింట్లు అంటే 0.82 శాతం నష్టపోయి 24,903 పాయింట్ల వద్ద ముగిసింది. అన్ని రంగాలకు చెందిన సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. అమెరికా స్టాక్ మార్కెట్ నష్టాల ముగింపు దేశీ మార్కెట్లను ప్రభావితం చేసింది. అయితే జిడిపి 7.2 శాతం నమోదవడంతో సానుకూల ప్రభావం కనిపించగా.. సూచీలు కాసేపు లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. ఓ దశలో సెన్సెక్స్ 34279 వద్ద, నిఫ్టీ 10,525 వద్ద ఇంట్రాడే గరిష్టస్థాయిలను నమోదు చేశాయి.

అయితే మార్కెట్లో ఆ ఉత్సాహం కొంతసేపే కనిపించింది. ఆ తర్వాత మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ప్రపంచ మార్కెట్లు ప్రతికూలంగా ఉండడం, బ్యాంకింగ్, మెటల్, ఫైనాన్షియల్ రంగాలకు చెందిన షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనుకావడంతో మార్కెట్ నష్టపోయింది. ప్రధానంగా హిందాల్కో, ఎస్‌బిఐ, జి లిమిటెడ్, వేదాంత, ఐసిఐసిఐ షేర్లు 2 నుంచి 3 శాతం నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అరబిందో ఫార్మా, కోల్ ఇండియా, బిపిసిఎల్ షేర్లు లాభపడ్డాయి.

## టాప్ గెయినర్స్ (+)

| కంపెనీ పేరు | గరిష్టం | కనిష్టం | ముగింపు ధర | క్రితం ముగింపు | మార్పు | లాభం % |
|---|---|---|---|---|---|---|
| బిపిసిఎల్ | 443.90 | 430.20 | 441.90 | 429.55 | 12.35 | 2.88 |
| అరబిందో ఫార్మా | 628.00 | 615.00 | 624.10 | 613.90 | 10.20 | 1.66 |
| కోల్ ఇండియా | 314.15 | 308.00 | 312.90 | 309.15 | 3.75 | 1.21 |
| ఇండస్‌ఇండ్ బ్యాంకు | 1,708.95 | 1,673.50 | 1,700.35 | 1,680.75 | 19.60 | 1.17 |
| బజాజ్ ఫైనాన్స్ | 1,666.00 | 1,628.00 | 1,659.35 | 1,640.25 | 19.10 | 1.16 |
| ఐచర్ మోటార్స్ | 28,001.00 | 27,282.30 | 27,742.35 | 27,437.75 | 304.60 | 1.11 |
| ఒఎన్‌జిసి | 190.20 | 187.35 | 189.70 | 188.30 | 1.40 | 0.74 |
| ఐటిసి | 382.75 | 377.65 | 381.50 | 379.30 | 2.20 | 0.58 |
| ఎంఅండ్ఎం | 736.50 | 727.50 | 732.55 | 728.35 | 4.20 | 0.58 |
| టాటాస్టీల్ | 685.00 | 670.05 | 675.05 | 671.60 | 3.45 | 0.51 |


## టాప్ లూజర్స్ (-)

| కంపెనీ పేరు | గరిష్టం | కనిష్టం | ముగింపు ధర | క్రితం ముగింపు | మార్పు | నష్టం % |
|---|---|---|---|---|---|---|
| ఐసిఐసిఐ బ్యాంకు | 314.00 | 304.25 | 304.95 | 313.25 | 8.30 | 2.65 |
| ఎస్‌బిఐ | 270.00 | 261.25 | 262.15 | 268.00 | 5.85 | 2.18 |
| యుపిఎల్ | 732.90 | 711.80 | 714.25 | 728.75 | 14.50 | 1.99 |
| వేదాంత | 333.65 | 321.70 | 323.25 | 329.75 | 6.50 | 1.97 |
| లుపిన్ | 824.25 | 802.30 | 803.90 | 819.95 | 16.05 | 1.96 |
| హిందాల్కో | 247.00 | 239.00 | 240.80 | 245.40 | 4.60 | 1.87 |
| జీ ఎంటర్‌టైన్ | 568.90 | 551.60 | 555.40 | 565.35 | 9.95 | 1.76 |
| సిప్లా | 593.90 | 580.40 | 581.70 | 589.65 | 7.95 | 1.35 |
| ఇన్ఫోసిస్ | 1,169.60 | 1,156.05 | 1,160.75 | 1,172.60 | 11.85 | 1.01 |
| హెచ్‌పిసిఎల్ | 383.10 | 375.80 | 376.75 | 380.15 | 3.40 | 0.89 |

## అంతకుమించి మార్పేమీ లేదు



పలు విజయవంతమైన చిత్రాల్లో అద్భుతమైన నటనతో ప్రేక్షకులను మైమరపించిన స్టార్ బ్యూటీ అనుష్క. ఆమె నడవడిక, మాటతీరుని చూస్తే అనుష్క సున్నిత మనస్కురాలని అనిపించకమానదు. అందుకు తగ్గట్టుగానే ఆమె నొప్పింపక తానొవ్వక అన్నట్టుగానే నడుచుకుంటుంది. అందుకే ఆమెపై వివాదాస్పదమైన వార్తలు రావడం అరుదు. ఇటీవల 'భాగమతి' చిత్రంతో బిగ్గెస్ట్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది అనుష్క. వయసుమీరుతున్నా ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్‌లలో స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతూ తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకుంది ఈ భామ. ఇక 'చిత్ర పరిశ్రమలోకి వచ్చాక మీలో మీకు కనిపించిన మార్పులేమైనా ఉన్నాయా...? అని అడిగితే... ''అప్పుడు 'స్వీటీ' అని పిలిచేవారు, ఇప్పుడు 'అనుష్క' అని పిలుస్తున్నారు. అంతకుమించి మార్పేమీ లేదు'' అని చెప్పింది ఈ అందాల తార. కానీ వ్యక్తిగతంగా తాను ఇప్పటికీ 'స్వీటీ'నే అని అంటోంది. స్టార్ హోదా గుర్తుకు రాదా? అని అంటే... నా తీరు ఎప్పటికీ మారదంతే అని చెబుతోంది అనుష్క. ప్రేక్షకుల అభిమానం గుర్తుకొచ్చినప్పుడు ఏమనిపిస్తుంది అని అడిగితే.. ''వ్యక్తిగతంగా నేను కొందరికే తెలుసు. మిగతా అందరూ తెరపై నా నటనని చూసే నాకు అభిమానులయ్యారు. వాళ్లని సంతృప్తిపరచాలంటే మరిన్ని మంచి పాత్రల్లో నటించడం ఒక్కటే మార్గం అనిపిస్తుంటుంది''అని చెప్పింది అనుష్క.



రామ్‌చరణ్

## ముస్తాబవుతున్న 'రంగస్థలం'

సుకుమార్ దర్శకత్వంలో స్టార్ హీరో రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రం ఈనెల 30న విడుదల కానుంది. అయితే ఈ చిత్రానికి సంబంధించిన వర్క్ ఇంకా కొంత మిగిలిపోయే ఉంది. ఇప్పటికీ ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. రామ్‌చరణ్‌తో కొన్ని ప్యాచ్ వర్క్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో చెర్రీపై కొన్ని సన్నివేశాలు తీశారు. ఇందులో భాగంగా ఓ పాటకు సంబంధించిన డాన్స్ మూమెంట్స్‌ను కూడా షూట్ చేశారు. ఆతర్వాత హైదరాబాద్‌లోని భూత్‌బంగ్లాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. హోలీ పండుగ కారణంగా గురు, శుక్రవారాల్లో సెలవులు ఇచ్చారు. అనంతరం శనివారం నుంచి నాలుగు రోజుల పాటు కొన్ని సన్నివేశాలను తెరకెక్కిస్తారట. ఆతర్వాత గుమ్మడికాయ కొడతారని తెలిసింది. మరోవైపు ఈ సినిమాకు సంబంధించిన పాటల విడుదల కార్యక్రమం దశలవారిగా కొనసాగుతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన 'ఎంత సక్కగున్నావే...' పాట కోటి వ్యూస్ దాటేసింది. శనివారం రెండో పాటను విడుదల చేయబోతున్నారు. దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూర్చగా రత్నవేలు సినిమాటోగ్రాఫర్. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది.



## అదరగొడుతున్న అల్లు అర్జున్

అల్లుఅర్జున్, అను ఇమాన్యుయల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్, శరత్‌కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం నుంచి హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. హోలీ పండుగ సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''అల్లుఅర్జున్, అను ఇమాన్యుయల్ జంటగా వక్కంతం వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ 'నా పేరు సూర్యనా ఇల్లు ఇండియా' చిత్రాన్ని గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం. గురువారం నుంచి కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. రామోజీ ఫిల్మ్‌సిటీతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సన్నివేశాలను షూట్ చేస్తున్నాము. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్‌తో పాటు సినిమా ముఖ్య తారాగణం పాల్గొంటోంది. ఈనెల 14వ తేదీ వరకు ఈ ముఖ్యమైన షెడ్యూల్ జరుగుతుంది. హోలీ పండుగ సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్‌ను రిలీజ్ చేశాం. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తిచేసి ఈ చిత్రాన్ని మే 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఫైట్స్ః రామ్‌లక్ష్మ ణ్.

## నిధి కోసం అన్వేషణ



ప్రముఖ నటుడు, దర్శకుడు, ప్రనృత్య దర్శకుడు ప్రభుదేవా హీరోగా, హన్సిక హీరోయిన్‌గా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. ప్రముఖ నటి రేవతి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటించిన ఈ చిత్రం కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కింది. కోలీవుడ్‌లో సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం సంచలన విజయాన్ని నమోదుచేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రై.లి. పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈనెల 16న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో ఇక్కడ విడుదల చేస్తున్నాను. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇండియన్ మైఖేల్ జాక్సన్ అయిన ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా ఉంటాయి. ఈనెల 16న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని తెలిపారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః ఆర్.ఎస్.ఆనంద్‌కుమార్, సంగీతంః వివేక్ మెర్విన్, పాటలుః సామ్రాట్, స్టంట్స్ః పీటర్ హెయిన్స్.

## 5న ప్రీ రిలీజ్ ఫంక్షన్



నాగశౌర్య, సాయిపల్లవి

'ఛలో'తో సూపర్‌హిట్ కొట్టిన నాగశౌర్య, ఫిదా,ఎంసిఎ వంటి సూపర్‌హిట్స్ చిత్రాల్లో నటించిన సాయిపల్లవి కలిసి నటించిన చిత్రం 'కణం'. ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఈనెల 5న హైదరాబాద్‌లో జరుగనుంది. ఈ వేడుకలో సినిమా విడుదల తేదీ ని ప్రకటిస్తామని ఎన్‌విఆర్ సిని మా అధినేత చెప్పారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక సా యి పల్లవి మాట్లాడుతూ ''తల్లి, కూతురి మధ్య ఉండే భావోద్వేగాల ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'కణం'. దర్శకుడు విజయ్ ఈ కథ చెప్పి... ఇందు లో నేను తల్లి పాత్ర చేయాలని అడిగినప్పుడు ఈ పాత్రలోని ఎమోషన్స్‌ను పండించగలనా అని అనుకున్నాను. ఎందుకంటే ఇలాంటి పాత్ర ఇది వరకు నేను చేయలేదు. విజయ్, నేను సిని మా గురించి చాలా చర్చించుకున్నాం. చిత్రంలో నా కూతురిగా కనిపించే వెరోనికాతో చాలా సమయం గడిపాను. ఆ అమ్మాయి, నేను తల్లి, కూతురిలాగా కలిసిపోయాం. అందువల్ల సినిమాలో కనిపించే భావోద్వేగాలన్నీ చాలా సహజంగా ఉంటాయి. నటిగా ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఇందులోని పాత్రను ఎంతో ఇష్టపడి చేశాను'' అని అన్నారు. ఈ చిత్రం సాంకేతిక నిపుణులుగా నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్, ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్ తదితరులు పనిచేశారు.

## శాటిలైట్ రైట్స్‌కు రూ.13.5 కోట్లు

దర్శకుడు శ్రీవాస్‌యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'సాక్ష్యం' చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం రామోజీఫిల్మ్ సిటీలో జరుగుతోంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మే 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు దర్శనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ శాటిలైట్ రైట్స్ రూ.13.5 కోట్లకు అమ్ముడుపోయాయి. జీ సంస్థ ఈ చిత్రం తెలుగు శాటిలైట్ రైట్స్‌ను రూ.5.5 కోట్లు, హిందీ రైట్స్‌ను రూ.8 కోట్లకు కొనడం విశేషం. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన బెల్లంకొండ శ్రీనివాస్‌పూజా హెగ్డేల ఫస్ట్‌లుక్‌కు విశేషమైన స్పందన లభించింది. ప్రస్తుతం రామోజీఫిల్మ్ సిటీలో భారీ సెట్స్ వేసి షూటింగ్ చేస్తున్నారు. చిత్ర బృందం ఆఖరి షెడ్యూల్ కోసం త్వరలో అమెరికా వెళ్లనుంది. అమెరికాలో చిత్రీకరించబోయే కీలక సన్నివేశాలతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, వెన్నెల కిషోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్ రానా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఆర్థర్ ఎ.విల్సన్, ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, ఆర్ట్ః ఏ.ఎస్.ప్రకాష్, యాక్షన్ః పీటర్ హెయిన్స్, మాటలుః సాయిమాధవ్ బుర్రా, సంగీతంః హర్షవర్ధన్.



బెల్లంకొండ శ్రీనివాస్

## మూడు ప్రేమ జంటల 'ఆనందం'

మలయాళంలో విడుదలై భారీ విజయాన్ని అందుకున్న 'ఆనందం' చిత్రాన్ని సుఖీభవ మూవీస్ పతాకంపై నిర్మాత ఎత్తరి గురురాజ్ తెలుగులోకి అనువదిస్తున్నారు. గణేష్‌రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కేరళ స్టార్ హీరో నివిన్ పాల్ అతిథి పాత్రలో నటించారు. మిగిలిన నటీనటులుందరూ కొత్తవారే కావడం గమనార్హం. వీరా వెంకటేశ్వరరావు, విఆర్‌బి రాజు, రవివర్మ చిలువూరి ఈ చిత్రానికి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు ఈ చిత్రానికి సమర్పకులు. ఈ సినిమా గురించి నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ ''ఒక ఇండస్ట్రియల్ టూర్... నాలుగు రోజులు, మూడు ప్రేమ కథలు... క్లుప్తంగా 'ఆనందం' సినిమాలోని విషయం ఇదే. అంటే 1 4 3 అన్నమాట. ఆద్యంతం యూత్‌ఫుల్‌గా ఉంటూ ప్రేక్షకులను అలరిస్తుంది. 'హ్యాపీడేస్'ని మించిపోయేలా ఈ సినిమా ఉంటుంది. ఎంతో పోటీని తట్టుకొని మేము ఈ సినిమా హక్కుల్ని దక్కించుకున్నాం. తెలుగు నేటివిటీకి సరిపోయే అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. ఇందులో కేరళ స్టార్ హీరో నివిన్ పాల్ తప్ప మిగిలిన వాళ్లందరూ కొత్తవారే నటించారు. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా కనిపించదు. మలయాళ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ సచిన్ వారియర్ వినసొంపైన సంగీతాన్ని సమకూర్చారు. అనువాద కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెలలోనే సినిమాను విడుదల చేస్తాం''అని చెప్పారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజనకట్టి, అన్ను ఆంటోని తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరాః ఆనంద్, ఇ.చంద్రన్, సంగీతంః సచిన్ వారియర్, మాటలుః ఎం.రాజశేఖర రెడ్డి, పాటలుః వనమాలి.





'మిర్రర్' పోస్టర్‌ను విడుదల చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో తూమ్కుంట అరుణ్‌కుమార్, శ్రీనాథ్, సాయికుమార్ ఎక్మా తదితరులు.

## 'మిర్రర్' ఘన విజయం సాధించాలి

శ్రీ మల్లికార్జున మూవీస్ బ్యానర్‌లో శ్రీనాథ్, హరిత హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిర్రర్'. సాయికుమార్ ఎక్మా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విఠలాచార్య, మధు, అంజి, రాజు, సుందర్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌లో ఉంది. ఈ సినిమా పోస్టర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు తూమ్కుంట అరుణ్‌కుమార్, హీరో శ్రీనాథ్, చిత్ర దర్శకుడు సాయికుమార్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ ''నూతన నటీనటులు, మంచి కథతో 'మిర్రర్' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈమధ్యన మంచి కంటెంట్‌తో తెరకెక్కిన చిన్న సినిమాలు పెద్ద విజయాన్ని అందుకుంటున్నాయి. అదే తరహాలో ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను''అని అన్నారు. చిత్ర దర్శకుడు సాయికుమార్ ఎక్మా మాట్లాడుతూ ''కొత్త వారైనా హీరోహీరోయిన్లు శ్రీనాథ్, హరిత చక్కగా నటించారు. నేటి ట్రెండ్‌కు అనుగుణంగా సిని మా అద్భుతంగా తెరకెక్కింది. తప్పకుండా సినిమా సక్సెస్ సాధిస్తుంది''అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరాః అశోక్‌రెడ్డి, మ్యూజిక్ః అర్జున్ నల్లగోపుల, స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ః సాయికుమార్ ఎక్మా.

## 'దండుపాళ్యం–4'లో నటించడం లేదు

ఇప్పటివరకు 'దండుపాళ్యం' సిరీస్‌లో వచ్చిన సినిమాలన్నీ విజయం సాధించాయి. శ్రీనివాస్‌రాజు దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. 'దండుపాళ్యం' రెండు పార్టులు విజయం సాధించగా ఇప్పుడు 'దండుపాళ్యం 3' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రాల్లో పూజగాంధీ,మకరంద్ దేశ్‌పాండే, రవికాలే, రవి శంకర్, సంజన ముఖ్య పాత్రలు పోషించారు. ఇప్పుడు నిర్మాత వెంకట్ 'దండుపాళ్యం 4' చిత్రాన్ని నిర్మిస్తున్నానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ కొత్త చిత్రంలో తాము నటించడం లేదంటూ పూజగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో పూజ గాంధీ మాట్లాడుతూ ''నేను దండుపాళ్యం 4 చిత్రంలో నటించడం లేదు. ఈ సినిమా గురించి నన్ను ఎవరూ సంప్రదించలేదు''అని అన్నారు.



## 'ఐతే 2.ఓ' పాటలు ఆకట్టుకుంటాయి



'ఐతే 2.ఓ' పాటను విడుదల చేస్తున్న కీరవాణి. చిత్రంలో రాజ్ మాదిరాజు, కళ్యాణ్ మాలిక్.

ఇంద్రనీల్‌సేన్ గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపు రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 16న ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమాలోని 'నింగిపై...' అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ మాలిక్, రాజ్ మాదిరాజు, సంగీత దర్శకుడు అరుణ్ చిలువేరు, నరేష్ అయ్యర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ ''ఈ పాట విన్నాను. చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమాకు సంగీతాన్ని అందించిన అరుణ్ చిలువేరు అద్భుతమైన మెలోడి మ్యూజిక్‌ను అందించగలరు. సినిమాలోని పాటలు శ్రోతలను ఆకట్టుకుంటాయనే నమ్మకం ఉంది''అని తెలిపారు. దర్శకుడు రాజ్ మాదిరాజు మాట్లాడుతూ ''ఈ సినిమాలో మూడు పాటలున్నాయి. ఇందులోని ముగ్గురు హీరోలకు సంబంధించిన వివిధ నేపథ్యాల్లో ఈ మూడు పాటలు వస్తాయి. ఆకలి, ఆశ, కోపం అనే మూడు అంశాలపై ఈ మూడు పాటలు ఉంటాయి''అని చెప్పారు.



## ఆర్‌టిసి ఎండికి అధికారుల అభినందనలు

**మన తెలంగాణ** / హైదరాబాద్ : అసో సియేషన్ అఫ్ స్టేట్ రో డ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ (ఎ.ఎస్.ఆర్.టి.యు) నుంచి వాహన ఉత్పాదకత, కె ఎంపిఎల్ కేటగిరీల లో పురస్కారాలను న్యూఢిల్లీలో స్వీకరించి హైదరాబాద్‌కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావును గురువారం బస్ భవన్‌లో పలువురు అధికారులు కలిసిఅభినందనలు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ), సంస్థ కార్యదర్శి ఎం.వెంకటే శ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటి) ఎ.పురుషోత్తం నాయక్, సిసిఓఎస్ సి.హెచ్.అజయ్ కు మార్‌లు ఎండిని కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. టిఎస్‌ఆర్ టిసిని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే విధంగా ఎండి నూతన విధానాలు అమలు పరచడంతో పాటు కార్మికుల శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు.ఇదిలా ఉండగా టిఎస్ ఆర్‌టిసి నూతన ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ (రెవెన్యూ),సంస్థ కార్య దర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటేశ్వ రరా వును టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు,ప్రధాన కార్యదర్శి కె.రాజి రెడ్డి కలిసి పుష్పగుచ్ఛాల తోఅభినందించారు. సం స్థ అభి వృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షే మానికి త గిన చర్యలు తీసుకోవాలని వారు ఇదిని కోరారు.

# నెత్తుటి ధారల సిరియా

- శవాల దిబ్బగా గౌటా ప్రాంతం
- ఆప్తుల వెతుకులాటలో జనం హాహాకారాలు






**హాజే** (సిరియా) : బాలలు, పౌరుల ఆర్తనాదాలు, నెత్తుటి ధారలతో సిరియాలోని రెబెల్ ఆధీన ఈస్టర్న్ గౌటా ప్రాంతం తల్లడిల్లుతోంది. సిరియా సైనిక బలగాలు రష్యా అదునుతో తిరుగుబాటుదార్లను అణచివేతకు దిగడం పౌరులకు సంకటంగా మారింది. ఐక్యరాజ్య సమితి తాత్కాలిక యుద్ధ విరమణ తీర్మానం నేపథ్యంలో ఇప్పుడు బాంబుల దాడి నిలిచింది. వైమానిక విమానాల నుంచి బాంబుల వర్షాలు నిలిచిపోయ్యాయి. అయితే అంతకు ముందు జరిగిన దాడులలో దెబ్బతిన్న భవనాలు వాటి శిథిలాల అడుగున ఇప్పుడు ఎన్నో మృతదేహాలు బయటపడుతున్నాయి. ఆ ప్రాంతంలో ఇప్పటికీ క్షతగాత్రుల రోదనలు మిన్నంటుతున్నాయి. సిరియా ఇప్పుడు నెత్తుటి కన్నీటి చుక్కగా మారింది. తప్పొప్పుల సంగతి పక్కన పెడితే అన్నెంపున్నెం తెలియని పౌరులు అందులోనూ బాలలు, మహిళలు విగతజీవులుగా మారుతున్నారు. సిరియాకు చెందిన పౌర భద్రతా దళం వైట్ హెల్మెట్స్ కార్యకర్తలు ఇప్పుడు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు. వారికి ఎక్కడ చూసినా శిథిలాల కింద మృతదేహాలే కన్పిస్తున్నాయి. ఒకదాని వెంట ఒకటిగా భౌతిక కాయాలు తమ దృష్టికి వస్తున్నాయని కార్యకర్తలు తెలిపారు. గతనెల 18న సిరియా బలగాలు భారీ స్థాయిలో దాడులకు దిగాయి. దేశంలో ఏడు సంవత్సరాలుగా సాగుతోన్న దాడులలో ఇప్పటి ఘట్టం అత్యంత దారుణంగా మారింది. పది రోజుల దాడులలో కనీసం 600 మంది పౌరులు దుర్మరణం చెందారు. రాకెట్ల నుంచి, విమానాల నుంచి చివరికి హెలికాప్టర్ల నుంచి కూడా బాంబులు కురియడంతో సాధారణ పౌరులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందరో తమ నివాసాలను పోగొట్టుకున్నారు. కట్టుబట్టలతో మిగిలారు. అంతా నేలమట్టం అయిందని, ఇప్పుడు ఇక్కడికి వచ్చి చూస్తే మిగిలింది ఏమీ లేదని స్థానికులు నిట్టూరుస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కాల్పుల విరమణకు, దాడుల నిలిపివేతకు పిలుపులు వెలువడటంతో సోమవారం రష్యా ఈ ప్రాంతంలో సహాయాన్ని ప్రకటించింది. దీంతో కొంత మేర ఊరట దక్కింది. మృతుల సంఖ్య ఎంత వరకూ ఉంటుందో తెలియడం లేదని , శిథిలాల తొలిగింపు చర్యలు జరుగుతున్నాయని మానవ హక్కుల పరిశీలక బృందాలు తెలిపాయి. ప్రజలు నేలమాళిగలలో తలదాచుకుంటున్నారు.

ఫిబ్రవరి 20 నుంచి తన కూతురు కన్పించడం లేదని, వెతుకుతూ తిరుగుతున్నానని 60 ఏళ్ల అబూ మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరో ఇప్పటికీ కూలిన శిథిలాల మధ్యనే తలదాచుకుంటున్నారు. ఇప్పటివరకూ బాంబుల భయంతో వణికిపోయామని ఇప్పుడు ఈ శిథిలాల మధ్యనే ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పుడు భారీ యంత్రాల సాయంతో కూలిన గోడలు, ఇళ్లను తొలిగిస్తున్నారు. ఆ ప్రాంతాలలో

### కూతురి కోసం వృద్ధుడి గుండెకోత

ఎప్పుడెవరు శవంగా కన్పిస్తారో? ఏ విధమైన భయానకతను చవిచూడాల్సి వస్తుందో అనే ఆందోళన అందరిలో నెలకొంది. సరైన ఏర్పాట్లు లేకపోవడంతో పలు చోట్ల శిథిలాల అడుగునుంచి శవాల వెలికితీత కష్టం అవుతోందని వాలంటీర్లు తెలిపారు. ఇక్కడ 76 శాతం గృహాలు దెబ్బతిన్నాయని, వేలాదిగా నిరాశ్రయులు అయ్యారని ఐరాస తెలిపింది.

## వేలానికి గాంధీ రాసిన లేఖ



### ధర 50 వేల డాలర్లు పలికే అవకాశం

**వాషింగ్టన్ :** ఏసు క్రీస్తును గురించి ప్రస్తావిస్తూ 1926లో మహాత్మాగాంధీ సబర్మతి ఆశ్రమంలో రాసిన శక్తివంతమైన, భావోద్వేగ లేఖ ఇప్పుడు వేలానికి వచ్చింది. వేలంలో దీనికి 50 వేల డాలర్లు పలికే అవకాశం ఉంది. ఏప్రిల్ 6న రాసినట్టుగా పేర్కొన్న లేఖను చిక్కని సిరాతో ఉంది. దీన్ని పెన్సిల్వేనియాకు చెందిన రాబ్ కలెక్షన్ సేకరించింది. ఇప్పుడు దీనిని వేలం వేయనున్నారు. 'మానవజాతి గొప్ప బోధకుల్లో జీసస్ ఒకరు' అని అమెరికాలోని క్రిస్టియన్ బోధకుల్లో ఒకరైన మిల్టన్ న్యూ బెర్రీ ఫ్రాంట్జ్‌కు రాసిన లేఖలో గాంధీ పేర్కొన్నారు. రాబ్ కలెక్షన్స్ ప్రిన్సిపాల్ అయిన నాథన్ రాబ్ మాట్లాడుతూ ప్రపంచంలోని మతాలన్నీ శాంతిని బోధిస్తాయని, దానిని మహాత్మాగాంధీ బాగా జీర్ణించుకున్నారని, ఆ సారాన్ని ఈ లేఖ ప్రతిబింబిస్తోందని రాబ్ పేర్కొన్నారు. మానవాళికి జీసస్ గొప్ప బోధకుడని నమ్మిన గాంధీ తన తోటివారిలో సమానత్వాన్ని చూశారనడానికి ఈ లేఖ ఓ నిదర్శనమని ఆయన తెలిపారు. మతాలపై గాంధీ రాసిన లేఖల్లోకెల్లా ఇది గొప్పదని రామ్ కలెక్షన్స్ తెలిపింది. జీసస్ గురించి గాంధీ రాసిన మరే లేఖ ఇప్పటి వరకు బహిరంగ వేలానికి రాలేదని తమ పరిశోధనలో తేలినట్టు నాథన్ రాబ్ తెలిపారు.

## ట్రంప్‌కు మరో ఎదురు దెబ్బ

**వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ హోప్ హిక్స్ రాజీనామా**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్, ట్రంప్‌కు సుదీర్ఘకాలంగా సలహాదారుగా వ్యవహరిస్తున్న హోప్ హిక్స్ రానున్న కొద్ది వారాల్లో తాను రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించారు. ట్రంప్‌కు ఎలా కృతజ్ఞతలు తెలపాలో అర్థం కావడం లేదని ఆమె పేర్కొన్నారు. ట్రంప్, ఆయన పాలన సిబ్బంది అత్యుత్తమంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తారనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో హోప్ హిక్స్ చాలా అద్భుతంగా పని చేశారని ప్రశంసిస్తూ ట్రంప్ ఒక ప్రకటను విడుదల చేశారు. కాగా, 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలపై హౌజ్ ఇంటెలిజెన్స్ కమిటీ విచారించిన తర్వాత రోజు హోప్‌హిక్స్ రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. అప్పుడప్పుడు తాను ట్రంప్‌కు అబద్ధాలు చెప్పాల్సి వచ్చిందని, అయితే ఎన్నికల్లో రష్యా జోక్యానికి సంబంధించి విచారణ బృందానికి ఎటువంటి అబద్ధాలు చెప్పలేదిని ఆమె తెలిపారు.

## కార్తీ సిఎ బెయిల్‌పై 7న తీర్పు

**న్యూఢిల్లీ :** కార్తీ చిదంబరం ఆర్థిక అంశాలను పర్యవేక్షించే ఛార్టెడ్ అకౌంటెంట్ (సిఎ)కు బెయిల్ దరఖాస్తుపై స్థానిక న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసుకు సంబంధించి సిఎ భాస్కరరామన్‌ను గత నెల 16న అరెస్టు చేశారు. ఇడి వర్గాల ఇంటరాగేషన్ కస్టడీ గడువు ముగియడంతో 26న జైలుకు పంపించారు. అయితే కస్టడీలో ఇప్పటికీ తనను ఉంచడాన్ని భాస్కరరామన్ కోర్టులో సవాలు చేశారు. కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం లేదని , కస్టడీలో ఉంచడం సరికాదని పిటిషనర్ వాదించారు. వాదనల తరువాత సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి సునీల్ రాణా తీర్పును ఈ నెల 7వ తేదీన వెలువరించనున్నట్లు ప్రకటించారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరం నిందితుడిగా ఉండటంతో ఆయన సిఎను దేశ రాజధానిలోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. కార్తీ సాగించిన ఆర్థిక అక్రమాల సమాచారం సిఎకు తెలుసునని, ఆయన కస్టడీ మరింతగా అవసరం అని సిబిఐ వాదించింది. కార్తీ విచారణ ప్రక్రియలో సిఎ కూడా ఉండాల్సిన అవసరం ఉందని , దీని వల్లనే మరింత సమాచారం రాబట్టుకోవడానికి వీలేర్పడుతుందని తెలిపారు.

## హోలీ దిష్టిబొమ్మగా నీరవ్

**ముంబయి :** ఆర్థిక నేరాల మోసగాడు నీరవ్ మోడీపై హోలీ సందర్భంగా నిరసన వ్యక్తం అయింది. స్థానిక వర్లీ ప్రాంతంలో హోలీ వేడుకలలో భాగంగా కామదహనం సందర్భంగా హోలికా దగ్ధం బదులుగా నీరవ్ మోడీ దిష్టిబొమ్మను తగులబెట్టారు. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ 12,000 కోట్లకు పైగా టోపీ పెట్టి, విదేశాలకు తరలివెళ్లిపోయిన నీరవ్‌పై ఆగ్రహంతో ప్రజలు నీరవ్ రూపంతో 50 అడుగుల దిష్టిబొమ్మను రూపొందించారు. బ్రౌన్ రంగు సూట్‌తో, ఒక పెద్ద వజ్రంపై నీరవ్ కూర్చుని ఉన్నట్లుగా ఈ బొమ్మ రూపొందింది. దీని కింద పిఎన్‌బి స్కామ్, డైమండ్ కింగ్ అని రాశారు. హోలికా బదులు ఈ నీరవ్ బొమ్మను దహనం చేసి తరువాత రంగుల పండుగ జరుపుతామని స్థానికులు సంబరంగా తెలిపారు.

## తెలంగాణేతరుల దరఖాస్తులూ స్వీకరణ



**మన తెలంగాణ**/ హైదరాబాద్ : తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సహాయ ఇంజనీర్లు, జూనియర్ గణాంకాధికారుల పోస్టుల భర్తీ కోసం తెలంగాణేతరులు చేసుకునే దరఖాస్తులను కూడా ఆమోదించాలని, ఆ దరఖాస్తుదారులను పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలకు కూడా అనుమతించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఆయా పోస్టులకు తెలంగాణ స్థానికతను చూపుతూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని పావని, నిఖిల్‌కుమార్‌లు తప్పుపడుతూ రిట్లు వేశారు. వీటిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించి.. విద్యుత్ సంస్థలు తెలంగాణేతరుల దరఖాస్తుల్ని కూడా స్వీకరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. లోక్‌సభ మాత్రమే స్థానికతపై నిర్ణయం తీసుకునే వెసులుబాటు రాజ్యాంగం ఇచ్చిందని, విద్యుత్ సంస్థలకు లేదన్నది పిటిషనర్ల వాదన.

## విద్యాశాఖాధికారికి ఐదేళ్ల జైలు

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : ఎన్ఎస్ఎస్ నిధులు రూ.83 లక్షలను దుర్వినియోగం చేశారన్న అభియోగాలు నిరూపణ కావడంతో 2004లో విద్యాశాఖ డిప్యూటీ గణాంకాధికారిగా చేసిన పుల్లారెడ్డికి ఐదు ఏళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ గురువారం ఏసీబీ కోర్టు తీర్పు చెప్పింది. ఇదే కేసులో ఉన్న ఎస్ఎల్ఓగా చేసిన శంకరయ్య, బ్యాంకు మేనేజర్ ఖలీముల్లాలపై నిధుల దుర్వినియోగ ఆరోపణల్ని కోర్టు కొట్టివేసింది. వారిని నిర్దోషులని తేల్చి విడిచిపెట్టింది. ఉన్నతాధికారుల సంతకాల్ని ఫోర్జరీ చేసేసి తన పేరిట బ్యాంకు అకౌంట్ తెరిచి ఎన్ఎస్ఎస్ నిధులు రూ.83లక్షలను దుర్వినియోగం చేశారని అప్పటి విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఫిర్యాదుపై సిఐడి కేసు పెట్టింది. ఎస్ఎల్‌వో బదిలీ కావడంతో నిధుల మళ్లింపు వెలుగులోకి వచ్చింది.

## తెలంగాణ సాహిత్యంలో జాగృతి కృషి : ఎంపి కవిత

**మన తెలంగాణ**/హైదరాబాద్ : తెలంగాణసాహిత్యాన్ని, వాంగ్మయాన్ని, సహజశైలిలో తెలంగాణ సమాజానికి అందించేందుకు జాగృతి కృషి చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. హోలి పండగను పురస్కరించుకుని తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీను నిర్వహణలో రూపొందించిన పాటల సిడిని గురువారం ఆమె గురువారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధా న కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు రాజీవ్‌సాగర్, జాగృ తి గల్ఫ్ అధ్యక్షులు చెల్లంశెట్టి హరిప్రసాద్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను, యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజ య్, జాగృతి మహారాష్ట్ర అధ్యక్షులు సుల్గే శ్రీనివాస్, నాయకులు బిక్షపతి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నత్తనడకన భూ రికార్డుల కంప్యూటరీకరణ





**మన తెలంగాణ** / హైదరాబాద్ : భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా వంద రోజుల్లోనే పూర్తి చేసినందుకు రెవిన్యూ ఉద్యోగులను సిఎం కెసిఆర్ స్వయంగా అభినందించి ఒక నెల మూల వేతనాన్ని ప్రోత్సాహకంగా ప్రకటించినా ఈ రికార్డుల కంప్యూటరీకరణ పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయి. రాష్ట్రం మొత్తంమీద 72.17 లక్షల భూ కమతాలు సక్రమంగా ఉన్నట్లు రికార్డుల ప్రక్షాళన సందర్భంగా తేలినా ఇప్పటివరకు రైతుల ఆధార్ నెంబర్లతో పాటు ఇతర వివరాలను సేకరించి కంప్యూటరీకరణ చేసింది మాత్రం కేవలం 4.33 లక్షలు మాత్రమే. మార్చి నెల 11వ తేదీ నుంచి తహసీల్దార్లకే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పనులు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి ఇందుకు అవసరమైన శిక్షణా తరగతులను నిర్వహించినా ఈ పది రోజుల వ్యవధిలో మిగిలిన రికార్డుల కంప్యూటరీకరణ చేయడం, ధరణి వెబ్‌సైట్‌లోకి ఎక్కించడం అనుమానంగా తయారైంది. ఫిబ్రవరి 28వ తేదీ నాటికి రాష్ట్రం మొత్తంమీద కేవలం 10.61 లక్షల సర్వే నెంబర్లకు సంబంధించిన 10.85 లక్షల ఎకరాల భూముల పరిశీలన మాత్రమే పూర్తయింది. తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ కూడా పూర్తయింది. మార్చి 11కల్లా ధరణి వెబ్‌సైట్ సిద్ధమై తహసీల్దార్లే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పనులు చేయాల్సి ఉన్నందున అప్పటికల్లా మొత్తం 72.17 లక్షల భూ ఖాతాల వివరాలను కంప్యూటరీకరించాల్సి ఉంది. కానీ ముఖ్యమంత్రి ఆశించినంత వేగంగా క్షేత్రస్థాయిలో పనులు జరగడంలేదు. భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా మొత్తం 1.85 కోట్ల మేర సర్వే నెంబర్లకు సంబంధించిన భూముల పరిశీలన జరగ్గా మొత్తం 72.17 లక్షల పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ కావాల్సి ఉంది. ఇందుకోసం రైతుల భూముల, వ్యక్తిగత వివరాలను సేకరించి పాస్‌బుక్‌లను ముద్రించే ప్రింటింగ్ ప్రెస్‌కు అందించాల్సి ఉంది. పాస్‌బుక్‌ల అవసరాల కోసం మొత్తం 85.68 లక్షల సర్వే నెంబర్లలోని 33.43 లక్షల భూ కమతాల వివరాలను రెవిన్యూ సిబ్బంది సేకరించాల్సి ఉండగా కేవలం 4.33 లక్షల కమతాలకు సంబంధించిన వివరాలు మాత్రమే ఇప్పటివరకు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశారు. పూర్తిస్థాయిలో ఈ వివరాలు కంప్యూటర్‌లో అందుబాటులో లేకపోతే ధరణి వెబ్‌సైట్ ద్వారా రోజువారీ భూ లావాదేవీలను ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

**పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించండి : తహసీల్దార్ల సంఘం**

భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ బాధ్యతలను తహసీల్దార్లకు అప్పగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇప్పటివరకు ఇచ్చిన శిక్షణ సరిపోదని, సిబ్బంది కొరత కూడా ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కాకుండా పైలట్ ప్రాజెక్టు ప్రాతిపదికన ఎంపిక చేసిన కొన్ని మండలాల్లో మాత్రమే మార్చి 11వ తేదీ నుంచి ఈ ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసింది. రెవిన్యూ బాధ్యతలు మినహా మిగిలినవాటిని తాసీల్దార్లకు అప్పజెప్పవద్దని, ప్రస్తుతం భూ ముల లావాదేవీల్లో అనుభవం ఉన్న విఆర్‌ఓ, విఆర్‌ఏల సేవలను వినియోగించుకోడానికి అనుమతి ఇవ్వాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డితో పాటు పలువురు తహసీల్దార్లు విజ్ఞప్తి చేశారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో వాటి పరిశీలన చేయడానికి వీలుగా రిజిస్ట్రేషన్ చట్టంలో సవరణలు కూడా అవసరమవుతుందని ప్రధాన కార్యదర్శికి సూచించారు.

## నిధులివ్వకుండా రాజధాని నిర్మాణమెలా?



**గుంటూరు:** బిజెపి నేతలకు రాయలసీమపై మాట్లాడే హక్కులేదని.. ఎప్పుడైనా రాలయసీమ సమస్యలపై ఆ పార్టీ పోరాడిందా?అని ఆంధ్ర ప్రదేశ్ సిపిఐ రాష్ట్ర రామకృష్ణ ప్రశ్నించారు. గుంటూరులోని శ్రీ వెంకటే శ్వర విజ్ఞాన మందిరం లో ప్రత్యేక హోదాపై గురువారం సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, నటుడు శివాజీ, వైసిపి నేత కొణతాల రామకృష్ణ, జనసేన నేత రాఘవయ్య, ఎపి ప్రత్యేక హోదా పోరాట సమితి నేత చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బిజెపి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చ గొట్టడం సబబు కాదని హితవు పలికారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం తన వైఖరి స్పష్టం చేయా లని డిమాండ్ చేశారు. ప్రధానిగా నరేంద్రమోడీ ఉన్నంతవరకూ రాష్ట్రానికి న్యాయం జరిగే అవకాశం లేదంటూ వ్యాఖ్యానించారు. కేం ద్రం నిధులివ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబా బు రాజధాని ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు.

## పంచాయతీరాజ్ శాఖ అధికారులతో లోకేష్ సమీక్ష

**అమరావతి:**పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుపై చర్చించారు. 5,237 గ్రామాల్లో ఎల్ఈడి లైట్లు ఈఈఎస్ఎల్ ఏర్పాటు చేయనుంది. నవంబర్ నాటికి ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను లోకేష్ ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో 150ఉపాధి దినాలు కల్పించాలంటూ.. కేంద్రానికి లేఖ రాయాలని మంత్రి నిర్ణయం తీసుకున్నారు.80కరువు మండలాల్లో అదనంగా50 ఉపాధి దినాలు కల్పిస్తున్నట్లు లోకేష్ ప్రకటించారు.

## అంతర్రాష్ట్ర స్కాలర్‌షిప్‌లపై ప్రతిష్టంభన

### చదువు పూర్తయినా అందని ఫీజు బకాయిలు



**మన తెలంగాణ** / హైదరాబాద్ : ఇతర రాష్ట్రాల్లో చదివే తెలంగాణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరుపై ప్రతిష్టంభన కొనసాగుతూ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్న తెలంగాణ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ ఓ కొలిక్కి రాలేదు. కొన్ని కోర్సులకు కొన్ని విద్యా సంస్థలకు సమస్య పరిష్కారం అయ్యి, ఫీజు బకాయిలు విడుదల కాగా పిజి కోర్సులకు ఇప్పటికీ స్కాలర్‌షిప్‌లు, ట్యూషన్ ఫీజులు మంజూరు కాలేదు. రాష్ట్ర విభజన అనంతరం తలెత్తిన సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉపకార వేతనాలు విడుదలపై స్పష్టత రాలేదని అధికారులు వ్యాఖ్యానించారు. రెండేళ్ళ పిజీ కోర్సు పూర్తయ్యి రెండేళ్ళయినా ఫీజు రీ ఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయలేదని కర్నూలు కెవిఆర్ కాలేజీలో రెండేళ్ళ పి.జి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థిని ఎం. అరుణ వాపోయారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కాలయాపన చేస్తూ దాటవేస్తున్నారేతప్ప సమస్య పరిష్కారం కాలేదని హైదరాబాద్‌కు చెందిన అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ రాకపోవడంతో తాను ఫీజు చెల్లించకపోయానని, ఫలితంగా కాలేజీ యాజమాన్యం ఇప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వలేదని తెలిపారు. సర్టిఫికెట్లు లేని కారణంగా ఉన్నత చదువులకు వెళ్ళలేకపోతున్నానని, ఉద్యోగావకాశాల్ని సైతం కోల్పోతున్నానని, తన మానసిక సంఘర్షణకు పరిష్కారమే దొరకడంలేదని వాపోయారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వేలాది మంది విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లో చదువుకుంటూ ఇలాంటి ఇబ్బందుల్నే ఎదుర్కొంటున్నారని, ఇటీవల ప్రభుత్వం కొన్ని కాలేజీలకు సంబంధించిన 'ఇంటర్‌కం' సమస్యను పరిష్కరించి ఫీజు బకాయిలను వాయిదా పద్ధతుల్లో విడుదల చేస్తోంది. అయితే పీజి కోర్సుల విద్యార్థులకు మాత్రం సమస్య పరిష్కారం కావడం లేదని ఈ విషయంలో ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకొని ఉపకార వేతనాలు, ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మిర్చియార్డులో రైతుల ఆందోళన

**గుంటూరు:** గుంటూరులో మిర్చి రైతులు ఆందోళన బాట పట్టారు. గురువారం నుంచి మిర్చియార్డులో ఈనామ్ విధానం అమలు జరగాల్సి ఉంది. అయితే వ్యాపారులు ఈ విధానం ద్వా రా కొనుగోలుకు నిరాకరించడంతో రైతులు ఆందోళనకు గురయ్యా రు. మిర్చియార్డులో నిన్నటితో పోల్చి చూస్తే ధరలను సైతం వ్యాపారులు తగ్గించడంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తూ గుంటూరు చిలకలూరిపేట రహదారిపై బైఠాయించారు. తమకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత విధానంలోనే క్రయవిక్రయాలు జరపాలని ఈనామ్ విధా నాన్ని ఉపసంహరించాలంటూ రైతులు డిమాండ్ చేశారు. బ్యాం కు అకౌంట్లు, ధ్రువ పత్రాలంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని, చేతికి సొమ్ము ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడుతుందంటూ రైతులు భయాందోళన వ్యక్తం చేశారు. వ్యా పారుల సహాయ నిరాకరణ, రైతుల ఆందోళనతో ఈనామ్ విధానం ద్వారా తొలిరోజు మిర్చి కొనుగోళ్లు ఆగిపోయాయి.

## విమాన సర్వీసులు ప్రారంభం

**కడప:** కడప విజయవాడ ట్రూజెట్ విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సర్వీసులను ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా ప్రస్తుతం ట్రూజెట్ విమాన సర్వీసుతో కడప ఎయిపోర్టు నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నైకు మూడు సర్వీసులు నడుస్తున్నాయి.


## మాజీ ఎంఎల్ఎ మృతి

**అమరావతి:** పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మాజీ ఎమ్మెల్యే పునెం సింగన్న దొర(75) కన్నుమూశారు. ఆయనకు గురువారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే లోపలే సింగన్న దొర మృతి చెందారు.1994–99 మధ్య కాలంలో ఆయన తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. మరణ వార్త తెలుసుకున్న పలువురు నేతలు సంతాపం తెలిపారు.

## ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి వినేష్ పొగట్

**బిష్‌కెక్(కిర్గిస్థాన్):** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సత్తాచాటారు. 50 కేజీల మహిళల విభాగంలో వినేష్ పొగట్ ఫైనల్ చేరుకుంది. ఇప్పటికే పతకాన్ని ఖాయం చేసుకున్న వినేష్ స్వర్ణం కోసం తుది పోరులో చైనాకు చెందిన చున్‌లీతో తలపడనుంది. సెమీఫైనల్లో వినేష్ జపాన్ క్రీడాకారిణి యుకీ ఐరీపై విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గతంలో వినేష్ కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.మరో రెజ్లర్ సంగీత కాంస్యం కోసం 59 కేజీల విభాగంలో కొరియా క్రీడాకారిణి జియూన్ ఉమ్‌తో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్లో సంగీత ఉజ్బెకిస్థాన్‌కు చెందిన నబీర ఎసెన్‌బేవ చేతిలో 5–15తో పరాజయం పాలైంది. భారత్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు హర్‌ప్రీత్ సింగ్ 82 కేజీల విభాగంలో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఖషింబెకోవ్‌ను 11–3తో, రాజేంద్ర కుమార్ 55 కేజీల విభాగంలో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన మిరఖ్‌మెదోవ్‌ను ఓడించి కాంస్య పతకాలు అందుకున్నారు.






## ధోని అన్ని స్థాయిలను అధిగమించడం అద్భుతం

- 2003 ప్రపంచ కప్‌లో ధోని ఉండాల్సింది
- 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' పుస్తకంలో సౌరవ్ గంగూలీ





**కోల్‌కతా :** దక్షిణాఫ్రికాలో జరిగిన 2003 ప్రపంచ కప్‌లో మహేంద్ర సింగ్ ధోని ఆడిఉండాల్సింది అని తాను భావిస్తున్నానని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. ఈ విషయాన్ని అతడు త్వరలో రాబోతున్న తన స్వీయచరిత్ర 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' అనే పుస్తకంలో పేర్కొన్నాడు. ధోని ఈ స్థాయికి ఎదిగిన పరిస్థితులు చూస్తే తనకే ఆశ్చర్యంవేస్తోందన్నారు. ' 2003 ప్రపంచ కప్ జట్టులో ధోని ఉండాల్సినోడని నేను అనుకుంటున్నాను. మేము 2003లో ప్రపంచ కప్ ఫైనల్ ఆడుతున్నప్పుడు ధోని ఇంకా భారతీయ రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా ఉన్నాడని నాకు చెప్పినప్పుడు నాకు నమ్మబుద్ధికాలేదు' అని కూడా సౌరవ్ గంగూలీ తన స్వీయచరిత్రలో పేర్కొన్నాడు. 2003లో జరిగిన ప్రపంచ కప్‌లో భారత జట్టు 125 పరుగుల తేడాతో ఆధిపత్య ఆస్ట్రేలియా జట్టు చేతిలో ఓడిపోయింది. ఆ తర్వాతే.. అంటే 2004 డిసెంబర్‌లో ధోని తన అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. 'ఒత్తిడిలోనూ అచంచలంగా నిలబడి ఆడి మ్యాచ్ గతినే మార్చేయగల ఆటగాళ్ల కోసం నేనే ఎన్నో ఏళ్లు ఎదురుచూశాను. మహేంద్ర సింగ్ ధోని 2004లో నా దృష్టికి వచ్చాడు. నాటి నుంచే నేను ధోనికి ఆకర్షితుడనయ్యాను' అని గంగూలీ తన స్వీయచరిత్రలో రాశారు. 'నా అంచనా సరైనదేనని నేడు రుజువైంది. దానికి నేను సంతోషిస్తున్నాను. ధోని అన్ని స్థాయిలను అధిగమించి ఎదగడం అద్భుతం' అని పేర్కొన్నారు. ఆరంభంలో ధోని తనకు తాను స్వాష్‌బక్లింగ్ వికెట్‌కీపర్–బ్యాట్స్‌మన్‌గా పేర్కొన్నాడు. అతడిని 2007లో మొదటి సారి అం తర్జాతీయ టి20 ప్రపంచ కప్‌కు భారత జట్టు కెప్టెన్‌ను చేశారు. అతడి నేతృత్వంలో టీమిండియా ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత భారత జట్టును నెం. 1 ర్యాంకింగ్‌కు తీసుకెళ్ళాడు. ఆయన అత్యుత్తమ కెప్టెన్సీలో టీమిండియా 2011 ప్రపంచ కప్ గెలుచుకుంది. 2008లో తన చివరి టెస్టుకు కెప్టెన్‌గా గంగూలినే ధోని అనుమతించడం గొప్ప విషయమనే చెప్పాలి.

## సచిన్ రికార్డును అధిగమించిన మయాంక్ అగర్వాల్



**ముంబయి:** విజయ్ హజారె ట్రోఫీలో విజేతగా నిలిచిన కర్నాటక జట్టు సభ్యుడు మయాంక్ చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో 2141 పరుగులు చేశాడు. హజారె టోర్నీలో 723 పరుగులు సాధించాడు. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. అంతేకాక సచిన్ రికార్డునూ అధిగమించేశాడు. లిస్ట్–ఎ క్రికెట్‌లో ఓ టోర్నమెంటులో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే ఇప్పుడు సచిన్ స్థానాన్ని మయాంక్ అగర్వాల్ కైవసం చేసుకున్నాడు. 2003లో ప్రపంచ కప్ టోర్నీలో సచిన్ టెండూల్కర్ 673 పరుగులు సాధించాడు. ఇప్పుడు విజయ్ హజారె ట్రోఫీలో మయాంక్ అగర్వాల్ 723 పరుగులు చేశాడు. దీంతోదీంతో సచిన్ రికార్డును మయాంక్ అధిగమించేశాడు.

## స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై వేటు





**న్యూఢిల్లీ:** పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై భారత ఒలింపిక్ కమిటీ బుధవారం వేటు వేసింది. ఏ టోర్నీల్లో పాల్గొనకుండా మూడేళ్ల నిషేధాన్ని విధించింది. ఈ విషయాన్ని పారాలింపిక్ వైస్ ప్రెసిడెంట్ గుర్‌శరణ్ సింహా ధ్రువీకరించారు. అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన ఏకైక భారతీయ క్రీడాకారుడు ప్రశాంత్. మహిళా స్విమ్మర్లు ఈతగొడుతుంటే ప్రశాంత్ విడియోలు తీశాడు. పైగా నియమాలను ఉల్లంఘించాడు. విచారణలో ఇది నిజమని తేలడంతో భారత ఒలింపిక్ సంఘం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కానీ కర్మాకర్ మాత్రం తన మీద వచ్చిన ఆరోపణలను ఖండించారు. తనపై కుట్ర జరిగిందని కూడా అన్నాడు. భారతీయ పారా ఒలింపిక్ సంఘం(పిసిఐ)కు చెందిన కొంత మంది అధికారులు కావాలనే తనను ఇరికించే ప్రయత్నం చేశారని అన్నాడు. ఎందుకంటే తాను పిసిఐలో జరుగుతున్న కొన్ని అవకతవకలను ఎత్తిచూపానని పేర్కొన్నాడు. ఆ తర్వాతే తనను వేరే విధంగా చూడ్డం మొదలెట్టారని, 'నీ సంగతి తెలుస్తాం' అంటూ బెదిరింపులకు దిగారని అన్నాడు. 2003లో వరల్డ్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున పాల్గొనడమే కాక పతకాన్ని కూడా సాధించాడు. 2010లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు కాంస్య పతాకాన్ని కూడా సాధించాడు. దేశానికి ఎన్నో పతకాలు తెచ్చిన ప్రశాంత్ 2016లో రియో పారా ఒలింపిక్స్‌కు వెళ్లిన స్విమ్మింగ్ జట్టుకు కోచ్‌గా కూడా పనిచేశాడు. అతడు 2011లో అర్జున, 2015లో మేజర్ ధ్యాన్‌చంద్, 2014లో భీమ్ అవార్డులు పొందాడు. ఇంతేకాక 2009, 2011లో 'స్విమ్మర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు.

## 15 ఏళ్ల విరామం తర్వాత..

### ఆసీస్ మహిళా జట్టు 'తొలి మ్యాచ్'!



**సిడ్నీ:** ఆస్ట్రేలియా అండర్19 మహిళా క్రికెట్ జట్టు సుదీర్ఘ కాల విరామం తర్వాత తొలి మ్యాచ్ ఆడేందుకు సన్నద్ధమవుతోంది. మరో రెండు నెలల్లో దక్షిణాఫ్రికా పర్యటన చేయబోతున్న ఈ జట్టు సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ జట్లతో ట్రై సిరీస్‌లో తలపడబోతోంది. దీంతో 15 ఏళ్ల విరామం తర్వాత ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు ఆడబోతోంది. ఇదివరలో చివరిసారిగా 2003లో ఇంగ్లాండ్‌తో తలపడింది. ఇదిలా ఉండగా ఆసీస్ అండర్ 19 మహిళలకు ఇదే తొలి విదేశీ పర్యటన కావడం విశేషం. ఆసీస్ మహిళా జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో 50 ఓవర్ల ట్రై సిరీస్‌తోపాటు, రెండు టి20 మ్యాచుల్లో ఆసీస్ జట్టు పాల్గొనబోతోంది. ఇందుకుగాను 14 మంది మహిళా క్రికెటర్ల జట్టును కూడా ఆసీస్ ప్రకటించింది. ఆసీస్ అండర్ 19 మహిళా వన్డే క్రికెట్ కెప్టెన్‌గా 16 ఏళ్ల రాచెల్ ట్రెనామన్‌ను, టి20 జట్టుకు కెప్టెన్‌గా సస్కియా హోర్లీని నియమించారు.

**జట్టు వివరాలు:**

స్టెల్లా క్యాంప్‌బెల్, మ్యాడీ డార్క్, హన్నా డార్లింగ్‌టన్, జోసఫైన్ డూలీ, ఎల్లెన్ ఫాల్కనర్, నికోల్ ఫాల్టున్, సస్కియా హోర్లీ, హేలీ సిల్వర్–హోమ్స్, అన్నాబెల్ సూథర్‌లాండ్, రాచెల్ ట్రెనామన్, టేటెనామన్ వ్లామ్నిక్, జార్జియా వేర్‌హం, కోర్ట్నీ వెబ్, తహ్లియా విల్సన్.

## ఆసీస్‌కు సఫారీల కళ్లెం

- రాణించిన దక్షిణాఫ్రికా బౌలర్లు
- అర్ధ శతకాలతో చెలరేగిన వార్నర్, స్మిత్
- వెలుతురు లేమితో తొందరగా ముగిసిన తొలిరోజు ఆట
- ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసిన ఆస్ట్రేలియా



**దర్బన్:** ఇక్కడి కింగ్స్‌మీడ్ స్టేడియంలో గురువారం జరిగిన తొలి టెస్టు మొదటి రోజున ఆస్ట్రేలియా క్రికెటర్లు డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ అర్ధ శతకాలు దంచేశాక దక్షిణాఫ్రికా బౌలర్లు ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్‌లను బలంగా నిలువరించారు. టాస్ గెలిచిన ఆస్ట్రేలియి ఈజీ పేస్‌డ్ పిచ్‌లో బ్యాంటింగ్‌ను ఎంచుకుంది. 5 వికెట్ల నష్టానికి ఆస్ట్రేలియా 225 పరుగులు చేశాక వెలుతురు సరిగా ఉండని కారణంగా ఆటను ఆపేశారు. రెండో కొత్త బంతిని తీసుకునేందుకు ఇంకా నాలుగు ఓవర్లు ఉండగానే ఆటను ఆపేశారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌లను నిలువరించడానికి దక్షిణాఫ్రికా బౌలర్లు ఎంతో చాకచక్యంగా బౌలింగ్ చేశారు. 3వ వికెట్‌కు వార్నర్(51), స్మిత్(56) కలసి తమ భాగస్వామ్యంలో 92 బంతుల్లో 56 పరుగులు చేశారు. టెస్ట్ క్రికెట్‌లో రెండో, మూడో ర్యాంకులో ఉన్న ఈ జట్ల మధ్య ఆట చాలా వరకు అట్రిషనల్ క్రికెట్(బ్యాట్స్‌మెన్ ఆచితూచి రిస్క్ తీసుకుని ఆడిన ఆట)లా ఆట కొనసాగింది.

వెర్నాన్ ఫిలాండర్ చక్కగా బౌలింగ్ చేసి 36 పరుగులకు 2 వికెట్లు తీసుకున్నాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ 69 పరుగులకు 2 వికెట్లు తీసుకున్నాడు. మొదటిరోజు 76 ఓవర్లలో మహారాజ్ 24 బంతులనే వేయడం వల్ల పిచ్ స్లోదనే సంకేతం కనిపించింది. స్మిత్ తన 5వ అర్ధ శతకాన్ని చేశాడు. ఇంగ్లాండుకు వ్యతిరేకంగా యాషెస్ సిరీస్‌లో చూపిన ఫామ్‌నే అతడు ఇక్కడ కూడా కొనసాగించాడు. యాషెస్‌లో అతడు 687 పరుగులు, 137.40 సగటును సాధించాడన్నది ఇక్కడ గమనార్హం.

స్మిత్ తన భాగస్వామి వార్నర్‌తో కలసి 44 బంతులాడి 24 పరుగులు చేశాడు. లంచ్‌కు ముందు వార్నర్ సెకండ్ స్లిప్‌లో క్యాచ్ అవుట్ అయ్యాడు. దక్షిణాఫ్రికా బౌలర్లు చాలా కష్టపడి ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌ను చాలా వరకు నిలువరించారు. దాంతో స్మిత్ తనకు ఇష్టమైన లెగ్ సైడ్‌కు బదులుగా ఆఫ్‌సైడ్‌లో ఆడాడు. మహారాజ్ వేసిన బంతి బౌన్స్ అయి వికెట్‌కీపర్ క్వింటన్ డికాక్ గ్లోవ్స్ నుంచి స్లిప్‌లో డివిలియర్స్‌కు పోవడం చూసి స్మిత్ కాస్త నిరాశ(ఫ్రస్ట్రేషన్)ను కనబరిచాడు. టీ విరామం తర్వాత మహారాజ్ మళ్లీ విజృంభించాడు. కొత్త స్పెల్‌లో తన నాలుగో బంతికి షాన్ మార్ష్‌ను అవుట్ చేశాడు. మార్ష్ స్లిప్‌లో క్యాచ్ అవుట్ అయ్యాడు. అసలు మార్ష్ రబాడ వేసిన యార్కర్ బంతికి 19 స్కోరు ఉన్నప్పుడే పెవిలియన్‌కు వెళ్లిపోవలసింది. టెలివిజన్ రిప్లేల్లో ఇదే స్పష్టంగా కనబడింది. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన అతడిని నాటౌట్‌గా ప్రకటించడంతో నిలబడ్డాడు. దక్షిణాఫ్రికా తన రెండు సమీక్షలను ఉపయోగించుకుంది. ఎల్‌బిడబ్ల్యుపై ధర్మసేన ఇచ్చిన నిర్ణయంపై కూడా సమీక్షించింది. కానీ దాన్ని ఛాలెంజ్ చేయలేదు. ఆటను అంపైర్లు ఆపేయడానికి ముందు మిచెల్ మార్ష్, టిమ్ పెయినె అజేయంగా 48 పరుగులను జత చేశారు. దీంతో సఫారీల సొంత గడ్డ అనుకూలతను, ఆశలను వారు నీరుగార్చినట్లయింది.

సఫారీలు మొదట్లోనే రెండు వికెట్లు తీసుకున్నారు. కెమెరాన్ బాన్‌క్రాఫ్ట్ , ఉస్మాన్ ఖ్వాజాలు క్యాచ్ అవుటయ్యారు. కానీ వార్నర్, స్మిత్ తమ బ్యాటింగ్‌తో రాణించారు. తర్వాత ఫిలాండర్ లంచ్‌కు ముందు చెలరేగి బ్యాటింగ్ చేశాడు. వార్నర్ సెకండ్ స్లిప్‌లో డివిలియర్స్‌కు క్యాచ్ అవుటయ్యేంత వరకు చెలరేగి ఆడాడు. వార్నర్ 79 బంతులు ఎదుర్కొని ఆరు ఫోర్లు దంచేశాడు.

### స్కోరు బోర్డు :

**ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్:** 225/5 (76.0 ఓవర్లు): కెమెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ (సి) డికాక్(బి) ఫిలాండర్ 5, డేవిడ్ వార్నర్ (సి)డి విలియర్స్(బి)ఫిలాండర్ 51, ఉస్మాన్ ఖ్వాజా (సి) డికాక్(బి) రబాడ 14, స్టీవెన్ స్మిత్ (సి)డివిలియర్స్(బి) కేశవ్ మహారాజ్ 56, షెన్ మార్ష్ (సి) డివిలియర్స్(బి)కేశవ్ మహారాజ్ 40, మిచెల్ మార్ష్(బ్యాటింగ్) 32, టిమ్ పెయినె(బ్యాటింగ్)21.
**ఎక్స్‌ట్రాలు: 6, మొత్తం:** 225, వికెట్ల పతనం: 1–15, 2–39, 3–95, 4–151, 5–177. బౌలింగ్: మోర్నె మార్కెల్ 16–3–48–0, ఫిలాండర్ 17–8–36–2, కేశవ్ మహారాజ్ 24–4–69–2, రబాడ 16–4–58–1, ఎయిడెన్ మార్క్‌రమ్ 1–0–2–0, థినిస్ డి బ్రుయిన్ 2–0–6–0.



## కామన్వెల్త్ గేమ్స్‌కు తెలంగాణ బాక్సర్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టును ప్రకటించారు. ఎలాంటి ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేసిన ఈ జట్టులో తెలంగాణకు చెందిన యువ బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ (56 కిలోలు) చోటు దక్కించుకున్నాడు. గతవారం జరిగిన స్ట్రాండ్జా టోర్నీలో హుస్సాముద్దీన్ కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే. పురుషుల జట్టులో 8మంది, మహిళల జట్టులో ముగ్గురిని ఎంపికచేశారు.



**జట్ల వివరాలు:** పురుషులుఅమిత్ ఫాంగాల్ (49 కి.), హుస్సాముద్దీన్ (56 కి.), మనీష్ కౌశిక్ (60 కి.), మనోజ్ కుమార్ (69 కి.), వికాస్ క్రిషన్ (75 కి.), సతీశ్ కుమార్ (+91 కి.), సుమిత్ సాంగ్వాన్ (91 కి.), గౌరవ్ సోలంకి (52 కి.); మహిళలుమేరీకోమ్ (48 కి.), లోవ్లినా బోర్గోహిన్ (51 కి.), సరితా దేవి (60 కి.).



## డోపింగ్‌లో పట్టుబడిన భారత అథ్లెట్

### జావెలిన్ త్రోయర్ దావిందర్‌పై నిషేధం ఖాయం..

**న్యూఢిల్లీ:** భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ కలకలం. టాప్ జావెలిన్ త్రోయర్ దావిందర్‌సింగ్ కాంగ్ డోప్ పరీక్షలో పట్టుబడ్డాడు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన డోప్ పరీక్షలో దావిందర్ విఫలమైనట్లు ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య బుధవారం ప్రకటించింది. నిరుడు నవంబర్ 10న భారత్‌లోని పటియాలాలో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య (ఐఎఎఫ్) ఆధ్వర్యంలోని అథ్లెటిక్స్ స్వచ్ఛత విభాగం (ఎఐయూ) అథ్లెట్లకు డోప్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షల్లో దావిందర్ నిషేధిత అనబాలిక్ స్టెరాయిడ్‌ను వాడినట్టు తేలిందని ఎఐయూ తెలిపింది. వాడా నిబంధనల ప్రకారం దావిందర్‌పై నాలుగేళ్ల నిషేధం పడే అవకాశముంది.

## ఐసిసి వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలు

**దుబాయ్:** తొలిసారిగా ఐసిసి క్రికెట్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ 2018 మ్యాచ్‌లను టెలీ ప్రసారాలను అభిమానులకు అందించబోతున్నట్లు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) తెలిపింది. ఈ ప్రసారాలు ఐదు ఖండాల్లోన 200 ప్రాంతాల్లో ప్రసారం కానున్నాయి. 'ప్రపంచవ్యాప్తంగా 10 మ్యాచ్‌లను ప్రసారం చేస్తాం. దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రసారకులతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంటాం. చాలా మంది ప్రేక్షకులకు ప్రసారాలు అందేలా చూస్తాం' అని ఐసిసి తన ప్రకటనలో తెలిపింది. క్రికెట్ అభిమానులు తమ మొబైల్ ఫోన్లలోనూ ఐసిసి ప్రత్యక్ష ప్రసారాలను చూడొచ్చు. 19 కెమెరాలు, ఏడుగురు వ్యాఖ్యాతలు– ఇయాన్ బిషప్, ఎంపుమలెలో మంబంగ్వా, లిసా స్తేలేకర్, దీప్ దాస్ గుప్తా, ఫజీర్ మహ్మద్, మార్క్ బచర్, డిర్క్ నన్నెస్ వ్యాఖ్యలతో ఈ ప్రత్యక్షప్రసారాలు అభిమానులను అలరించనున్నాయి.

'ఐసిసి క్రికెట్ వరల్డ్ కప్ క్వాలిఫయర్ అనేది చాలా ముఖ్యమైన టోర్నమెంటు. వచ్చే ఏడాది ఇంగ్లాండ్, వేల్స్‌లో ఆడే క్రికెట్ ప్రపంచ కప్‌కు చివరి అవకాశాన్ని అందించేది. దీంతో క్రికెట్‌లో కొన్ని ఆసక్తికర మ్యాచ్‌లు చూసే వీలుంటుంది. కొత్త హీరోలు తెరపైకి రావొచ్చు. ప్రసార బృందంలో నేనూ భాగం పంచుకునేందుకు ఆత్తుతతో ఉన్నాను. రసవత్తరమై క్రికెట్ మ్యాచ్‌ల కోసం ఎదురుచూస్తున్నాను' అని లిసా స్తేలేకర్ అన్నారు. ఆటకు ముందు 15 నిమిషాల పాటు ప్రీగేమ్ బిల్డప్ ప్రసారంలో టాస్, పిచ్ రిపోర్టు వంటివి చూపనున్నారు. ఆట ముగిశాక 10 నిమిషాల పాటు 'ప్లేర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రసారంతో పాటు ఇద్దరు కెప్టెన్ల మాటామంతీ ఉంటాయి. ఐసిసి ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ జట్లు: జింబాబ్వే, వెస్టిండీస్, అఫ్ఘానిస్థాన్, ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్‌లాండ్స్, పపువా న్యూగినియా, హాంకాంగ్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. మొత్తంగా 34 మ్యాచ్‌లు జరగనున్నాయి. పది జట్లను రెండు గ్రూపులుగా విడగొట్టనున్నారు. టాప్ మూడు జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకోనున్నాయి. రెండు గ్రూపులలోని టాప్ జట్లు 2019 ప్రపంచ కప్‌కు క్వాలిఫై కానున్నాయి.




Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.